RNI No. APTEL/2003/12253

# భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 21 Issue No. 8 Monthly Aug 2024 ISSN No. 2456-4702 Rs. : 15/-




ఆచార్యులకు, అధ్యాపకులకు, విద్యార్థినీ, విద్యార్థులకు, పాఠకులకు 78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు...



## మానవ కవి

# దేవరకొండ బాల గంగాధర తిలక్

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# భావవీణ

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)



# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522 034.
Mail : bhavaveena2024@gmail.com
Cell : 99499 29674, 79890 88274.

# BHAVAVEENA

(MONTHLY MAGAZINE)

Journal - Arts, Literature, Culture and Language Study

ISSN No. : 2456-4702
RNI No. : APTEL/2003/12253

| | | |
|---|---|---|
| ముద్రణ | : | **ఆగష్టు - 2024** |
| ప్రతులు | : | **500** |
| వెల | : | **రూ. 15/-** |
| కాపీలకు | : | **డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| గమనిక | : | **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - సంపాదకవర్గం.** |
| ఎడిటోరియల్ చిరునామా | : | **డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| డి.టి.పి & ప్రింటింగ్ | : | **తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్ గుంటూరు జిల్లా, సెల్ : 94 94 660 509.** |




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

***Founder :***
Kolla Sri Krishnarao (Late)

***E-mail :***
bhavaveena2024@gmail.com

7989781963
9949929674
☎ 7989088274

# 135-14-716, Dwaraka Nagar,
12th Lane, Nagaralu, Guntur - 522034.

**Vol. 21 - Issue. 8 - August 2024 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



**EDITORIAL BOARD**

*Honourable Editor*
**Dr. PITTA SANTHI**
*M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),Ph.D.*

*Chief Editor*
**Dr. PAYARDA NAGAIAH**
*M.A.(Tel), M.A(Pol-Sci).,M.Ed.,Ph.D.*
# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

**ADVISORY COMMITTEE**

1. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Vice Chancellor,
   Dravidian University, Kuppam, A.P.
2. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Hyderabad Central University, Hydetabad, Telangana.
5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   Associate Professor, Dept. of Telugu &
   Chairman, BOS Philothrophy & Religion Studies,
   Andhra University, Visakhapatnam, A.P.
7. **Prof. T. Rama Prasad Reddy**
   Dean, Faculty of Arts & Education,
   Yogi Vemana University, Kadapa, Andhra Pradesh.
8. **Dr. T. Swarupa Rani,** M.Sc., M.Ed., M. Phil., Ph.D.
   Principal,
   St.Joseph's College of Education for Women,
   Sambasivapet, Guntur, Andhra Pradesh.

**ASSOCIATE EDITORS**

1. **Dr. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   HOD, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI,
   Tamilnadu.

3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.

4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.

5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.

6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
University of Hyderabad, Gachibowli - 46,
Hyderabad, Telangana.

11. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Vice Principal,
Govt. Degree College, Yemmiganuru.

12. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University,
Mahabobnagar, Telangana.

**LEGAL ADVISER**

**Pitta Sundara Babu**, ***M.A., B.L.,***
Advocate, Narasapur.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, Guntur - 2. Cell : 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed and Published by Dr. P. Nagaiah, #135-14-716, Dwaraka Nagar, 12th Lane,
Nagaralu, GUNTUR - 522 034. Andhra Pradesh. Cell : 9949929674, 7989088274.
E-mail : bhavaveena2024@gmail.com. Printed at : GLS Enterprises, Guntur - 2. Ph. 94 94 660 509.

## మానవ కవి

# దేవరకొండ బాలగంగాధర తిలక్

(జననం : 01 ఆగష్టు 1921 - మరణం : 01 జులై 1960)

తెలుగు కవి, రచయిత, సాహితీవేత్త, గొప్ప అభ్యుదయవాది దేవరకొండ బాల గంగాధర తిలక్. వీరు పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలంలోని మందపాక గ్రామంలో 1921 సంవత్సరం ఆగష్టు 1న తిలక్ సంపన్న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి సత్యనారాయణమూర్తి, తల్లి రామ నాదెమ్మ. తిలక్ పన్నెండు మంది సంతానంలో ఆరవవాడు. మగ పిల్లల్లో రెండవ సంతానం. తిలక్ చిన్నతనంలోనే వారి కుటుంబం మండపాక నుండి తణుకు వచ్చింది. తరువాత ఇంటర్ మద్రాసు లయోలా కాలేజిలో చేరాడు. అక్కడ తిలక్ అనారోగ్యం వల్ల చదువును మధ్యలో ఆపేసి తిరిగి తనుకు చేరుకున్నారు. ఆ తరువాత విశాఖపట్టణంలో ఎ.వి.యన్. కళాశాలలో చేరారు. కాని అక్కడ కూడా ఇంటర్ పూర్తి చేయలేదు. మరల తణుకు చేరుకున్నారు. నెమ్మదిగా సాహిత్యం వైపు దృష్టి మళ్ళించారు.

తిలక్ తన జీవితం అంతా దాదాపు తణుకులోనే గడిపారు. వారు పెద్దగా ప్రయాణాలు కూడా చేసేవారు కాదు. తన జీవితంలో ఎలాంటి ఉద్యోగం కూడా చేయలేదు. ఎప్పుడూ ఇంట్లోనే ఉంటూ పుస్తకాలను చదువుతూ ఉండేవారు. స్నేహితులతో సరదాగా గడిపేవారు. తన ఆసక్తి కలిగినప్పుడు మాత్రమే రచనలు చేసేవారు. అతనికి దాదాపు ఐదారు వేల పుస్తకాలతో ఒక సొంత గ్రంథాలయం ఉండేది. వారి పూర్తి సమయం పూర్తిగా సాహిత్యంపై దృష్టిని కేంద్రీకరించారు. తిలక్ ఇందిరాదేవితో వివాహం వీరి అన్యోన్య దాంపత్యానికి గుర్తుగా ముగ్గురు పిల్లలు. ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. పెద్ద కుమారుడు సత్యనారాయణమూర్తి, చిన్న కుమారుడు సుబ్రహ్మణ్యం, కూతురు పేరు చంద్రలేఖ.

తిలక్ పాఠశాల స్థాయి నుండే సాహిత్యం పట్ల ఆసక్తిని పెంచుకున్నారు. చిన్న చిన్న రచనలు చేసేవారు. తన పదకొండవ ఏట కథా రచన, పదిహేనేళ్ళ వయస్సులో పద్య రచన చేశారు. 1942 సంవత్సరంలో తన 21వ ఏట తిలక్ రచనా వ్యాసంగంలో అత్యున్నత స్థాయికి చేరుకున్నారు. కాని అది ఎంతోకాలం నిలువలేదు. 1945 సంవత్సరం తన తండ్రి మరణంతో వారు మానసికంగా చాలా కృంగిపోయారు. దాదాపు పది సంవత్సరాల పాటు సాహిత్యానికి దూరంగా ఉండిపోయారు. ఏమీ రాయకుండా ఇంటి ఉండి బయటకు రాకుండా మనోవేదనకు గురయ్యారు. 1945 నుండి 1955 వరకు తిలక్ తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో నరకం అనుభవించారు. తరువాత 1956 ప్రాంతంలో తిలక్ రచనలు వ్రాయడం మళ్ళీ ప్రారంభించారు. ఆయనపై మెనోగ్రాఫ్ రాసిన విమర్శకుడు ఇంద్రగంటి శ్రీకాంత్‌శర్మ 1955-56 “ఈ కాలంలోనే తిలక్ పరిపూర్ణ కవితా, కథానికా, భావ వికాసాలు, ప్రతిభా శిఖరారోహణ మనకు దర్శనమిస్తాయని” పేర్కొన్నారు. మరొక విమర్శకుడు, కవి ఆవంత్స సోమసుందర్ తిలక్ జీవితంలో చివరి దశాబ్దం (1955-56) మహోజ్వలమైంది” అని రాశారు. ఆరోగ్యం మెరుగుపడడంతో ఆయన సాహిత్య రచన ఉజ్జ్వలదశకు చేరుకుంది.

1940ల్లో తిలక్ కవిత్వ రచన ప్రారంభించారు. వీరు కూడా మొదట్లో భావ కవిత్వంకు ప్రాధాన్యతను ఇచ్చినా.. తరువాత కాలంలో అభ్యుదయ కవిత్వం వైపు తన దృష్టిని మరల్చినారు. భావ కవుల ప్రభావంతో ఛందస్సులోని పద్యాలను ఖండ కావ్యాలుగా వ్రాశారు. వాటిలో గోరు వంకలు, స్వయంవరం, అవాహన, వర్షా, మధు విరహం, శర్వదీప్రియ, ఆటవెలది, శ్రీవివేకానందస్వామి, సీత-1, సీత-2, అద్వైతమాన్మథం, అమృతభావము వంటి ఖండకావ్యాలను రచించారు. వీటిని తిలక్ మరణానంతరం ఆయన పెద్ద కుమారుడు డా॥. సత్యనారాయణమూర్తి 1991లో ఈ ఖండకావ్యాలన్నింటిని స్వీకరించి “గోరు వంకలు” అనే సంపుటితో ప్రచురించారు.

తిలక్‌ది ఎంత సున్నితమైన మనస్తత్వమో... అతని కవిత్వం అంత నిశితమైంది. భాష ఎంత మధురమైందో.. భావాలు అంత పదునైంది. ఆయనకు తెలుగు ఇంగ్లీషులలో చక్కని పాండిత్యం ఉంది.

తిలక్ మొదట్లో దేవులపల్లి కృష్ణశాస్త్రి ప్రభావంతోనూ తరువాత శ్రీశ్రీ ప్రభావంతో కవిత్వం వ్రాసినా.. వచన కవితా ప్రక్రియను తన అసమాన ప్రతిభా సంపదతో ఉన్నత శిఖరాలకు తీసుకొనివెళ్ళిన ప్రముఖుడు తిలక్. తిలక్ రచనలు 1) కవితా సంపుటాలు : అమృతం కురిసిన రాత్రి, ప్రభాతము - సథ్య, గోరువంకలు, కఠినోపనిషత్తు, 2) కథానికలు (సంపుటాలు) వాటిలో తిలక్ కథలు (1967), సుందరీ సుబ్బారావు (1961), ఊరి చివరి ఇల్లు (1961), 3) నాటకాలు వాటిలో ముఖ్యమైనవి 1. సుశీల పెళ్ళి (1961), 2. సాలె పురుగు, 3. నాటికలు వీటిలో ముఖ్యమైనవి 1. సుచిత్ర ప్రణయం (1961), ఇరుగు - పొరుగు (1960), సుప్తశిల (1967), పోగు, భరతుడు, 4. లేఖా సాహిత్యం దీనిలో తిలక్ లేఖలు (1968) నవత మొదలగునవి తిలక్ ముఖ్య రచనలు.

తిలక్ రచనా సాహిత్య గొప్పతనం చూసి ఆయనను ఎందరో సాహితీవేత్తలు, ఎంతగానో ప్రశంసించారు. వారిలో ప్రముఖ మార్క్సిస్టు విమర్శకుడు రా.రా., చికాలు సుందరయ్య, శ్రీశ్రీ, వేలూరి వేంకటేశ్వరరావు మొదలగున వారు చాలా గొప్పగా ప్రశంసించారు. “అమృతం కురిసిన రాత్రి” ఉత్తమ కథా సంపుటిగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును 1971 పొందింది.

తిలక్, సృజజశక్తి వవిధ ప్రక్రియల్లో విజృంభిస్తున్న సమయంలో ఆయన నలభై అయిదేళ్ళ వయసులో 1966 జులై 1న అనారోగ్యంతో మరణించారు. కాని తిలక్ తన రచనలు ముద్రించి పుస్తక రూపంలో చూసుకోవాలనుకున్నారు. అంతేకాక ఒక సాహితీ పత్రికను కూడా స్థాపించాలనుకున్నారు. కాని అవేమీ తీరకుండానే చనిపోయారు. తరువాత తన పెద్ద కొడుకు సత్యనారాయణమూర్తి ఇంగ్లాండ్‌లో వైద్యుడిగా స్థిరపడ్డారు. ఆయన తన తండ్రి రచనలు ముద్రించి బాహ్యప్రపంచానికి అందించారు. చిన్న కుమారుడు సుబ్రహ్మణ్యం అమెరికాలోను, కూతురు చంద్రలేఖ ఆస్ట్రేలియాలో స్థిరపడ్డారు. ఇలాంటి గొప్ప సాహితీవేత్త జయంతి సందర్భంగా వారిని స్మరించుట ఎంతైనా అవసరం ఉంది.

- చీఫ్ ఎడిటర్

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | లంబాడాల చారిత్రక నేపథ్యం - పూర్వాపరాలు | - డా॥. లక్ష్మణ్ నాయక్ బాణోత్ | 8 |
| 2. | తెలుగు జాతి కవి చేమకూర వేంకటకవి | - డా॥. పొదిలి నాగరాజు | 11 |
| 3. | దళిత సాహిత్య విమర్శ - తెలుగు కవిత అభినవ దృక్పథం | - డా॥ మంథని శంకర్ | 16 |
| 4. | దైవశాసనం నాటకం - అవినీతి మిగిల్చిన విషాదం | - డా॥. పురుషోత్తం గుంట | 24 |
| 5. | తెలుగు నాటక సాహిత్యం - ఆరంభ వికాసాలు | - డా॥. కె. చిదానంద | 27 |
| 6. | తెలంగాణ కథా సాహిత్యం - కాలువ మల్లయ్య కథలు | - బి. ప్రవల్లిక | 31 |
| 7. | డా॥ తరపట్ల యజ్ఞం - సమకాలీన సమస్యల చిత్రణ | - అన్నపూర్ణ బత్తుల | 37 |
| 8. | మొల్ల రామాయణంలో విశిష్ట పాత్రలు - సామాజిక అంశాలు | - మరపట్ల రాజు | 41 |
| 9. | కొలకలూరి ఇనాక్ 'వలస' నవల - మానవతా దృక్పథం | - తుమ్మలపల్లి సోమశేఖర్ | 45 |
| 10. | దోర్నాదుల సుబ్బమ్మ కథలు - స్త్రీ అస్థిత్వం | - ముద్దా అనిత & | 49 |
| | | - డా॥. డి. యువశ్రీ | |
| 11. | ఈ పాటకు యాభై ఏండ్లు | - ఏ. హరిబాబు | 52 |
| 12. | ఆధునిక వచన కవిత్వం - శైలి, శిల్పం | - రాఘవేంద్ర రావు | 54 |
| 13. | సి.నా.రె. కవితా పరిణామం - శిల్పవైవిధ్యం | - వి.ఎల్. నరసింహారావు | 58 |
| 14. | ఉత్తర తెలంగాణ కథలు - సామాజిక జీవన చిత్రణ | - ప్రసన్న లక్ష్మి మాదిరాజు | 62 |
| 15. | Medipandu - Fig Fruit | - Dr M. Koteswara Rao | 68 |
| 16. | Bama's Karukku - A Struggle for Survival | - Dr. S. Hemalatha | 74 |

# లంబాడాల చారిత్రక నేపథ్యం - పూర్వపరాలు

- డా॥. లక్ష్మణ్ నాయక్ బాణోత్, ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆలేర్, యాదాద్రి, భువనగిరి జిల్లా.

భారతదేశంలో సనాతన కాలం నుంచి అనేక జన సమాజాలు సమ్మిళితమై తమ ప్రత్యేక సంస్కృతిని జీవనదిలా సంరక్షించుకుంటూ అవిచ్ఛిన్నంగా విరాజిల్లుతున్నాయి. ఈజిప్టు, టర్కీ, మెసపటోనియా మొదలైన కొన్ని దేశాలు తమ ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలను వదలుకొని ఆధునిక నాగరికత నడకలతో విలసిల్లుతున్నాయి. భారతదేశ సుసంస్కృత చూసి ఓర్వలేని ఎన్నో సమాజాలు దండెత్తి వచ్చినప్పటికిని సుమారు ఐదువేల సంవత్సరాలకు పైబడిన సింధూ (హిందూ) నాగరికతా మహానదిలో పాయలుగా మారి వైదిక మత సంప్రదాయంలో సర్వమానవ మతాల సమ్మేళనంతో సమైక్య భారతావని విలసిల్లుతున్నది.

భారతదేశం కాశ్మీరు నుంచి కన్యాకుమారి వకు భౌగోళికంగా, జాతిపరంగా, మతపరంగా, రాజకీయ పరంగా భిన్నత్వంలో ఏకత్వంతో వర్ధిల్లుతోంది. సనాతనం నుంచి గ్రీకులు, శకులు, హుణులు, ముస్లింలు, పోర్చుగీసు, డచ్చి, ఫ్రెంచి, ఆంగ్లేయులు భారతదేశం పైకి దండెత్తివచ్చి ఇక్కడే స్థిరవాసులై భారతీయ సంస్కృతిలో భాగస్తులైనారు. 'అందుకే విదేశీయులు భారత సంతతి వివిధ జాతుల సముదాయమని భిన్న జాతుల ప్రదర్శనశాల' (Museum of Races) అని వర్ణించారు.

అనాది నుంచి వివిధ ఆదిమ జాతులు, గిరిజనులు, ఆటవికులు, నాగరికులు మొదలగు అనేక సమాజల, సంస్కృతుల సమాహారం భారతదేశం. గిరిజన తెగలలో లంబాడాలతో సహ ఒక్కొక్క తెగ యొక్క భాషా సంస్కృతీ సాహిత్యాలు ఒక్కో మహాసాగరంలా విలసిల్లుతున్నాయి.

**గిరిజన విజ్ఞానం - లంబాడాలు (Tribal Lore - Lambadas) :**

గిరి ప్రాంతాల్లో నివసించేవాళ్లను గిరిజనులని, అడవి ప్రాంతాల్లో నివసించే వాళ్లను ఆటవికులని, సంచారం చేస్తూ జీవించే వాళ్లను సంచారులని సామాన్యంగా వ్యవహరిస్తుంటారు. ఈ జాతులన్నింటిని ఆదిమ జాతులని పరిగణించటం జరుగుతున్నది.

"భారతదేశంలోని మొత్తం జనాభాలో దాదాపు 7 శాతం ఆదిమ జాతులున్నట్టు గణాంకాలు తెలుపుతున్నాయి. భారత ప్రభుత్వం 1950లో 571 ఆదిమ జాతుల్ని Scheduled Tribes గా పరిగణించింది.

'మానవుడికి సంబంధించిన' మానవ శాస్త్రమును ఇంగ్లీషులో "Anthropology" అంటారు. "Anthropos" అంటే మానవుడు "Logos" అంటే శాస్త్రం. మానవశాస్త్రం మానవాభ్యుదయానికి కృషి చేస్తుంది. అది రాజకీయ వ్యవస్థలు, ఆర్థిక విధానాలు, సామాజిక నడవడుల ప్రాచీన స్వరూపాలని పరిశీలించడమే కాక మానవ సంస్కృతిని, వికాసాన్ని వెలికి తీయడానికి సిద్ధాంతాలను ప్రవేశపెడుతుంది. అంతేగాక ప్రపంచం లోని విభిన్న జాతులను గురించి పరిశోధన జరిపి ఆయా జాతుల సమస్యల్ని పరిష్కరించడానికి పూనుకుంటోంది. ఆంధ్రప్రదేశ్‌లో 1976 సెప్టెంబర్ 18వ తేదీన జారీ అయిన 108 నెంబరు చట్టంలో షెడ్యూలు తెగల జాబితాలో మొత్తం 32 తెగలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ 1981 జనాభా లెక్కల ప్రకారం మొత్తం 33 షెడ్యూలు తెగలు నమోదయ్యాయి. అవి అంద్, బగత, భిల్, చెంచు, గొండు, కోయ, లంబాడా మొదలైనవి.

'నేటికాలంలో ప్రపంచ మానవుల్ని రెండు రకాలుగా గుర్తించవచ్చు. ఇందులో మొదటి రకం వారు ప్రపంచ పరిస్థితులు, నాగరికతను అవగాహన చేసుకొని జీర్ణించుకొన్న సభ్య సంఘీయులు. రెండో రకం సభ్య సంఘానికి దూరంగా నివసిస్తూ అడవుల్లో, కొండ గుహల్లో కాలం గడుపుతూ ప్రత్యేకంగా తమ సాంఘీక చట్టం, నడవడులు, మతం, విజ్ఞానం మొదలైన వాటిని నిర్మించుకొన్న వాళ్లు. ఆంధ్రప్రదేశ్‌లోని 33 తెగలవారు మొదటిరకంలో

చేరుతారనడంలో సందేహం లేదు. వీళ్లు అడవుల్లో వున్నా నాగరిక ఛాయలు కన్పిస్తాయి. పూర్తిగా అనాగరిక గిరి జనులు కూడా వున్నారు.

'ఆదిమ వాసుల్ని' "Aboriginals" అంటారు. వీళ్లు చిన్న చిన్న సమూహాలుగా నివసిస్తారు. వీళ్లు అనాగరికులు. వీళ్ల ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, పద్ధతులు అన్ని భిన్నంగా ఉంటాయి. ఆంగ్లములో వీరిని "Tribes" అంటారు. డా॥. అయ్యప్పన్ హిందూమతం అవలంభించే వాళ్లని Caste పేరుతోను తక్కిన వాళ్లను Tribes అనే పేరుతోను పిలిచారు.

Any Primitive or barbarous under a chief with a Common Language and Sense of solidarity and who trace their descent from a common ancestor అన్న శాస్త్రకారుని వివరణ Tribe అన్న పదానికి సరి పోతుంది. శ్రీ సోమసుందరం గారు తమ మానుష శాస్త్రం ఆదివాసులు అన్న గ్రంధంలో ఆదిమ నివాసుల్ని గురించి వివరిస్తూ 'ఆదిమ నివాసులంటే ఆర్యాక్రమణకు పూర్వం మన దేశమందు నివసిస్తూ ఆర్యుల చేత తరుమబడి కొండగుహల్లోను, అరణ్య ప్రాంతాల్లోను తలదాచుకొని ప్రస్తుత నాగరికతా ప్రపంచానికి దూరమై మన కళ్లకు మృగాలతో సమానంగా కన్పిస్తూ ఆర్యుల తాకిడికి గురైనా సభ్య సంబంధం వల్ల తమ తమ ప్రత్యేక ఆచార సంప్ర దాయ విశిష్టతలను కోల్పక చిన్న చిన్న గుంపులుగా కాలం వెళ్లబుచ్చుకొంటున్న జాతులని నిర్వచించారు'.

'సుమారు ఆరు వేల సంవత్సరాలకు పూర్వమే ఆర్యులు ఆసియా మధ్యభాగం నుండి యూరపు దేశాలకు కొందరు పారశీక దేశానికి మరికొందరు చెదిరి పోయినారనీ భారతదేశానికి ఆర్యులు ఆరుదెంచి పంజాబ్ నుంచి ఈశాన్య దిశగా ఢిల్లీకి వెళ్లి ఉత్తరంగా ప్రవహిస్తున్న సరస్వతీ నదికి ఇరువైపుల వ్యాపించినారని చరిత్రకారులు వక్కాణిస్తున్నారు. అంతేగాక యూరపులోని గ్రీకు, లాటిన్ భాషలు ఆసియాలోని పారశీక భాష వేదకాలం నాటి సంస్కృత భాష ఆనాటి ఆర్యభాషకు సంబంధించినవే అని భాషా శాస్త్రవేత్తల అభిప్రాయం. అందువల్ల ఈ భాషను మాట్లాడే వాళ్లంతా ఆర్యజాతికి సంబంధించిన వాళ్లని యూరోపియన్ చరిత్రకారులు నిర్ణయించారు.

అయితే ఆధునికకాలంలో ఈ సిద్ధాంతం నిలబడు తుందా? ఈనాడు 'ఆర్య' సిద్ధాంతానికి కాలం చెల్లింది. 'ఆర్య' అంటే ఒక ప్రత్యేక తరహా భాష మాట్లాడే కొన్ని సామాజిక వర్గాల వాళ్లూ కొన్ని ప్రత్యేక ఆచారాలున్న వాళ్లూ అని చెప్పవచ్చు ఆయా వర్గాలకు జాతికి సంబంధం లేదు. వైదిక వాఙ్మయంలో 'ఆర్య' అనే పదం గౌరవ చిహ్నం 'ఆర్య' అనే పదం జాతికి కాకుండా ఒక వ్యక్తి సామాజిక స్థానాన్ని మాత్రమే సూచిస్తుందని ప్రముఖ చరిత్రకారులు రోమిలా థాపర్ వివరించారు."

"కొన్ని కుటుంబాలు లేదా తెగలు ఏకమై ఒక జాతి (Tribal) గా రూపొందుతుంది. జాతి అనేది సంఘం యొక్క ప్రాచీన రూపాల్లో ఒకటి. ఆదిమ జాతి అంటే ప్రాంతీయ సంబంధం ఉన్న అంతర్వివాహాలు చేసు కొంటూ వంశపారంపర్యంగా ఏర్పడిన జాతి నాయకులచే పాలింపబడుతూ, ప్రత్యేక వృత్తులు లేకుండా, ఒకే భాష మాట్లాడుతూ, ఇతర జాతులకు సాంఘృకోపవాదాలకు దూరంగా ఉండి, తమ తమ జాతి సంప్రదాయాలను ఆచారాల్ని, నమ్మకాల్ని అనుసరిస్తూ విదేశీ భావాలతో పొత్తుగలువకుండ జాతీయ ప్రాంతీయ భావావేశం కలిగి ఉన్న 'సాంఘీక గణం' లేదా 'జాతి' ఆదిమజాతిగా పేర్కొనబడి ఉండవచ్చు లేదా అలా పేర్కొనబడి ఉం డకపోవచ్చు. సంపూర్ణంగానో, అసంపూర్ణంగానో నాగరికతా ప్రభావానికి లోబడి ఉండవచ్చు"

ఈ అంశాలను పరిశీలిస్తే ఒక ప్రత్యేకమైన సంస్కృతిని కల్గిన సమాజాల్ని అని చెప్పవచ్చు. వీళ్ల సంస్కృతి గ్రామ, పట్టణ సంస్కృతుల కంటే భిన్నంగా ఉంటుంది. వీళ్ల సమాజంలో రక్త సంబంధానికి అధిక ప్రాధాన్యం కన్పి స్తుంది. ప్రత్యేక జీవన విధానం, ఆచార సంప్రదాయాలు, భాష, కఠినమైన న్యాయపరమైన విధానాలు కలిగిన సమాజాలనే లేదా సామాజిక సమూహాలనే సాంస్కృతిక మానవశాస్త్రంలో Tribals అంటారు.

"ఆంగ్లంలోని "Tribe" అనే పదానికి సమానార్థకంగా మనం 'ఆదిమజాతి', 'ఆదిమ నివాసి', 'గిరిజన' అనే పర్యాయ పదాల్ని వ్యవహరిస్తున్నాం. వీళ్ల విజ్ఞానాన్ని ఆంగ్లములో "Tribal Lore" అంటారు. మనం దీనికి సమానార్థకంగా గిరిజన విజ్ఞానం అంటున్నాం. కన్నడంలో

'ఆదివాసి జానపద' అన్న పదం వ్యవహారంలో ఉంది. హైదరాబాదులోని ఆదిమజాతులకి శిక్షణ సంస్థ 'ఆదివాసి సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణ అన్న పేరుతో ఉంది. పైన పేర్కొన్న ఆదిమజాతి, ఆదిమవాసులు, గిరిజనులు అన్న పదాలకు సమానంగా 'ఆదివాసి' పదాన్ని స్వీకరిస్తే సమంజసమనిపిస్తుంది. వీళ్ళ విజ్ఞానాన్ని 'ఆదివాసి' విజ్ఞానం (Tribal Lore) అంటే సరిపోతుంది.

గిరిజన శబ్దం కేవలం కొండలు, గుట్టల్లో నివసించే ప్రజలకు మాత్రమే పరిమితంగా కన్పిస్తుంది. ఈ ఆదిమ వాసులు కేవలం కొండలు, గుట్టల్లో మాత్రమే కాకుండా మైదాన ప్రాంత గ్రామాల్లో కూడా నేడు నివసిస్తూ ఉండడం వల్ల వీళ్ల విజ్ఞానం అపరిమితంగా ఉన్నందువల్ల ఈ విజ్ఞానాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం ఉన్నందువల్ల Tribal Lore అన్న పదానికి సమానార్థకంగా 'ఆదివాసి విజ్ఞానం అన్న పదాన్ని స్వీకరించి అధ్యయనం చేయడం సమంజసమనిపిస్తుంది. అయితే గిరిజన విజ్ఞానం అన్న పదం చాలాకాలంగా ప్రాచుర్యంలో ఉన్నందువల్ల ఈ పదాన్నే స్వీకరించడం మంచిది.

మానవశాస్త్ర అధ్యయనం వల్ల ఆదిమ మానవులు లేదా గిరిజన సంస్కృతి స్వరూపం వెల్లడవుతుంది. అంతేగాకుండా ఇది నగర లేదా గ్రామీణ సంస్కృతులకు ఎలా పూరకంగా ఉంటుందో విశదపరుస్తుంది. గిరిజనుల్ని గురించి అధ్యయనం చేయాల్సిన ప్రధాన కారణాల్లో గమనించదగ్గది. నాగరికతా ప్రభావానికిలోనై గిరిజన సంస్కృతి మారడానికి ముందే దాన్ని మౌళికంగా సంగ్రహించాల్సిన అవసరముంది. ఇలా ఈ సంస్కృతిని అధ్యయనం చేయడం వల్ల గిరిజన సంస్కృతి నుంచి నేటి ఆధునిక సంస్కృతి వరకు ఉన్న దశల్ని గుర్తించడానికి వీలవుతుంది.

ఈ "గిరిజన విజ్ఞానం" పరిధిలో 'బంజారా సమాజం' లేదా 'బంజారా జాతి' ఒకటి. ఈ బంజారా జాతిలో అనేక తెగలు కన్పిస్తున్నాయి. అందులో లంబాడ, సుగాలీ అనేది ఒక తెగ. వాళ్లను వారు చేసే పనుల ఆధారంగా ఆ పేరుతోనే పిలుస్తున్నారు. ఉదాహరణకు క్షురకర్మ చేసే వాళ్లను 'నావి' అంటారు. డప్పు వాయిద్యం వాయించే వాళ్లను డపడియా అంటారు. ఆ విధంగా పనుల ఆధారంగా కుల వ్యవస్థ ఏర్పడినట్లు కన్పిస్తుంది.

**ముగింపు :**

"సవరలు, కోయలు, చెంచులు, ఎరుకలు, ఎనాదులు, లంబాడాలు మొదలైన ఆదిమనివాసులు నాగరికత విజ్ఞానం లేని పశుప్రాయులు వలె మనకు కన్పిస్తారు. కానివారు మనకు కనబడినంత అనాగరికులు, అజ్ఞానులు కారు. ప్రాచీనకాలంలో సవరలు ఆర్యులకు చేరువగానే ఉండి ఆర్యుల విజ్ఞానాన్ని అన్ని విషయాల్లోను కొంత వరకు గ్రహించిన వాళ్లని చెప్పగలం అందులో చాలాభాగం వరకు సవరలలో నిలిచి ఉంది. వైద్య విషయంలో సవరలు, చెంచులు, ఎరుకలు కొంత విజ్ఞానం అనుభవం గలవాళ్లు నాగరికులైన మనవాళ్లు కొందరు వాళ్ల మందులు పుచ్చుకుంటున్నారు. వాళ్లు మందుల వల్ల రోగాలు కుదుర్చుకొనుట కన్న మంత్రాల వల్ల భూత పిశాచాల బాధ తొలగించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. వేట విషయంలో ఈ ఆదిమ వాసులు ప్రజ్ఞావంతులన్న విషయం సంస్కృతాంధ్ర కావ్యాల్లో చాలాచోట్ల వర్ణించడం కన్పిస్తుంది. సత్యం పలుకుటలోను పాతివ్రత్య విషయంలోను సవరలు మొదలైన ఆదిమ నివాసులు మంచి పేరు పొందారు. ఇప్పుడిప్పుడు పల్లపు దేశ నాగరికుల సంపర్కంచేత పైన తెల్పిన సద్గుణాలన్ని వాళ్లలో తగ్గిపోతున్నాయి.

**ఉపయుక్త గ్రంథ సూచి :**

1) Dr. Vincent Smith, The Early History of India.
2) డా॥. ఆర్.వి.యస్. సుందరం, ఆంధ్రుల జానపద విజ్ఞానం.
3) డా॥. జి.ఎస్. మోహన్, జానపద విజ్ఞానం అధ్యయనం, పుట 1.
4) మనుష్యశాస్త్రం - ఆదిమ నివాసులు, పుట 3.
5) డా॥. ఎ. బొబ్బిలి, భారతదేశ చరిత్ర - సంస్కృతి, పుట 36, 200.
6) రోమీల థాపర్, సంప్రదాయికత భ్రమలు, పుట 15, 16.

★

# తెలుగు జాతి కవి చేమకూర వేంకటకవి

- డా॥. పొదిలి నాగరాజు, శాఖాధ్యక్షులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కుప్పం.

"ప్రతి పద్యమునందుఁ జమ
త్కృతిగలుగం జెప్పనేర్తు : వెల్లడ బెళుకొ
కృతివింటి మపారముగా
క్షితిలో నీ మార్గమెవకిన్ రాదుసుమీ"

అపరభోజుడు, తంజాపురాంధ్ర నాయకుడైన రఘునాథ నాయకుడు చేమకూర కవి రచించిన విజయ విలాస ప్రబంధాన్ని స్వీకరిస్తూ చేసిన ప్రశంస ఇది. రాయల అనంతరం దక్షిణాంధ్రలో వెలసిన మహాకవులలో అగ్ర గణ్యుడు చేమకూర వేంకటకవి.

చేమకూర వేంకటకవి 1614-1633 సంవత్సరాల మధ్య తంజావూరి సామ్రాజ్యాన్ని పరిపాలించిన రఘునాథ నాయకుని ఆస్థానకవి. ఇతరు రఘునాథ నాయకునికి కేవలం ఆంతరంగికుడు మాత్రమే కాదు. బాల్యం నుండి నిమ్మనబంటు. ఇతనితోపాటు ఇతని తమ్ములు, కుమారులు రఘునాథ నాయకుని సేవకులే. అటు కదన రంగమందు, ఇటు కావ్యరంగమందు చేదోడు, వాదోడుగా ఉండి తన ప్రభువు మన్ననలకు పాత్రుడయిన వాడు చేమకూర వేంకటకవి. ఇతనికి వేంకటరాజు, వెంకటప్ప, వెంకన్న అను వ్యవహార పేర్లు ఉండేవి. ఇతడు 17వ శతాబ్ది పూర్వభాగములోని వాడని చెప్పవచ్చు. ఇతని తండ్రి పేరు లక్ష్మణామాత్యుడు. తల్లిపేరు కానీ, కుల గోత్రాలను కానీ ఎందుకు పేర్కొనలేదో తెలియదు. ఆ విషయాలు వివాదాస్పదాలు. వేంకటకవి సకల విద్యా విశారదుడు. శ్రీ సూర్యవరప్రసాదంచే సరసకవితా శక్తిని పొందిన మహాకవి శ్లేషయమక చక్రవర్తిగా ప్రసిద్ధి పొందినవాడు. ఇతడు సారంగధర చరిత్రము, విజయ విలాసము అను రెండు రసవత్తర ప్రబంధాలను రచించి ఆంధ్రభాషా సరస్వతికి అక్షర నీరాజనాలిచ్చి సేవించి తరించిన కవీశ్వరుడు. ఈయన రచించిన విజయవిలాస ప్రబంధం ఆంధ్ర సాహిత్య చరిత్రలో ప్రత్యేక గౌరవం పొందిన ఉత్తమ రసవత్ప్రబంధం. ఇందులోని మాటలు మాకంద మరందాలను మరపించే తీయని తేటతెనుగు మూటలు. ఈ ప్రబంధం ఆంధ్రభాషా సరస్వతికి వేంకట కవి భక్తితో అర్పించిన గొప్ప కానుకనే చెప్పాలి. రాయల అనంతరయుగంలో పిల్ల వసుచరిత్రగా పేరొందిన విజయ విలాసమే అత్యుత్తమ ప్రబంధమనటానికి ఎటువంటి సందేహం లేదు.

రఘునాథ నాయకుడు జాఫ్నారాజు అధికారాన్ని బుడతకీచుల ప్రమాదం నుండి కాపాడి సుస్థిరం చేశాడు. తన రాజ్యంలో చోళుడైన గజదొంగ ఆటలను కట్టించి శాంతి భద్రతలను కాపాడాడు. తమ నాయక వంశానికి ఆధారభూతమైన విజయనగర సామ్రాజ్యానికి హాని చేయాలని చూసిన జగ్గరాజును హతమార్చి వారసుడైన రామదేవరాయలను విజయనగర సింహాసనంపై అధిష్టింప జేసి తన కృతజ్ఞతను వెల్లడించాడు. అట్టి వీరాగ్రేసర చక్రవర్తి రఘనాథ నాయకుడు. ఈ విజయాలను ప్రతీకగా విజయ విలాస భవనము (విజయ భవనము) అనే సుందర భవనాన్ని ప్రభువు నిర్మించాడని, ఇది శ్రీకృష్ణదేవ రాయల భువన విజయ సభా భవనం వంటిదని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. ఈ విధమైన రఘు నాథుని విజయాలకు గుర్తుగా వేంకటకవి విజయవిలాస ప్రబంధాన్ని రచించి రాజభక్తిని ప్రకటించుకొన్నాడు.

గదుడు అనే శ్రీకృష్ణుని కుమారుడు ద్వారక నుండి ఇంద్ర ప్రస్థానానికి వచ్చి అర్జునుని మనసులో స్థానం సాధించేలా సుభద్ర సౌందర్యాన్ని వర్ణిస్తాడు. ఆ సమయం లోనే గోవులను కోల్పోయిన బ్రాహ్మణుని మొర విని ధనుర్బాణాలకై ధర్మరాజు కేళీమందిరంలోకి అర్జునుడు ప్రవేశిస్తాడు. తాము ఏర్పాటు చేసుకొన్న నియమానికి భంగం కలగటంతో అర్జునుడు ఒక సంవత్సరంపాటు భూ ప్రదక్షిణం చేయవలసివచ్చి విశారదుడు మొదలైన సముచిత పరివారంతో ప్రేమయాత్ర చేయటానికి

తీర్థయాత్రలకు బయలుదేరుతాడు. ఈ యాత్రలో గంగానది తీరంలో ఉలూచి అనే నాగకన్యను గాంధర్వ వివాహం చేసుకొని ఆమె ద్వారా ఇలావంతుడు అనే కుమారున్ని పొందుతాడు. పాండ్యదేశంలోని మణిపురానికి వచ్చి మలయధ్వజుని కుమార్తె చిత్రాంగదను శాస్త్రోక్తంగా వివాహమాడి ఆమె ద్వారా బభ్రువాహనున్ని పొందుతాడు. తర్వాత సౌభద్ర తీర్థములో నంద, లలిత, పద్మ, సౌరభేయి, సమీచీ లనే అప్సరస కాంతలకు శాపవిముక్తిని కలిగించి వారి దీవెనలతో ద్వారక చేరి కపట యతి వేషాన్ని ధరించి సుభద్రను పెళ్ళి చేసుకుంటాడు. ఇదీ స్థూలంగా ఇందులోని కథ.

ఈ కథకు మూలం మహాభారతం ఆదిపర్వంలోని సుభద్రా పరిణయ ఘట్టం. ఇందులోని చిన్న ఇతివృత్తాన్ని స్వీకరించి చేమకూర వేంకటకవి తన ఉపజతో మూడు అశ్వాసాలు గలిగిన మహా ప్రబంధంగా విజయ విలాసాన్ని నిర్మించి యశోవిరాజితుడైనాడు. తెలుగు భాషా సంస్కృతులను చమత్కార పద్ధతిలో కవిత్వీకరించి ఈ తెలుగు ప్రబంధాన్ని నిర్మించాడు. ఇందులోని పాత్రలు భారతంలోనివే అయినా వాటికి తెలుగుజాతి మనోభావాలను అద్ది తెలుగు అర్జునుడిలా, తెలుగు ఉలూచిగా, తెలుగు చిత్రాంగదగా, తెలుగు సుభద్రగా చిత్రీకరించినాడు. ఈ పాత్రల కదలికలన్నీ తెలుగువారి నడకలే - నడతలే. ఔచిత్యము కోసం మూలంలోని కొన్ని విషయాలలో చిన్నచిన్న మార్పులు చేశాడు. విశారదపాత్ర ఇతని సృష్టి. చిత్రాంగదతోడి వివాహఘట్టంలో ఇతని వైశారదం వర్ణనాతీతం, ఔచిత్య పోషకం. మూలంలో చిత్రాంగదను వివాహమాడిన తర్వాత సౌభద్ర తీర్థానికి పోయి అప్సరోభామినులకు శాపవిముక్తిని కలిగించి మళ్లీ మణిపురానికి వచ్చి చిత్రాంగదతో బభ్రువాహన కుమారుని పొందినట్లుగా ఈ కావ్యంలో కుమారుని జననానంతరమే సౌభద్ర తీర్థానికి యాత్రను కొనసాగించినట్లు సముచితంగా మార్పు చేశాడు. అందువల్ల కథా గమనం కుంటుపడకుండా ఉత్సాహభరితంగా రూపొందించబడింది. ఇలా స్వల్పమైన మార్పులతో కూర్పులతో విజయవిలాసాన్ని శృంగారరస ప్రధానంతో ఉత్తమ ప్రబంధంగా రచించాడు చేమకూర వేంకటకవి.

ఇందలి కథాగమనం, కల్పనాచాతుర్యం, వర్ణనా నైపుణ్యం, పాత్ర చిత్రణం, శ్లేషయమక చమత్కార వచోవిన్యాసాలు నిరుపమనాలు. ఇందులోని కవిత ప్రబంధ మర్యాదకు అనుగుణంగా ఉంటుంది. కృతిపతి రఘునాథ నాయకుని ముఖాన తన కవిత్వం ఎట్టిదో ఈ పద్యంలో వివరించాడు కవి.

"తారసపుష్టిమైఁ బ్రతిపదంబున జాతియు వార్తయున్
జమ
త్కారము సర్థగౌరముఁగల్గ ననేక కృతుల్ ప్రసన్న గం
భీర గతిన్ రచించి మహిమించినచో నిక శక్తులెవ్వర
య్యా రఘునాథ భూపరసికాగ్రణికన్ జెవిసోఁకఁ
జెప్పఁగన్"

రఘునాథ నాయకుడు స్వయంగా కవి. ఆయన కవిత్వంలోని గుణాలను తెలిపే నెపంతో చేమకూర వేంకటకవి తన కవితా శక్తిత్వ గుణాలను ఈ పద్యంలో మర్మగర్భితంగా పేర్కొనట్లు తెలుస్తుందని పండితుల అభిప్రాయం. తెలుగువాళ్ళు రచించే కవిత్వంలో జాతి, వార్త, చమత్కారం, అర్థ గౌరవం, రసమయ పదజాలం లాంటివి తొణికిసలాడాలని నిక్కచ్చిగా చెప్పాడు. భవిష్యత్తులోని తెలుగు కవులందరికీ వీటి అవసరం వుందని తెలియజేశాడు. రసవంతంగా లేని కవిత్వం బలహీనపడిపోతుందని ఈ పద్యంలో పరోక్షంగా ధ్వనింపజేశాడు. ప్రాచీన కవిత్వానికైనా, ఆధునిక కవిత్వానికైనా ఈ లక్షణాలే కవితాశక్తిని శిరోధార్యాలని తెలియజేసిన కవి చేమకూర కవి.

ఎంతటి పద, వాక్య పటుత్వంతో కవిత్వం చెప్పినా, కావ్యాన్ని రచించినా సమకాలం వారు మెచ్చుకోరని కింది పద్యం ద్వారా తెలియజేశాడు చేమకూర కవి.

"క్షితిపయి వట్టి మ్రాఁకులుఁ జిగిర్ప వసంతుఁడు
తారసోప గుం
ఫిత పదవాసనల్ నెఱప, మెచ్చక చంద్రుఁడు
మిన్నునం బ్రస

న్నతయును సౌకుమార్యముఁ గనంబడు జాల్
గరగంగఁజేసే; నే
గతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరే
కదాఁ''

అర్జునుడు చిత్రాంగదను మోహించి మరులు గొన్నపుడు చంద్రోదయాన్ని వర్ణించు సందర్భంలోని ఈ పద్యంలో వేంకటకవి తన కవితా స్వరూపాన్ని వ్యంగ్యంగా ధ్వనింపజేసినాడు. వసంతుడు ఎండిన చెట్లను చిగురింప జేసేలా చేస్తే చంద్రుడు వసంతుడు చేసిన పనిని మెచ్చు కోకుండా రాళ్లని కరిగించి చూపిస్తాడు. ఇది ప్రబంధంలోని ప్రకృతి పోలిక. దీని ఆధారంగా కవి సమకాలీన కవుల అసూయద్వేషాలను సూచించాడు. రచయిత్రైనా, రచయితైనా, కవైనా, వకయిత్రైనా ఎంత గొప్ప అల్లికల రసాన్విత సాంఘిక ఉపయోగ కవిత్వాన్ని రాసిన ఆ కాలపు కవులు మెచ్చుకోకపోవటమే సమకాలీన కవుల లక్షణం. అది సామాన్య విషయమే, కానీ ఈ లక్షణం వల్ల సమాజానికి అవసరమైన కవిత్వం మరుగునపడే అవకాశం వుంది. కవి కులానికి ఇది మంచి లక్షణం కాదని కవి వాపోయాడు. దక్షిణాంధ్రయుగంలో రాజులు మహా కవులుగా కవయిత్రులు విదుషీమనులుగా ప్రసిద్ధి చెందటంతో చిన్న చిన్న కవులు కూడా తమ కవిత్వాన్ని తామే గొప్పగా చిత్రించుకుంటూ తక్కినవారు ఎంత గొప్ప కవులైనా వారి కవిత్వాన్ని చిన్న చూపు చూడటం ఈ యుగంలో గమనించవలసిన విషయమని ఈ పద్యం చెబుతుంది. ఇది నేటికీ సజీవ విషయమే.

ఈ కావ్యలంలో ముఖ్య పాత్రలు అర్జునుడు, ఉలూచి, చిత్రాంగద, సుభద్రలు. కావ్యంలో తుది వరకు ఉండే పాత్ర అర్జునుడు. మిగిలిన వారు వారి ప్రయోజనం తర్వాత కనిపించరు. ఈ విధంగా ఒక నాయకుడు, ముగ్గురు కథా నాయికలు గల ఈ పాత్రలను చిత్రిం చటంలో చేమకూర వేంకటకవి తన నైపుణ్యాన్ని ఎంతో చాకచక్యంగా ప్రదర్శించినాడు.

ఇందులోని మొదటి నాయిక ఉలూచి. బ్రహ్మ చర్యాన్ని అవలంబించి, పుణ్యతీర్థాలను సేవించుచున్న అర్జునున్ని తన చాకచక్యంతో, మాట నేర్పుతో వశం చేసుకొన్ని ప్రౌఢ నాయిక. ఉలూచి సాహసంగా అర్జునున్ని తన లోకానికి తీసికొనివెళ్ళి, హావభావ విలాసాలతో తనవానిగా చేసికొనింది.

''కమ్మని జాళువా నొరగయఁగల్గిన చెక్కుల టెక్కు
వాఁడు, చొ
క్కమ్మగు జాతికెంపు వెలగాఁ గొనుమోవి మెఱుంగు
వాఁడు, స
త్యమ్ముగ రూపసంపద ధనాధిపసూనుని ధిక్కరించు
వాఁ
డమ్మకచెల్ల! నా హృదయమమ్మక చెల్లదు వీని
కియ్యెడన్''

ఈ పద్యంలో తెలుగువాని సౌందర్యం చిత్రిత మయింది. మేలిమి బంగారు ఛాయ శరీరం, ఎర్రని పెదవులు కలిగిన మగవాళ్ళు తెలుగు వాళ్లల్లో అరుదుగా వుంటారు. ఒకవేళ అటువంటి తెలుగు పురుషుడు వున్నాడంటే అతనికి ఎంత అందమైన స్త్రీ అయినా తన మనసును అమ్ముకుంటుందనే తెలుగు భావాంబర పద చమత్కారాల పట్టువిడుపులు తెలిసిన చేమకూర కవి పదవిన్యాసం చూస్తే ఎవరైనా ఈ కవిని మెచ్చుకోకుండా వుండలేరు.

''చెఱకు విలుకాని బాఱికి వెఱచి వీదు
మఱుఁగుఁ జేరితిఁ జేపట్టి మనుపునన్ను
బ్రాణదానంబు కన్నను వ్రతముగలదె
యెఱుఁగవే ధర్మపరుఁడవు నృపకుమార!''

అని పలికి అర్జునుని ఒప్పించింది. ఈ ఘట్టంలోని పాత్రల మనోభావాలు తెలుగువారి మనస్తత్వ నిరూపణకు నిదర్శనం. తెలుగు పడుచుల కోరిక పదాల రూపంలో అల్లితే ఇలా వుంటాయని చిత్రించిన మాటలివి. ఈ సన్నివేశంలో వేంకటకవి చూపిన సూక్ష్మధర్మ పరిశీలనం కూడా కొనియాడతగింది. ''నీవు ఫణిజాతివి. నేను మనుజుడను అన్యజాతి ప్రవర్తించుట న్యాయమా?'' అన్న అర్జునుని సందేహానికి ఉలూచి కుశరాజు కుముద్వతిని, పురుకుత్సుడు నర్మదను పెండ్లియాడలేదా అని తగిన సమాధానం చెప్పి మెప్పించింది. శృంగార రసావధికి కట్టకనికోట లాంటిది ఈ ప్రణయ సన్నివేశం.

చిత్రాంగద మరొక అద్భుత పాత్ర. కవి ఈమెను ముగ్ధనాయికగా చిత్రించాడు. ఈమె క్షత్రియకన్య.

నాయకుడే ఈమెను చూసి తపించినట్లు వర్ణించి కథకు ఔచిత్యాన్ని కలిగించాడు. పాండ్యరాజు కుమార్తె చిత్రాంగద. కార్యసిద్ధి కోసం అర్జునుడు విశారదుని మలయధ్వజుని కడకు రాయబారిగా పంపినపుడు చమత్కారంగా చెప్పిన పద్యమిది.

"అపుడు నృపుడు ప్రఫుల్ల నవాంబుజ ప్ర
సన్నముఖుఁడయి మలయధ్వజ క్షితీజ
కమలహితునకు మామకాగమనవార్తఁ
దెలుపుమనుచు విశారదుఁబిలిచి పనిచె"

ఈ పద్య చమత్కారం మనకెంతో చిత్రంగా కనిపిస్తుంది.

మామక + ఆగమవార్త = నా మంచిని కోరుకునే ఆ మలయధ్వజునికి నేను వస్తున్నాని తెలియజెప్పమని ఒక అర్థం.

మామకు + ఆగమనవార్త = నేను ప్రేమించిన చిత్రాంగదకు తండ్రైన మా మామగారికి నేను వస్తున్నానన్న సంగతి వివరించమని మరొక అర్థం. ఇటువంటి ప్రయోగాలు చేమకూర కవిత్వంలో విరివిగా లభిస్తాయి. అల్లుడు వస్తున్నాడన్న విషయం మామగారింటికి తెలపటం తెలుగు వారి ఆచారమే.

ఈ ప్రబంధానికి ప్రధానమైన ఘట్టం సుభద్ర పరిణయం. ఇది ఒక రమణీయమైన చెరుకుపాల సన్నివేశం. నాటకీయత ఉట్టిపడిన ఘట్టం కూడా ఇదే. అర్జునుడు తీర్థయాత్రలో చరమఘట్టంగా ద్వారకకు వెళ్తాడు. సుభద్ర సౌందర్యాన్ని కన్నులారా చూడాలని ఉవ్విళ్ళూరతాడు. "యతులకు విధేయులగుదురు యాదవులని" తెలుసుకొని అర్జునుడు సన్యాసివేషాన్ని ధరిస్తాడు. బలరాముడు ఇతని సేవకు సుభద్రనే నియోగిస్తాడు. సుభద్రను చూసిన అర్జునుడు కామ మోహితుడై తాను సన్యాసిన్న విషయాన్ని మరచిపోయి

"వెలది కెమ్మోవిఁగని జపావృత్తి మఱచెఁ
ధరణి లేఁగౌనుగని హరిస్మరణ మరచె
గడమయననేల? వేసమొక్కటియతక్క
మఱచె నన్నియు నా కృత్రిమ త్రిదండి"

కపట సన్యాసిలో వుండే లక్షణాలను ఈ సందర్భంగా చక్కగా వివరించినాడు కవి. తెలుగుదేశం నలుమూలలా వున్న సన్యాసులలో ఇలాంటి ఛాయలు వున్నవారు ఆ కాలానికే నిండుగా వుండేవారేమో? అందుకే ఎంతో చిక్కగా కపట సన్యాసిని చిత్రించాడు. కథలో భాగంగా కపట సన్యాసి క్రమక్రమముగా తన వచన చాతుర్యంతో సుభద్ర వలపును తెలిసికొని, చివరకు తానే అర్జునుడనని వ్యక్తపరుస్తాడు. తాను అనుకొన్న రీతిగా బలరామాదులకు అభిమానపాత్రుడై సుభద్రను వివాహమాడతాడు.

ఈ కావ్యంలో అర్జునుడు ప్రధాన పాత్రధారి. ధీరోదాత్త నాయకుడు. అర్జునునిలో ధార్మిక, కాముక ప్రవృత్తులతో పాటు దైవబ్రాహ్మణభక్తి, నియమపాలనం, నిరుపమ ధైర్యసాహసాలు మొదలైన సుగుణాలన్నీ అర్జునుడిలో బాగా చిత్రించబడ్డాయి. తనను వలసిన నాయకిలను శృంగార రస వాహినిలో ఓలలాడించిన దక్షిణ నాయకునిగా అర్జునుని మిక్కిలి నేర్పుతో కవి చూపించాడు. కథా నయకానాయికల పాత్ర పోషణలో కవి ఎక్కడా ఇసుమంత పొరపాటు చేసినట్టు కావ్యమంతా వెదికినా కనిపించదు.

పాత్రచిత్రణతోపాటు శబ్ద చమత్కృతులకూ విజయ విలాసం గని వంటిది. ప్రతిపద్యం ఏదో ఒక చమత్కృతిని కలిగి వుంటుంది. కావ్యమంతా శబ్దచమత్కారాలు వివిధ రూపాలలో చెవులకు ఆనందాన్ని కలిగిస్తాయి. అవి అప్రయత్న సిద్ధాలు. అటువంటి వాటిల్లో వన్నెతగ్గని మరో ముత్యం ఈ పద్యం.

"నువ్వుఁబువ్వు నవ్వు జవ్వని నాసిక
చివురు సవురు జవురు నువిది మోవి
మబ్బు నుబ్బు గెబ్బు బిబ్బోకవతివేణి
మెఱపు నొఱపుఁబిఱపుఁదెఱవ మేను."

ఇంత చిన్న పద్యాన్ని ఎన్నుకోవటంలోనే కవి ప్రతిభ తెలుస్తుంది. ఉలూచి ముక్కును, పెదవిని, వెంట్రుకలను, వేణిని, శరీరాన్ని మనోహరములైన ఉపమానాలతో వర్ణించినాడు. ఇందులో వీనులవిందైన మధుర శబ్ద చిత్రణం వుంది. ఉలూచిని పొందాలనే అర్జునుని ఉత్కంఠ పద్యంలోని ఖండగతివలన వ్యక్తమవుతుంది. ఇలాంటి శబ్ద విచిత్రాలు కావ్యంలో ఎన్నో వున్నాయి.

ఇలాంటి చిన్న చిన్న పద్యాలలోని చమత్కారమే తెలుగు భాషకు వెన్నెముకగా నిలిచాయి.

"శివు(డిటురమ్మటంచు దయచేసినచొ( దలకెక్కి తుగ్రవై
భవనమున( జూచుచో-సడుగు వట్టితి వేమనవచ్చు నీ గుణం
బవునవు నందినన్ సిగయు నందక యున్నను గాళ్లు(బట్టుకొం
దువు హరిణాంక వేలకొల(దుల్గద నీ నడకల్ తలంప(గన్"

చేమకూర వేంకటకవి అందమైన జాతీయాలను, సామెతలను సందర్భోచితంగా, భావగర్భితంగా ఎక్కువ చోట్ల ప్రయోగించాడు. అవి అతని లోకజ్ఞతకు, ఔచిత్య పరిజ్ఞానానికి ప్రజల తార్కాణాలు. "అందిన్ సిగయు, అందకయున్న కాళ్ళు" అను లోకోక్తిని వేంకటకవి ఎంత చక్కగా అన్వయించి ఉపయోగించినాడో చెప్పటానికి పై పద్యం ఒక కలికితురాయి.

తెలుగుభాషకు ప్రాణప్రదాలైన ఇలాంటి లోకోక్తుల తోనూ, జాతీయాలతోనూ, సామెతలతోనూ ఈ కావ్యం నిండి వుంటుంది. దీని వలన కవీశ్వరుని లోకానుభవం, నీతిమయ వాగ్ధోరణి మొదలైన విశేషణాలు తెలుస్తాయి. సమయానుకూలంగా సామెతలను సరిసమానంగా వాడటంలో చేమకూర వేంకటకవిది అందెవేసినచేయి. ఇలాంటి లోకోక్తులు పాఠకుల గుండెలను హత్తుకొని హృదయ సంస్కారానికి తోడ్పడతాయి. వాటిల్లో కొన్ని.

**లోకోక్తులు :**

"ప్రాణదానంబుకన్నను వ్రతముగలదె"
"పరసతి నెనయుట రాజులకు ధర్మమే"
"మనమున నున్నడి మొగమున గనుపించున్"

**జాతీయాలు :**

"పంచ బంగాళమై పాఱ(దఱమె"
"కాయో పండో పోయినపని"
"తెఱచిరాజు"

**ద్వంద్వార్థాలు :**

అల్లన గాధిరాజ సుతుడు - అల్ల నగాధిరాజ సుతుడు
మామకాగమ వార్త - మామకు ఆ గమన వార్త
మనసు భద్రమయ్యె - మన సుభద్రమయ్యె
అమ్మకచెల్ల - అమ్మక చెల్లదు

**సామెతలు :**

"మోక్షమునకు(బోవ మొసలెత్తుకొనిపోయె"
"చదువ(గ(బెట్ట నున్నమతియు(బోయె"

విజయవిలాస ప్రబంధం ఏ దృష్టితో చూసినా ఉత్తమ ప్రబంధమే. ఆత్మవిశ్వాసంతో కవేమెచ్చిన కావ్య మిది. ప్రతి పద్యాన్ని అచ్చతెలుగు పదాలతో రసోచితంగా శృంగార రసభంగిమలతో, కమనీయ కవితా విన్యాసాలతో విజయవిలాస ప్రబంధాన్ని రచించి, తంజావూరి తెలుగు కవులలో వేంకటకవి ధ్రువతారగా వెలుగొందాడనటంలో ఎటువంటి సందేహం లేదు. తెలుగుజాతి మరువని దక్షిణాంధ్రయుగ తెలుగు మహాకవి చేమకూర వేంకటకవి.

★★★

# దళిత సాహిత్య విమర్శ - తెలుగు కవిత అభినవ దృక్పథం

- డా॥ మంథని శంకర్

పంతొమ్మిది వందల తొంబైల తరువాత వచ్చిన సాహిత్యం దళిత సాహిత్యం. దళిత సాహిత్యకారులే కాకుండా దళితేతర సాహిత్యకారులు కూడా దళిత సాహిత్యాన్ని అవగతం చేసుకుంటున్న తరుణంలో దళిత సాహిత్యాన్ని రాయడమే కాకుండా, ఇంతవరకు వెలువడిన తెలుగు సాహిత్యంలో దళిత వస్తువును గుర్తించే అవసరం రేకెత్తింది. ఈ కోణంతో దళితవాదం ఒక ఉద్యమంగా సాగుతున్న కాలం. నన్నయ రాసిన భారతం మొదలుకొని ఆధునిక సాహిత్యం వరకు దళిత దృష్టికోణంతో అధ్యయనం చేయడం అనివార్యమయ్యింది. కనక సాహిత్య చరిత్రలో దళితవాద దృక్పథం ఎంతమేరకు ప్రతిఫలిస్తుందో అంచనా వేసే పనిలో డా॥బన్న అయిలయ్య గారి ఈ "అభినవ దృక్పథం" విమర్శన గ్రంథం వెలువరించాడు. ఇదే వీరి మొదటి విమర్శ వ్యాస సంపుటి.

బన్న అయిలయ్య మొదటి విమర్శ వ్యాస సంపుటి "తెలుగు కవిత అభినవ దృక్పథం 1998లో వెలువడింది. "తెలుగు కవిత అభినవ దృక్పథం" అనగానే సాహితీ లోకానికి రాయప్రోలు "అభినవ కవిత" స్ఫురణలోకి రాక తప్పదు. "అభినవ"అనే పదాన్ని రాయప్రోలు "నవత" అనే అర్థంలో కొత్త కవితగా ప్రస్తావిస్తే, బన్న అయిలయ్య గారు "కొత్త దృక్పథం"ను ఎంచుకున్నారు. రాయప్రోలు సుబ్బారావు గారికి బన్న అయిలయ్య గారికి కొంత సారూప్యత సంతరించుకుంది. రాయప్రోలు వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తొట్టతొలి ప్రిన్సిపాల్‌గా పనిచేసిన తెలుగు ఆచార్యులు కాగా డా॥బన్న అయిలయ్య గారు అదే కళాశాలకు ఆరు సంవత్సరాలకు పైగా ప్రిన్సిపాల్‌గా ఏకధాటిగా కొనసాగుతున్న తెలుగు ఆచార్యులు వీరు.

"తెలుగు కవిత అభినవ దృక్పథం"లో పది విమర్శ వ్యాసాలున్నాయి. అందులో "వైజ్ఞానిక దాశరథి" వ్యాసం. మినహా అన్ని వ్యాసాలు దళిత దృష్టి కోణంతో వివరించినవే. ఇందులో మొదటి వ్యాసం "మహాభారతం వర్ణ వ్యవస్థ". మహాభారతంలో చాతుర్వర్ణ వ్యవస్థ ఎలా ప్రతిపాదించబడినదో తెలుపడం ఈ వ్యాసం ఉద్దేశ్యంగా రాసారు. అయితే ఇందులో నన్నయ భారతాన్ని గురించి చెప్పిన "ధర్మతత్వజ్ఞులు ధర్మశాస్త్రంబని" అనే సీస పద్యాన్ని ప్రస్తావిస్తూ మహాభారతం ఏ దృష్టితో గమనిస్తే ఆ దృష్టితో కనిపిస్తుందన్న విషయాన్ని చెబుతూ భారతం "సామాజికులు సమాజ శాస్త్రంబని" ఎందుకు నన్నయ చెప్పలేకపోయాడో చెప్పదలచాడు. మహాభారతం సామాజిక కోణం నుండి చూసినట్లయితే సమాజంలో అసమానతలకు ఆయువుపట్టుగా, చాతుర్వర్ణ్నాన్ని రక్షించి శూద్రులను వివక్షకు విస్మరణకు గురిచేసిందని రూఢి చేసాడు. నన్నయ కాలం నుండి నేటివరకు ఎన్నో కావ్యాలు, ఎన్నో చర్చలు, వాదోపవాదాలు జరిగాయని, ఇందులో సమ సమాజ నిర్మాణం వైపు కొంతనైనా వెనులుబాటు ఇవ్వలేకపోయారన్న విషయాన్ని చెప్పదలచాడు బన్న అయిలయ్య గారు.

భారతదేశములో కులం రెండు విధాలుగా మనసును స్వాధీనపరుచుకుంటుంది. ఒకటి పై కులాలవారు కులాధిక్యత ప్రవర్తించడం. రెండవది కింది కులాల వారు ఆత్మన్యూనతకు గురికావడం. ఈ అంశాన్ని 'కౌశికోపాఖ్యానం' కథ ఆధారంగా చర్చకు పెట్టాడు. వ్యాసుడు, నన్నయ, భారతాలలో 'క్లోజ్‌డ్ టెక్ట్స్" ఒక యుగ ధర్మంగా కనబడుతూనే, నన్నయ భారత కుమారాస్త్ర విద్యా ప్రదర్శనలో "ఓపెన్ టెక్ట్స్"గా తలపిస్తూ 'వర్ణం/ కులం'ను ప్రస్తావించారు. ప్రస్తావన సాగుతూనే భారత కథ నడుస్తుంది. 'ఏకలవ్య' 'కృష్ణ రాయభారం' అంశాలు ఈ దృష్టితోనే ప్రస్తావించబడ్డాయని గుర్తించాడు అయిలయ్య గారు.

ఆదిపర్వంలో "కులం గలవాడు శౌర్యము గలవాడు.

అధిక సేన గలవాడున్ భూతలమున్ రాజును నామం విలసిల్లగ దాల్చు మూడు విధముల పేర్మిన్'' అని రాజ్యం, అధికారం కొరకు కావలసిన ఆధారాలను భారతంలో ప్రస్తావించారు. ఇవి నేటి కింది కులాలకు అందకుండా చాతుర్వర్ణ వ్యవస్థ దోహదకారిగా అగ్రకులాల కోసం పనిచేసినదని, చెబుతూ, నన్నయ చెప్పుకున్న భారత స్వభావం వర్ణ ధర్మ శాస్త్రంగానే ఉన్నది తప్ప సమసమాజ శాస్త్రంగా నిలువలేక పోయిందని ఈ వ్యాసంలో నిరూపించారు బన్న అయిలయ్య గారు.

రెండవ వ్యాసం "పాల్కురికి సోమనాథుడు - దళిత దృక్కోణం", వీర శైవ మతాన్ని కులాలకు అతీతంగా ప్రచారం చేయడం కొరకు తెలుగు సీమలో అద్వితీయ సాహితీ ఉద్యమం సాగించినవాడు పాల్కురికి. ఇతని రచనలు బసవపురాణం, పండితారాధ్య చరిత్రలు సమకాలీన సామాజిక, సాంఘిక జీవనాన్ని పట్టి ఇచ్చాయి. ఆ కాలంలో శాంతి నెలకొన్న వైదిక మతంలో ఆచార సంప్రదాయాల సరళీకరణలో భాగంగా వచ్చిన ఒక భక్తి ఉద్యమం వీరశైవ మతం. అయితే డా॥బన్న అయిలయ్య గారు 1998 కాలరేఖపై నిలబడి వైదికంను, వీరశైవంను, అప్పుడే పురివిప్పిన దళితంను త్రినేత్రాలతో చూడడం ఈ వ్యాసం ఉద్దేశ్యంగా భావించవచ్చు.

వైదికం, వీరశైవం, దళితం ఈ మూడు అంశాలలో వ్యత్యాసాన్ని ఒక పట్టిక ద్వారా వివరించారు. వేదాలకు సంబంధించిన కర్మ - పునర్జన్మ - ఆత్మ మొదలగు అలౌకిక అంశాలను విశ్వసిస్తుందని, జీవికి ఈశ్వరునికి భేదం లేదని జీవి మరణించిన తర్వాత ఈశ్వర కటాక్షం పొందుతారని వీరశైవం చెబుతుందని ఇలాంటి హేతువు లేని అంశాలను దళితం ఖండిస్తుందని చెప్పారు. వైదికంలోని షోడశ కర్మలను వీరశైవం నిరసించినదని, ఈ విషయంలో దళితంకు సమానంగా వీరశైవం కనబడిందంటాడు అయిలయ్యగారు. వైదికం అస్పృశ్యతను పాటిస్తే, వీరశైవం, దళితం అస్పృశ్యతను ఖండించాయని, అస్పృశ్యత వలన సమసమాజ నిర్మాణానికి విఘాతం కలుగుతుందని దళితం భావించిందని చెప్పారు. విద్య హక్కు కలిగిన బ్రాహ్మణులదే ఆధిక్యతగా చాటుతున్న వైదికంలో జ్ఞానమెంత ఉందన్న ప్రశ్న లేవనెత్తాడు అయిలయ్య గారు. కుట్రపూరితంగానే విద్యను పరిమితం చేసి, ఆచారాల పేరుతో సమాజాన్ని నిర్వీర్యము చేసి, తద్వారా దేశాన్ని అజ్ఞానం వైపు నడిపించింది వైదికమని దుయ్యబట్టారు.

వైదికంను వీరశైవాన్ని దళిత దృక్కోణం నుండి చూస్తూ బన్న అయిలయ్య గారు వస్తూత్పత్తిలో భాగమయినవారికి వైదికంలో చోటులేదని, వీరశైవంలో 'కాయికమే కైలాసం' అనే సూక్తి శ్రామికులకు గౌరవప్రదమైన సూక్తిగా అభివర్ణించారు. చాకలి నుండి చెప్పులు కుట్టేవారి వరకు రాజదర్బారులో కొలువులు చేసింది వీరశైవుల కాలంలోనే నని వెల్లడిస్తూ, వేదం చదివిన బ్రాహ్మణులు, చెప్పులు కుట్టిన పంచములు ఇద్దరు సమానమనే ధర్మం వీరశైవంలో ఉందని చెప్పారు. సాహిత్యభాషలో దేశీకవితను ఎంచుకొని కింది కులాల వ్యావహారిక భాషను కావ్య భాషగా వాడారని, ఇవి వీరశైవంలో దళితాన్ని బొంతలు కుట్టే శంకర దాసి కథను, ఆవుపెయ్య మాంసం శివ భక్తుడికి వండిపెట్టిన కెంబాలి భోగయ్య కథను చెబుతూ,, అంత్యజులకు "గారు" అనే గౌరవపదాన్ని వాడడానికి గల విశేషాన్ని చెప్పారు. అన్ని కులాల వారిని ఇంటి పేరుతో సహ గౌరవాన్నిచ్చింది పాల్కురికి కావ్యాలేనని చెబుతూ, చేటల వేమయ్య, కుమ్మరి గుండయ్య, సుంకేసు బంకయ్య (సుంకాలు వసూలు చేసేవారు) డోహరి కక్కయ్య (కుట్టుపని) కన్నడ బ్రహ్మయ్య (కన్నాలు వేసేవారు) కాటుకోటుడు (గొల్ల) ఉడుమూరి కన్నప్ప (ఎఱుకల) మడివాలు మాచయ్య (చాకలి) శంకరదాసి (బొంతలు కుట్టేవాడు) ఆడి భక్తుడు (జాలరి) శివ నాగమయ్య (మాల) దూడర దాసయ్య (నేతగాడు) కేంబాలి భోగయ్య (మాదిగ) గుడ్డవ్వ (కులహీనురాలు) పాల్కురికి కావ్యాలలో కులప్రాతిపదికగా వెలువరించిన కథలో పాత్రల ఆధారంగా సమాజంలోని సకల కులాలకు తన కావ్యంలో ప్రాతినిధ్యం కల్పించిన కవి పాల్కురికిగా చెప్పడానికి బన్న అయిలయ్య గారు ఈ పేర్లను వ్యాసంలో పొందుపరిచాడు.

కన్నప్ప కథను ప్రస్తావిస్తూ జనానికి విద్యకు

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

సంబంధించకుండా భక్తి మోక్షం గురించే చెప్పడం, ఇది ముగ్ధభక్తికి చెందుతుందని నిర్ధారించి బ్రాహ్మణాధిక్యతను పక్కనపెట్టి శ్రమ జీవులకు సమాన గౌరవాన్ని కలిగించిన కథలుగానే వీరశైవ కథని స్వీకరించానని నిర్ధారించారు అయిలయ్య గారు.

మూడవ వ్యాసం "ప్రబంధం వర్ణ వ్యవస్థ" ఈ వ్యాసంలో రాయల కాలంలో వచ్చిన ప్రబంధాలను విమర్శకు పెట్టారు డా॥బన్న అయిలయ్యగారు. ఋగ్వేదంలో, మనుస్మృతిలో, భగవద్గీతలో, వర్ణాలకి సంబంధించిన శ్లోకాలను వివరిస్తూ, ప్రబంధకవి పెద్దన రాసిన మనుచరిత్ర మనువు పుట్టుకకు సంబంధించిన కథగా పాఠకులకు చెబుతూ అందులో వర్ణం గురించిన అంశాలను వెలికిదీయు ప్రయత్నం చేసారు బన్న అయిలయ్యగారు. అయితే పెద్దన కథను ఎన్ను కోవడంలోనే వర్ణధర్మముందన్నారు. వర్ణధర్మ నిర్దిష్ట నియమాల కారణంగానే పెద్దన మనుచరిత్ర కావ్య రచన చేసాడని అభిప్రాయపడ్డాడు, పెద్దన దృష్టిలో మానవులే కాదు దేవతలు కూడా చాతుర్వర్ణంను పాటించాలనే నిర్ణయాన్ని ప్రకటించాడన్నాడు. అసలు మనుచరిత్రలో నిమ్నజాతి వారి ఊసుకూడా ఎత్తలేదని, ఉన్నత వర్ణాల సుఖభోగాలకు, వేశ్యలు కావలసివచ్చినా చెప్పగలిగాడు గానీ, శ్రమ జీవులైన వృత్తికుల నిమ్నజాతుల ప్రస్తావనే లేదని దుయ్యబట్టాడు.

పెద్దన తరువాత పేరెన్నికైన కవి. తెనాలి రామలింగం కవి రాసిన 'పాండురంగ మాహాత్మ్యం' 'ఘటికాచల మాహాత్మ్యం' అనే రెండు కావ్యాలను అనుశీలన చేసారు అయిలయ్య సారు "పాండురంగ మాహాత్మ్యం"లో నిగమశర్మ ప్రసిద్ధి చెందిన కథ. ఇందులో నిగమశర్మను అపవిత్రునిగా జేసి, అతనిని కాపు స్త్రీతో, మాలస్త్రీతో, కాపురం చేయించి వారి ద్వారా ఒక కుమారుడు కలుగు తాడు. ఆ కుమారుడున్న గుడిసెకి నిప్పు అంటుకొని కాలిపోయిన సంఘటన తెనాలి చిత్రించడం వెనక ఉన్న రహస్యం చాతుర్వర్ణ ధర్మమేనని నిర్ధారించాడు బన్న అయిలయ్య గారు. అయితే ఇది కుల వర్ణ దృష్టికోణం నుండి చూడకుండ కథగా చూస్తే అసలు స్పృహలోకే రాదు. అలాగే 'ఘటికాచల మహాత్మ్యం'లో ఒక దాసికి పుట్టిన బాలుడు నిత్యం విష్ణుభక్తిలో నిమగ్నమై ఉంటాడు. ఇతనికి తపస్సు చేయాలనే కోరిక ఉంటుంది. ఇతనికి తన తల్లి చనిపోయిన తరువాత విష్ణువు లిప్త పాటు కనబడిపోతాడు. ఇందులోని చాతుర్వర్ణ దృక్పథాన్ని చెప్ప గలిగాడు అయిలయ్య గారు. ఈ జన్మలో నీవు దాసీ పుత్రుడవు మరో జన్మలో నా సాన్నిధ్యం లభిస్తుందని విష్ణు ఆ బాలుడికి చెప్పడంతో ఆ పిల్లవాడు కొండపైకెల్లి అక్కడి నుండి దూకి మరణించడం వర్ణ వివక్షలో భాగమే అంటాడు అయిలయ్య, ఎందుకంటే కవి దాసిపుత్రునిపై కర్కశ హృదయాన్ని ప్రదర్శించాడు. భాగవతంలో ప్రహ్లాదుడు కూడా సరిగ్గా ఇలాగే కొండపై నుండి దూకుతాడు. ప్రహ్లాదుడు రాక్షస పుత్రుడై పుట్టినా హరి అతనిని రక్షించాడని, దాసీ పుత్రున్ని ఎందుకు రక్షించ లేదనే ప్రశ్న లేవనెత్తి, దీని వెనుక అగ్రకుల కుట్ర దాగివుందనే నిర్ధారణకు వచ్చారు.

రాయల రచన 'ఆముక్త మాల్యద" వైదిక మత ప్రచారం కొరకు వెలువడిన గొప్ప కావ్యం. ఇందులో "మాలదాసరి కథ" ఒక ప్రసిద్ధ కథ. మాల దాసరి మధుర గానంతో దేవున్ని మెప్పించినవాడు. అయినా అతనికి ఆలయ ప్రవేశం లేదు. ఇక్కడ మంచి మధురమైన గొంతు ఉన్నా అతని గానాన్ని దేవుడు మెచ్చుకున్నా సరే, వర్ణాశ్రమ ధర్మాన్ని పాటించక తప్పలేదు. వర్ణం దృష్ట్యా హీన కులజులు ఎంత భక్తి శ్రద్ధలు ప్రదర్శించి దేవునికి దగ్గరయినప్పటికి ఆలయ ప్రవేశముండదనే ధర్మం ఈ కావ్యం ద్వారా సమాజానికి విన్నవించదలచాడు రాయలు అనే సత్యాన్ని బహిర్గతం చేసారు అయిలయ్యసారు. ప్రబంధాలలో కుల ప్రస్తావనను చేస్తూ, ఆ కుల స్థానాన్ని నిర్ధారించి అలా అంతవరకు మాత్రమే వారిపరిధి అని వలయాలను గీచిన కావ్యాలుగా ప్రబంధ కావ్యాలను ఎండగట్టారు బన్న అయిలయ్య.

నాలుగవ వ్యాసం "రాయప్రోలు కవిత్వంలో కుల మతాల ప్రస్తావన" రాయప్రోలు జాతీయోద్యమంలో భాగంగా సంఘ సంస్కరణోద్యమం ద్వారా ప్రభావితమైన కవి. రాయప్రోలు 'తృణ కంకణం' కావ్యం ద్వారా అమలిన

శృంగారం సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. తెనుగుతోటలో ''ప్రేమ వృత్తికి చండాల భేదవేల బ్రాహ్మణా గ్రహారమునందు పవలురేయి పిసరు పోనీరు కడజాతి వాటియందు తాక లేక వీచుని పక్ష తంత్ర జడిమ'' ప్రేమకు వర్ణ భేదాలు లేవని ప్రేమ అనేది అందరి హృదయాలలో పరస్పరం భావన కలుగుతుందని చెప్పడం ద్వారా బన్న అయిలయ్య గారు రాయప్రోలు కవిత్వంలో కుల ప్రస్తావనని పట్టుకొన్నారు.

''కుల భేదము -మత విరోధము పొటమరించె స్ఫోటకమువలె ఇరుగు పొరుగుల యివ్వ బంధము తెగెన్ వురివిడికటకటన్'' ఈ పద్యమును చెప్పి కుల మత విరోధములు వ్యాపించకుండా సర్వమతాలశాంతిని రాయప్రోలు కోరుకున్నాడని ఇది సమాజశ్రేయస్సును కోరుకునే అంశంగా భావించారు అయిలయ్య గారు. ఒక రాష్ట్రం మరొక రాష్ట్రంతో, ఒక దేశం ప్రక్క దేశంతో కొట్లాడుకోవడం మంచిది కాదని దాయాదులు కొట్లాడుకోవడం వల్ల అనర్థాలు సంభవిస్తాయని దీనిని మహా భారతం ద్వారానే నేర్చుకున్నామన్నారు. దేశంలో కులమతాలు అశాంతికి కారణభూతమవుతాయని అలాంటి కుల మతాలను రాయప్రోలు సుబ్బారావు తన కవిత్వంలో తూలనాడాడని నిర్ధారించినాడు బన్న అయిలయ్య. రాయప్రోలు దేశభక్తిలో సంఘ సంస్కరణ, మానవత విలువలతో పాటు దేశ సమగ్రత కొరకు కులమత భేదాలను కూడా విస్మరించాలని తెలిపాడని అయిలయ్యగారు విన్నవించారు.

అయిదవ వ్యాసం ''ఈ శతాబ్ధి కవి జాషువా'' ఈ వ్యాసం వ్యాసకర్త జాషువాను ఇరవయ్యో శతాబ్ధి కవులలో విశిష్టమైన కవిగా చెపుతూ, సమకాలీన కవుల కవిత్వం కంటే జాషువా కవి కవిత్వం విలక్షణంగా ఉంటుందని చెప్పాడు. జాషువా భావ కవులలాగా అభూత కల్పనల జోలికి పోకుండా ప్రేమ కోసం, ప్రేయసి కోసం దుఃఖించకుండా సాంఘిక రుగ్మతల్ని ఖండిస్తూ కవిత్వం రాసాడని బన్న అయిలయ్యగారు అభిప్రాయపడ్డారు. ఈ సంఘంలోని హేతురహితమైన ఆచార వ్యవహారాలలో హింసను కొనసాగించారని, మహిళా లోకానికి ఎనలేని అన్యాయం చేసారని జాషువా ఈ ఆచారాలను, అన్యాయాలను తీవ్రంగా ఖండించాడని తెలిపారు.

కుల మతాల నేపథ్యాలు ప్రస్తావిస్తూ, ప్రాచీన సంఘ సంస్కర్తలయిన చార్వాకులు, బుద్ధుడు, వీరశైవులు, వేమన, వీరబ్రహ్మం మొదలగు వారు కులాన్ని నిరసించారని గుర్తు చేస్తూ, ఆధునిక కాలంలో కుల వివక్ష మత మౌఢ్యం గురించి విశదపరిచాడు. ఇంకా బ్రహ్మసమాజం, ఆర్య సమాజం దివ్యజ్ఞాన సమాజాల సంస్కరణ, జాతీయోద్యమ పోరాటం ఇవన్నీ కుల మత పునాదుల్లోకి వెళ్ళలేదని, ''శోధక్'' స్థాపనతో దేశంలో ఉద్యమం బలపడిందని విశ్వసించాడు. సాహు మహారాజు, అంబేడ్కర్, నారాయణగురు, త్రిపురనేని రామస్వామి, వీరేశలింగం మొదలగు సంస్కర్తలను ప్రస్తావిస్తూ వ్యాసకర్త జాషువా కవిత్వం నేపథ్యంను అంచనా వేసారు.

జ్ఞానం ఒకరి సొత్తు కాదని విద్య అందితే అన్ని కులాలవారు జ్ఞానవంతులవుతారని చెప్పడానికి జాషువా నిలువుటద్దంగా చూపాలనుకున్నాడు వ్యాసకర్త. అందుకే జాషువా రాసిన పద్యాల కొన్నింటి పాదాలను క్రోడీకరించి వివరించాడు. ''ననువరించిన శారద లేచిపోవునే'' గవ్వకు సాటిరాని పలుగాకులు'' 'బాకున క్రుమ్మినట్లగున్'' ''గంట మూనెదన్ రవ్వలు రాల్చెదన్ గరగరల్ సవరించెద నాంధ్రవాణికిన్'' అనే ఆత్మ విశ్వాసాన్ని ప్రకటించిన జాషువా కవిత్వాన్ని కొనియాడాడు.

హిందూమతం సజాతీయులని అంటరానివారిగా చిత్రించి బహిష్కరణకు గురిచేసి వారిపై ఆర్థిక దోపిడి చేస్తూ ఉండడాన్ని జాషువా ''పసరం కన్నా హీనంగా'' చూసారని ధ్వజమెత్తాడని హిందూ ధర్మశాస్త్రాలే విరుద్ధ భావాలను సంతరించుకొన్న అంశాలను గుర్తు చేసాడు వ్యాసకర్త. జన్మనా జాయతే శూద్రః, ఆర్యాలై వర్ణికా, చాతుర్వర్ణన మాయాస్పష్టం గుణకర్మ విభాగశ నాస్తితు పంచమః;'' ఇలా ఎన్నో సూక్తులు సజాతీయులయిన శూద్రులను పంచములను హింసించేవి ఉన్నాయన్నాడు. కుల సృష్టిని సామాజిక సృష్టిగా తెలుపుతూ ''ముసలి వాడైన బ్రహ్మకు బుట్టినారు'' అని ప్రశ్నించాడు జాషువా. మానవత్వం కనబడని దైవత్వం ఎందుకని ప్రశ్నించాడు.

"కనబడలేదు దైవతముగాని పదార్థము భారతంబునన్" భారతంలో ఎక్కడా మనిషిని మనిషిగా చూసినట్లులేదని శ్రమజీవులు దరిద్రులుగా మిగిలిపోయారని వ్యధను వ్యక్తపరుస్తూ, మత దురాచారాలను దూషించాడు. సమాజ ప్రధాన ప్రవంతికి దళితులను దూరం చేసారని బాధ పడ్డాడు. గబ్బిలము, స్వప్నకథ, అనాథ, ఖండకావ్యాలలో అంశాలను ప్రస్తావిస్తూ జాషువాను ఇరవయ్యో శతాబ్ది కవులలో మానవతావాదిగా, సమతావాదిగా, పరిపూర్ణ జాతీయవాదిగా నిరూపిస్తూ, జాషువా కవిత్వం సామాజికశక్తిగా నిలిచిందని బన్న అయిలయ్యగారు ప్రతిపాదించారు. అయితే ఆరవవ్యాసం "వైజ్ఞానిక దాశరథి". ఈ వ్యాసాన్ని మినహాయిస్తే,

ఏడవ వ్యాసం "గుడిసెలు కాలిపోతున్నై- భీమన్న దృక్పథం" అనే వ్యాసంలో భారతీయ సమాజాన్ని డా॥బోయి భీమన్న ఎన్ని కోణాల నుండి రాసాడో తెలిపాడు. బోయి భీమన్న గుడిసెలు కాలిపోతున్నై కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిన విషయాన్ని గుర్తుచేస్తూ, నిమ్న, బలహీన వర్గాల వాళ్ళు ఆర్థికంగా ఎదగకపోవడానికి కులం కారణమేనని చెబుతూ, పురాణ, ఇతిహాసాలలోని వర్ణ ప్రస్తావనలను తెలియజేసారు.

హిందువులు అగ్ర కులాలవారు కింది కులాల వారిని ఇష్టానుసారంగా అణచివేస్తారని, మతం నిర్మూలించబడితే కులం దానంతటది నిర్మూలించబడుతుందనే భావనను వ్యక్తపరిచాడు వ్యాసకర్త. భీమన్న కవిత్వంను రెండంచుల పదునున్న కత్తిలా అభివర్ణించాడు. ప్రాచీన ఆర్య సమాజంలో కులభేదం లేదని భావించిన భీమన్న "గో బ్యాక్ టు వేదాస్" సంప్రదాయవాదిగా కనబడతాడని, దీనిని బట్టి భీమన్నను ప్రగతివాద, సంప్రదాయవాద సమన్వయకర్తగా గుర్తించాడు.

"వన్యవ్యవస్థ" కవితలో "బలం కలవాడు పులి/ తెలివి కలవాడు నక్క/ ఈ ఇరువర్గాలకు ఆహారంగా/ బ్రతుకుతున్న మూర్ఖులు గొఱ్ఱెలు" అంటాడు భీమన్న. అమాయక గొఱ్ఱెలను మోసం చేస్తూ దోపిడి వ్యూహ రచనకు ఒడిగడుతారని, మతం ఆశలు కల్పిస్తుందని ఈ ఆశలు పేదవారికి ఓదార్పును అందిస్తాయని అందుకే పేదవారు మతాన్ని నిరంతరం బతికిస్తూవుంటారంటాడు భీమన్న. "మతం ఒక పిచ్చి" కవితలో చెప్పిన విషయాలను బన్న అయిలయ్యగారు వివరించారు.

హిందూ మతం దేవుళ్ళు చేసింది హేతువాదులను, మేధావులను, సామాజిక విప్లవకారులనేనని వారే రాముడు, బుద్ధుడు, కృష్ణుడని భీమన్న తెలిపాడు. త్రేతా, ద్వాపర యుగాల కథల్ని విని ఆనందించాలి గానీ అవి సత్యాలని నమ్మకూడదంటాడు. కృష్ణ నిర్యాణం తరువాత ఆ మరునాడే బావమరిది పార్థుడికే దిక్కు లేక పోయిందన్న సత్యాన్ని నేటి తరం గ్రహించాలని భీమన్న తెలిపాడని చెప్పారు అయిలయ్య గారు.

మనిషిలో సత్యం, అహింస, నీతి, నిజాయితీ ఉండాలని కాని నేటి సమాజంలో మతం సమాజాన్ని లేవని ఆటవిక దశకు చేర్చిందని భీమన్న చెప్పినట్లు క్రోడీకరించారు.

"ఈ గుడులన్నీ మట్టివి
ఈ దేవుళ్ళంతా మిణుగురులు
ఈ మతాలన్నీ దొంగల గుహలు
ఈ మనుషులు బుఱ్ఱలేని బొమ్మలు"

కవితను చెపుతూ, మానవులు హేతుబద్ధ ఆలోచనలు చేయక మోక్షము అనే దానిని గుడ్డిగా నమ్ముతున్నారని భీమన్న చెప్పిన మరో విషయాన్ని ప్రస్తావించారు అయిలయ్య గారు. "హరిజనులు ఆర్యులే" అని ప్రతిపాదించినట్లు తెలిపారు. ఆర్యులు వచ్చి ద్రావిడుల ప్రస్తావనలో హరిజనులను మూలవాసులుగా, ద్రావిడులుగా చిత్రిస్తున్న సందర్భంలో హరిజనులు ఆర్యులే అనడం విశేషంగా చూడవచ్చు. అయితే బోయి భీమన్న ఆలోచన ప్రకారం భారతాన్ని రాసిన వ్యాసుడు నిమ్న జాతీయుడని, సవర్ణులు వ్యాసున్ని తమలో చేర్చుకొని వ్యాస వారసులు అయిన నిమ్న వర్గాలను వెలివేసారని తెలుపడం కొత్తకోణంగా తెలిపారు అయిలయ్య గారు.

ఈ దేశంలో ఓటు పేదవారికి ప్రక్కలో పాము అంటాడు భీమన్న. ఇది ప్రజల్ని బానిసలుగా చేసిందన్నాడు. అది సామాన్యుల జీవితాలను అశాంతిమయం

చేస్తుందని, ధనికుల ప్రయోజనాలను కాపాడుతుం దంటాడు. మతం వల్ల నిరుపేదలే మోసపోతారని, పేదలంతా గుడిసెవాసులేనని, ప్రతియేటా ఎన్నికల సమయంలో వీరి గుడిసెలు కాలిపోతాయని దీనితో నిమ్న జాతీయులు మేలుకుంటారనే, ఆశాభావాల్ని వ్యక్త పరిచినట్లు వ్యాసకర్త బన్న అయిలయ్య గారు విశ్లేషించారు.

ఎనిమిదవ వ్యాసం "పోటెత్తిన దళిత భావార్ణవం - మద్దూరి కవిత" దళిత కవులలో సాహిత్యం అస్పృశ్యతా మయమవుతున్నదనుకునే కాలంలో "వెలివాడ" మద్దూరి నగేష్‌బాబు కలం నుండి జాలువారింది. ఇది మద్దూరి నగేష్‌బాబు దళిత కవిత్వానికి ఇందనంలాగా పనిచేసాడు. అయితే దళితులంటే కేవలం మాల మాదిగలే కాదని సమస్త పీడిత కులాలు, మైనార్టీలు అంటూ బి.సి. విమర్శలు ఉద్యమాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటున్న సమయంలో 'రచ్చబండ' కావ్యంలో మద్దూరి ముందుకు వచ్చాడంటారు అయిలయ్య గారు.

"వెలివాడ" లోని కొన్ని కవితలలోని వస్తువును గుర్తించి వివరణ ఇచ్చారు. అయితే మద్దూరి నగేష్ కవితా వస్తువు ఒకవైపు హృదయ విదారకమైన అంశాన్ని తెలుపుతూనే ఇంకోవైపు దాని ఆలోచన తీవ్రతను తెలుపుతుంది. నిమ్నజాతి వారి చదువులో అణచివేతను, దళితులపై భౌతికదాడులను స్త్రీలపై అత్యాచారాలను, దళితుల దీనస్థితిని తెలియజేస్తూ, వీటన్నింటిని భరించేశక్తినిచ్చేది దళిత తల్లి ఉగ్గుపాలలో ప్రేమను రంగరించి పోస్తుందని చెప్పడం. దళితుల ఓపికను బలహీనంగా తీసుకొని దాడులు చేసేవారిపై సరియైన బుద్ధి చెప్పాలని దళితులు పోరాటానికి సిద్ధపడ్డ విషయాన్ని తెలియజేసారు "అమ్మా నన్ను క్షమించు/ రాడ్ క్లిఫ్ దండెం మీద వాడు నా పేగులు ఆరేస్తుంటే/ నేను శాంతి వచనాలు వల్లించలేను" అని దళిత ఉద్యమ చైతన్యాన్ని ప్రకటించిన నగేష్ బాబు కవితను విశ్లేషించారు అయిలయ్య గారు.

అగ్రకుల దాడుల్లో, రేపుల్లో కిరాతక చర్యలకు ఎందరో దళిత స్త్రీలు బలైపోయారని, కొందరిని ఉదాహరిస్తూ మహిళలు "బావుల గుండెల్లో మందుపాతరై పేలాల్సిందే". మహిళలు ప్రతిఘటనకు సిద్ధపడుతూ, తమను తాము రక్షించుకోవాలని హితవు పలికారు నగేష్ బాబు.

దేశంలో చిన్న నాయకుడు మరణించినా అతని స్మృత్యర్థం దేనికో ఒక దానికి పేరు పెడతారని, అంబేడ్కర్ పేరు పెట్టడానికి ఈ కుల సమాజం అంగీకరించదని తెలుపుతూ శ్రమజీవులైన దళితులకు తిండి సరిగ్గా దొరకని సమాజమని ప్రజలు దారిద్ర్యంలో క్రుంగిపోతున్నా ఉద్యోగం లేక క్రుంగిపోతున్నా పట్టించుకునే వారే లేరని వాపోతూ, ఫుట్‌పాత్‌లపై ఆకలితో అలమటించే వారి గురించి ప్రస్తావించిన విషయాన్ని తెలుపుతూ...

"విస్తరికి అన్నంలాగో
రాజకీయ నాయకుడికి ఓటర్‌లాగో
రోడ్డుకి ఫుట్‌పాత్"

అనే కవితను వ్యాసకర్త బన్న అయిలయ్య గారు వివరించారు. ఫుట్‌పాత్ ఏదో ఒకరోజు మందు పాతరవు తుందని చెపుతారు. మద్దూరి నగేష్ బాబు పోయిట్రీ బలమైన దళిత కవిత్వాన్ని అందించింది. అగ్రవర్ణ బ్రాహ్మణీయ భావజాలంతో కనిపించని అసమానతలను ప్రచారం చేసాయని, కులం పేరుతో వ్యక్తి గౌరవాన్ని మానవీయతను మంటగలుపుతున్నాయని తెలుపుతూ, మద్దూరి తెలుగు దళితవాడల నుంచి సోమాలియా ఆకలికేకల వరకూ వివక్షను ఎండగట్టాడని బన్న అయిలయ్య గారు అభిప్రాయపడ్డారు.

తొమ్మిదవ వ్యాసం "ఆధునిక తెలుగు కవిత - దళిత కవిత్వం" పందొమ్మిది వందల ఎనభై నుండి మొద లయిన కుల చైతన్యం ఇరువయ్యో శతాబ్ది పూర్వార్థం నందు సాంఘిక అసమానతల వైపు మళ్ళిందని, ఇది వివిధ రూపాలతో, వివిధ మార్గాలలో సాంఘిక, రాజకీయ సమస్యలపై కులం అనే బలమైన చర్చ సాగిన తరువాత కులం అవిచ్ఛిన్న వాస్తవమని మేధావి వర్గం గుర్తించిం దన్నారు. కులం, కులతత్వం రాజకీయ పరిసరాల్లోకి వచ్చి చేరాయని, కుల రాజకీయాలు ఉత్పన్నమయ్యాయని అగ్రకులస్తులు బ్రాహ్మణీయ భావజాలము వైపు నిలబడితే, హిందూ బ్రాహ్మణీయ భావజాల వ్యతిరేకులు ప్రత్యామ్నాయ సంస్కృతి వైపు నిలబడ్డారు.

డా॥బన్న అయిలయ్యగారు దళిత కవిత్వంలో కుల వ్యవస్థ వ్యక్తి గౌరవాన్ని గురించి ప్రస్తావిస్తూ, కులంతో వృత్తిని నిర్దేశించి, వృత్తితో సాంఘిక హోదాను నిర్ణయించ బడుతుందని, వ్యక్తి ఏ కులంలో పుట్టాడో అది అతడికి ఏమాత్రం ప్రమేయంలేని అంశంగా తెలిపారు. కులాన్ని బట్టి గౌరవించే పరిస్థితిని ప్రశ్నిస్తూ, నిచ్చెన మెట్ల వ్యవస్థను పోలియున్న కుల నిబంధనల కింద కులాలను నీచంగా హీనంగా చూస్తాయని, సైనికులను గౌరవంగా చూస్తాయని తెలిపారు. ఆత్మన్యూనత గలిగిన దళితులు మానసిక సంఘర్షణకు గురవుతారని సంఘర్షణతో ఆత్మగౌరవం, ఆత్మాభిమానం రెండింటి అవసరాన్ని గుర్తిస్తారని తెలిపారు అయిలయ్య గారు.

తెలుగు కవిత్వంలో సామాజిక నేపథ్యాన్ని గురించి చెబుతూ ఋగ్వేద పురుషసూక్తం, మనుస్మృతి రెండూ కుట్రపూరితమైన భారతీయ సమాజాన్ని వారసత్వంగా అందించాయని, వీటి విధి విధానాలే పంచమ వర్ణాన్ని నిర్మించాయన్నారు. శూద్రులు వేదాలకు దూరమవ్వడం, శంభూకుని శిరస్సు నరకడం, ఏకలవ్యుని బొటనవ్రేలును గురు దక్షిణగా పొందడం, ఇవన్నీ విద్యకు దూరం చేయడానికి విధించిన శిక్షలేనని రూఢిచేసారు. ఈ భారతీయ సమాజంలో కుల వివక్ష అంటరానితనం ఈ వ్యవస్థనంతటిని నిర్వీర్య పరుస్తుందని తెలిపారు. అయితే ఈ కుల వ్యవస్థకు ప్రత్యామ్నాయం ఏమిటి ప్రశ్నకు చార్వాకులు, బుద్ధుడు, భక్తి ఉద్యమాలు, సంఘ సంస్కర్తలు, జాతీయోద్యమకారులు, శాస్త్రీయ దృక్పథంతో వచ్చిన భావజాలం జ్యోతిరావు ఫూలే, అంబేడ్కర్, పెరియార్ రామస్వామి, నారాయణ గురు తదితరుల ఆలోచన విధానమే ప్రత్యామ్నాయ వాదంగా చెప్పవచ్చు. అయితే వీరి భావజాలాన్ని మోసుకెళ్తూ, వచ్చిన ఉద్యమమే దళిత ఫాంథర్స్ ఉద్యమం. ఇది దళిత ఉద్యమ సాహిత్య నిర్వచనాన్ని స్పష్టంగా విశదపరిచింది. ఆ తరువాత తెలుగులో వచ్చిన అంబేడ్కర్ రచనలు, దళితులపై జరిగిన దాడులు ఇవ్వన్నీ దళిత సాహిత్యాన్ని ఎట్లా వెలికి తీసినాయో వివరంగా ఈ వ్యాసంలో తెలియపరిచారు. దళిత శబ్ద విచారం దళిత నిర్వచనాల చర్చను తెలిపి, తెలుగు దళిత వాదం ఆయా ప్రక్రియల్లో వచ్చిన వాటిని పొందుపరిచారు. ఏ వాదానికైనా దాని తత్వమొక టుంటుంది. కనక దళిత కవిత్వ తత్వ భూమికను ప్రతిపాదిస్తూ గౌతముని నుండి దళిత ఫాంథర్స్ వరకు జరిగిన చైతన్య చక్రమే తాత్విక బలమని నిర్ధారించారు. ఈ కవిత్వంలో అస్తిత్వంను గుర్తించగలగడం, అస్పృశ్యతను వ్యతిరేకించడం, వివక్షను నిరసించడంతో పాటు దళిత కవిత్వంలో ముస్లిం మైనారిటీ కవిత్వం ఒక భాగంగా వెలువడిన కారణంగా ముస్లిం మైనారిటీ కవిత్వంను కూడా విశ్లేషించారు. దళిత స్త్రీ వాదం, దళిత సాహిత్యంలో నూతన ఆవిష్కరణల గురించి వివరించారు. దళితవాదంలో వచ్చిన సాహిత్యాన్ని ఆయా ప్రక్రియలకు అనుగుణంగా వచ్చిన వాటిని విశ్లేషణ పూర్వకంగా వివరించి, రామాయణ కాలం నుండి పురాణ కాలం నుండీ దళితులు దోషులుగా శిక్షింపబడుతున్నారని, అదే శిక్షలను అగ్రకులాల వారికి వేయాలని చెబుతారు బన్న అయిలయ్య గారు.

పదవ వ్యాసం "వర్తమాన కల్లోల కవిత- ఏదీకాదు" అనే వ్యాసం చివరిది. పోస్టు మాడర్న్ కవిత్వం ప్రారంభం గురించి తెలిపి ప్రసేన్ కవితా సంపుటి "ఏది కాదు"ను తొలి పోస్టు మాడర్న్ కవితా సంపుటిగా నిర్ధారించారు డా॥బన్న అయిలయ్య గారు. ఇందులో "వేలిముద్రలు" కవిత దళిత బహుజన సమాజానికి సంబంధించినయేనని గుర్తుచేసారు. సాంఘిక అసమానతల మీద దృష్టి నిలిపిన దని ఇది దళిత కవిత్వ పరిణామాన్నే మార్చి వేసిందన్నారు. దళిత కవిత్వమంతా ఒకే తరహాలో వచ్చే కవిత్వమనే భావనను ప్రసేన్ "వేలి ముద్రలు" బలంగా తిప్పి కొట్టిందన్నారు. దళిత భాష ఏది అన్న ప్రశ్నకు కూడా సమాధానం దొరికినట్లయింది.

ఏ భాష ఏ యాస/ ఏ గ్రాంధికం/ ఏ గమ్యం/ నాకిపుడు సందేహాల్లేనే లేవు" అని ప్రకటించడం భాషా తత్వాన్ని వెల్లడించింది. దళితులపై జరిగే దాడులను ఆ వార్తలను ప్రపంచానికి అందకుండా చేస్తారు. ఒకవేళ అందినా అది అంటిముట్టనట్టూ రాస్తారని, వార్త పత్రికల ఉపసంపాదకుడిగా వుండి రాయలేని దుస్థితిని తెలియ

జేసారు. ప్రసేన్ ఈ కవితలో "తలలో కవిత్వము లేదు తోకలో రాజ ముద్రాలేదు/ ఇది వార్తేకాదు విశేషమేమీ లేదు/ గుణింతాలను నెమరేస్తుంది మత గ్రంథం" అని దళితుల హత్యలు ఆన్ డ్యూటీ హత్యలేనని, ప్రకటించడం ప్రసేన్ నిబద్ధతకు నిదర్శనంగా చెప్పవచ్చు.

ఈ విధమైన సంఘటనలు జరిగినపుడు రాజకీయం చేస్తూ సానుభూతితో ఎక్స్‌గ్రేషియాతో ముగుస్తాయని సత్యాన్ని నిక్కచ్చిగా తెలిపిన అంశాలను "ఏదీ కాదు, సెకండ్ కమింగ్, మాలవాడలో గుణితం, హరిజన వాలాబాగ్, అంటరాని పాదం; మొదలగు కవితలు వస్తుపరంగా, దృక్పథం పరంగా, ఎంత విలక్షణంగా ఉన్నాయో నిరూపిస్తూ, ప్రసేన్ మిగిలిన దళిత కవుల నుండి విడిగా విలక్షణంగా కనబడుతాడని డా॥ బన్న అయిలయ్య గారు నిర్ధారించారు.

తెలంగాణ దళిత కవిత్వ విమర్శలో 1998 నాటికే ఒక పరిపూర్ణత కలిగిన ఒక దళిత విమర్శ గ్రంథం వచ్చింది డా॥బన్న అయిలయ్య గారిదేనని వ్యాసావళిని అధ్యయనం చేసి పరిశీలిస్తే తెలుస్తుంది. ఇంతకంటే ముందు తెలంగాణ దళిత కవులు ప్రాచీన సాహిత్యం నుండి ఆధునిక దళిత సాహిత్యం వరకు అంటే 1998 వరకు వెలువరించిన దళిత సాహిత్యాంశాలపై వ్యాసాలు వెలువరించడం ఆ సమయంలో బన్న అయిలయ్య గారే చేయగలిగారని నేను ప్రతిపాదిస్తున్నాను. అంబేడ్కర్ భావజాల ఉధృతిలో వచ్చిన ఆలోచనా సరళితో తెలుగు సాహిత్యాన్ని ఆసాంతం దళిత దృష్టి కోణంతో చూసిన తెలంగాణ దళిత విమర్శకులు బన్న అయిలయ్య గారని చెప్పక తప్పదు.

**ఉపకరించిన గ్రంథాలు :**

1. ఖండకావ్యం,మొదటిభాగం - గుఱ్ఱం జాషువా
2. సాంఘిక విప్లవ మూర్తులు - కత్తి పద్మారావు
3. కులం-వర్గం - బొజ్జతారకం
4. ఎదురీత - కల్లెకూరి ప్రసాద్
5. వీచిక - దార్ల వెంకటేశ్వరరావు.

★★★

# దైవశాసనం నాటకం - అవినీతి మిగిల్చిన విషాదం

- డా॥. పురుషోత్తం గుంట, తెలుగు పరిశోధకులు, తమ్మినాయుడుపేట, శ్రీకాకుళం.

భారతీయ సాహిత్యం క్రీ.పూ. నుండి ఈనాటి వరకు అనేక ప్రక్రియల్లో వెలువడింది. సాహిత్య ప్రక్రియలన్నింటిలోనూ శక్తివంతమైన ప్రక్రియ నాటకం. ఇది దృశ్యకావ్యమై ప్రజల హృదయాలను తాకగలిగే శక్తి ఉంది. అందుకే ఆనాటి నుండి ఈనాటి వరకు నాటక ప్రక్రియ కొనసాగుతూ ఉంది. మద్య ద్రాడిడ భాష అయిన తెలుగులో నాటకం ప్రధానంగా ఆధునిక యుగంలోనే ప్రతిష్ట పొందింది. ఇటువంటి తెలుగు నాటకానికి ఉజ్వలమైన చరిత్ర ఉంది. అందులోనూ సాంఘిక నాటకం మరింత ప్రఖ్యాత పొందింది. కారణం ఏమనగా, ఇది సమాజంలోని సమస్యలకు స్పందిస్తూ సమకాలీన వ్యవస్థను ప్రతిబింబిస్తూ ముందుకు సాగింది.

సాహిత్యం యొక్క ప్రధాన ఉద్దేశం సమాజానికి హితం కలిగించడం. అందుకే విశ్వశ్రేయో కావ్యం అని ఆర్యులన్నారు. ఈనాటి దైవశాసనం నాటకం ఆమాటని ఆచరిస్తూ సమాజానికి ఒక హితవును బోధించడానికి ప్రయత్నించింది. ఒక దురాచారం, వ్యవస్థను ఎలా కీడు చేస్తుందో చెపుతూ కొందరికైనా గుణపాఠాన్ని నేర్పి సమాజ శ్రేయస్సుకు దారి చూపింది.

హస్య బ్రహ్మ భమిటిపాటి కామేశ్వరరావుగారి ఏకైక పుత్రుడైన భమిడిపాటి రాధాకృష్ణ వివిధ నాటకాలు రాసారు. ప్రస్తుతం నేను సమీక్షిస్తున్న నాటకం, భమిడిపాటి రాధాకృష్ణ రాసిన "దైవశాసనం" ఈ దైవశాసనం నాటకంలో రచయిత ఒక అధికారి అవినీతివలన కలిగే దుష్పరిణామాలు తెలియజేసారు. ఎంత మంచి వ్యక్తినైనా చుట్టూ ఉండే కొందరు సంఘవిద్రోహశక్తులు అవినీతి వైపు పురిగొల్పుతూ అవసరాల్ని చూపించో, ఆశపెట్టో, భయపెట్టో, బాధపెట్టో హింసద్వారా అవినీతి కూపంలోకి దించాలని ప్రయత్నిస్తారు. అనివార్య కారణాల వల్ల వారి వలలో చిక్కుకున్న అధికారులను తమ చేతిలో కీలు బొమ్మలుగా మార్చుఉంటారు. ఆ అధికార్ల ద్వారా అవినీతి చేయిస్తూ వీరు లబ్ధిపొందుతుంటారు. ఆ అదికారుల కుటుంబాన్ని దురలవాట్లపాలు చేసి ఆ కుటుంబాన్ని వినాశనం చేసి వారికి కావలసిన డబ్బుని వాళ్ళు చేజిక్కించుకుంటారు. అలాంటి వినాశకారి మాయలో పడిన ఒక మంచి అధికారి ఎలాంటి పరిస్థితిని ఎదుర్కుంటాడో ఈ నాటకంలో రచయిత చూపిస్తాడు.

జగన్నాధం అనే ఉద్యోగి నీతినిజాయితీతో ఉద్యోగం చేస్తాడు, సెలవు సమయంలో కూడా తన ఆఫీసులో ఉండే పైళ్ళను ఇంటి తెచ్చుకుని పనిచేస్తాడు. ఇతనికి ఉద్యోగం అంటే చాలా ఆసక్తి నిబద్దత గల ఉద్యోగి. ఇతని భార్య కనకమ్మ ఇతని తోటి ఉద్యోగి విశాఖరావు ఇతను పెద్దలంచగ్రాహి ఇతడు జగన్నాధంకి వియ్యంకుడు. జగన్నాధం తన కుమార్తె కమలను విశాఖరావు కుమారుడు శంకరం కిచ్చి వివాహం చేయడానికి నిర్ణయించుకుంటారు. కమలను పెళ్ళి చేసుకోడానికి విశాఖరావు కుటుంబం ఒప్పుకుంటుంది. విశాఖరావు అబ్బాయి శంకరం ఇతను డాక్టరుగా పనిచేస్తాడు. జగన్నాధం గారి అమ్మాయి అయిన కమలను కట్నం లేకుండా పెళ్ళిచేసుకోవాలని విశాఖరావు కుటుంబం అనుకుంటుంది. కాని ఇంట్లో వారికి తెలియకుండానే విశాఖరావు లాంచనాల కోసం అని తొమ్మిదివేల రూపాయలను జగన్నాధం కుటుంబం నుంచి తీసుకుంటాడు.

జగన్నాధం తన చిన్న కుమార్తె పెళ్ళికోసం డబ్బు అవసరం కావడంతో తన బావ అయిన భుజంగం మాయతో, తన భార్య కనకమ్మ వత్తిడితో తప్పని పరిస్థితుల్లో లంచం తీసుకోవల్సి వచ్చింది. భుజంగం తనకి అవసరమయిన పైలును పెళ్ళికి సరిపోయే తొమ్మిదివేల రూపాయలను జగన్నాధం, కనకమ్మలకి ఇచ్చి ఆ పైలుపై జగన్నాధం యొక్క సంతకం చేయించి ఆ పైలును తాను తీసుకుంటాడు. ఈ విధంగా తన జీవితంలో తొలిసారిగా

తప్పనిసరి పరిస్థితులలో జగన్నాథంకి అవసరమే అతన్ని అవినీతిపరునిగా మార్చింది.

కనకమ్మ తనభర్త ఉద్యోగాన్ని అడ్డుపెట్టుకుని తన తమ్ముడైన భుజంగం యొక్క మాయమాటలు తెలుసుకోలేక డబ్బు సంపాదనే ముఖ్యంగా చేసుకుని అవినీతి మార్గంలో పయనించి చాలా మొత్తంలో డబ్బు సంపాదిస్తుంది. ఈమె కుమారుడైన మురళి చదువుకు ఫీజు కావాలని తన తల్లి దగ్గర చాలా డబ్బులు తీసుకుని చదువు చదవకుండా ఆ డబ్బంతా పేకాటలో తగలెడతాడు. కనకమ్మ తన కుమారున్ని అతిగారాబంగా పెంచడం వలన తన కుమారుడు తన తల్లితో ఇలా అంటాడు. అమ్మా నేను పేకాటలో ఓడిపోయాను. ఆ డబ్బు నేను చెల్లించకపోతే వారు నన్ను శిక్షిస్తారు అని చెప్పిన తర్వాత, ఆమె అతనికి డబ్బులు ఇవ్వడం వలన ఆమె కుమారునిపై మాతృప్రేమ చూపిందేగాని తాను ఈ విధంగా డబ్బులు ఇవ్వడం వలన తనబిడ్డ చెడిపోయి వ్యసనాలకు బానిస అవుతాడని గ్రహించలేని అమాయికురాలు. కనకమ్మ డబ్బు సంపాదనే ధ్యేయంగా చూసుకుని అవినీతి మార్గంలో పయనించి తన సోదరుడు భుజంగం చెప్పిన కల్లబొల్లి మాటలను నమ్మి, చివరికి తన కుమారుడ్ని సరైన ప్రవర్తనలో పెట్టలేక తన కుమారుని జీవితం చాలా వ్యసనాలకు బానిసై ఒక బోగందాని ఇంట్లో ఎవరిచేతో హత్యకు గురై తన కుమారుడు మరణిస్తాడు. ఈ వార్త విన్న తర్వాత జగన్నాథం, కనకమ్మలు నిశ్చేష్టులవుతారు. ఈ విధంగా తల్లిదండ్రులు తమ బిడ్డల బాగోగులు అనేవి చిన్నప్పటి నుంచి సరైన విధంగా పట్టించుకోకపోతే పెద్దవారి ప్రవర్తన పిల్లల మీద ఏవిధంగా పడుతుందో మనకు ఈ నాటకం ద్వార తెలుస్తుంది.

శంకరం, ఇతడు విశాఖరావుగారి కుమారుడు, మరియు జగన్నాథం గారి అల్లుడు. ఇతనికి అవినీతి అనేది నచ్చదు. తన తండ్రి అవినీతి మార్గంలో సంపాదించడాన్ని వ్యతిరేకిస్తాడు. ఇతడు తప్పు జరిగిన చోట మొహమాటం లేకుండా అడుగుతాడు. ఇతడు భుజంగం లాంటి మోసగాళ్ళకు కంటిమీద కునుకు లేకుండా చేస్తాడు. ఈ నాటకంలో శంకరం కట్నం లేకుండా వివాహం చేసుకుని సమాజానికి ఆదర్శంగా నిలుస్తాడు. అవినీతిమయంలో కురుకుపోయిన తన తండ్రికి గుణపాఠం చెప్తాడు. శంకరం తన ఇంటిలో ఉన్న అవినీతికి అడ్డుకట్ట వేయాలని ప్రయత్నించడం ద్వారా, ఈ నాటకాన్ని చదివిన ఎంతో మంది యువకులు శంకరం పాత్ర ప్రభావంతో అవినీతిని ఎదిరించడానికి పురిగోల్పుతుంది. మోసగాళ్ళకే మోసగాడయిన భుజంగం పై శంకరం పోరాడి చివరికి భుజంగాన్ని జైలుకు పంపిస్తాడు. ఈ విధంగా ఏదైన దురాగతం పై మనం పోరాడకపోతే ఫలితం ఉండదని మనకు తెలుస్తుంది.

భుజంగం అనేవాడు పెద్ద మోసగాడు ఇతడు జగన్నాథం కుటుంబాన్ని చిన్నాబిన్నం చేస్తాడు. ఇతనికి తనవాళ్ళు బయటవాళ్ళు అనే భేదం లేదు. అందర్ని ఒకేవిధంగా మోసం చేస్తాడు. ఇతడు అవినీతిమయమైన జీవితం సాగిస్తాడు. జగన్నాథం కుటుంబాన్ని అవినీతి యమంలో పడేసిన భుజంగానికి కొన్నేళ్ళ తర్వాత తన ఆటలు కొనసాగవు. ఎందుకంటే కొన్నేళ్ళ తర్వాత జగన్నాథం, కనకమ్మలు భజంగం అడిగిన పైల్లును ఇవ్వటానికి అంగీకరించరు.

ఆ తర్వాత భుజంగంకి డబ్బులు వచ్చే మార్గం లేకపోవుటచే కనకమ్మ ఇంటిలోనే కనకమ్మ కుమారునిచే దొంగతనం చేయించి, ఆ దొంగతనం చేసింది. మీ ఇంట్లో పనిచేసే నౌకరు రంగయ్యే అని ఆ నెపం రంగయ్య మీద నెట్టివేస్తాడు. దీనినతో రంగయ్య జీవితం అన్యాయం అయిపోయింది. ఈ విధంగా భుజంగం తన అవసరం కోసం తన అక్క, బావ, మేనల్లుడులను అవినీతి పరులుగా మార్చి చివరికి జైలు జీవితం గడుపుతాడు.

ఈవిధంగా దైవ శాసనం నాటకం ద్వార మంచి వారిని అవినీతి కూపంలోకి లాగి నాశనం చేసిన దుర్మార్గులను చూసాం అంతేకాకుండా అవినీతి మార్గంలో సంపాదించిన సొమ్ము పక్కలో బళ్ళెంలాగా, నట్టింట్లో పాములాగా, ఎదో ఒకరోజు కీడు చేయకమానదు అని తన నాటకంలోని పాత్రల ద్వారా రచయిత తెలియజేసాడు. ఒక్కసారికే కదా, అత్యవసరం కదా, అని అవినీతివైపు మనం

ఆకర్షితులం అయితే, అది తన ఆకర్షణతో మన నాశనానికి కారణం అవుతుంది. అని రచయిత నొక్కి వొక్కానించి అవినీతి పరులను హెచ్చరించారు. అంతేకాకుండా అవినీతి పాల్పడాలి అంటే బయపడే విధంగా అధికారులకు జ్ఞానోదయం కలిగించారు. ఈవిధంగా ఈ నాటకం అవినీతిపై సమరం చేసింది.

**ఆధార గ్రంథాలు :**

1. భమిడిపాటి రాధాకృష్ణ - దైవశాసనం (నాటకం)
2. వెలమల సిమ్మన్న - తెలుగు సాహిత్య విమర్శ -సిద్ధాంతాలు
3. ఆచార్య సజ్జా మోహన్‌రావు సంపాదకత్వంలో - సాంఘికోద్యమ రూపకాలు.

★★★

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

# తెలుగు నాటక సాహిత్యం - ఆరంభ వికాసాలు

- డా॥. కె. చిదానంద, అతిథి ఉపన్యాసకులు, తెలుగు అధ్యయనశాఖ, బెంగళూరు విశ్వవిద్యాలయం, జ్ఞానభారతి, బెంగళూరు.

ప్రస్తావన :

"నానాభావోప సంపన్నం నానావస్థాంతరకృతమ్
లోక వృత్తానుకరణం నాట్యమ్ తన్మయాకృతమ్"
(భరతముని - నాట్యశాస్త్రం)

భావాలతో కూడుకున్నదీ, అనేక అవస్థలతో నిండి ఉన్నదీ, లోక వృత్తిని అనుకరించే అయిన నాటకం నా చే రచింపబడిందని భరతముని నాట్యశాస్త్రంలో చెప్పారు.

తెలుగు సాహిత్యంలో నాటక ప్రక్రియకు ఒక ప్రత్యేక స్థానముంది. నాటకం సమాజాన్ని సంస్కరించేది. సమాజం లోని సుఖదు:కాలకు అద్దం పట్టేది. పండితుని మొదలు పామరుని వరకు రంజింపజేసేది. సమాజంతోపాటు పరుగెడుతూ, సమస్యలను ప్రస్తావిస్తూ, సంఘర్షణను చూపెడుతూ, పరిష్కార మార్గాన్ని కళ్ళముందు సాక్షాత్కరింపజేసేది. మానవ ప్రవృత్తులకు నిలువెత్తు నిదర్శనమైనది నాటకం. నటీనటులు నటనచే మానవ జీవితాన్ని ప్రతిబింబింపజేస్తారు. ప్రపంచానికి ఒక చైతన్య వంతమైన దారిని చూపిస్తారు. అందుకే సాహిత్య ప్రక్రియ లన్నింటిలో నాటకానికి ప్రతిష్టాత్మకమైన స్థానముంది.

నాటకం అందరినీ ఆకర్షించే ఉత్తమ కళాప్రక్రియ అందుకే "నాటకాంతం హి: సాహిత్యమ్", "కావ్యేషు నాటకం రమ్యం" అన్నారు పెద్దలు. అనేక కథలలను తనలో యిముడ్చుకున్న నాటకాన్ని సమాహార కళ అంటారు. మానవ సమాజంలో తొలినాటి మానవుడు జరిపిన ప్రకృతి దేవతల ప్రార్థనల నుండి కళారూపాలు పుట్టాయని మానవశాస్త్రం చెపుతుంది. సమాజంకోసం సమాజంలో పుట్టిన కళ కాబట్టి సామాజిక కళ అని అంటారు.

## తెలుగు నాటకం - పూర్వరంగం :

క్రీ॥శ॥ 1వ శతాబ్దానికే ఆంధ్రులు లలిత కళల్లో అభివృద్ధి చెందారని శాతవాహన పాలకుడైన హాలుని రచన 'గాథా సప్తశతి'ని బట్టి తెలియవస్తోంది. అప్పటినుండి 12వ శతాబ్దంలో పాల్కురికి సోమనాథుని బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర వచ్చే వరకూ ఆంధ్రదేశంలో కళలు ఏ రూపంలో మనుగడ సాగిస్తున్నది తెలీదు. ఈ కావ్యాల వల్ల 'ఖండితగతి', 'సాంగ' నాటక ప్రదర్శనలు దేశంలో జరుగుతున్నట్లు సమాచారం. 15వ శతాబ్దిలో వినుకొండ వల్లభరాయుడు సంస్కృత ప్రేమాభిరామమును క్రీడాభి రామం పేర ఆంధ్రీకరించాడు. 16వ శతాబ్దం నుండి వీధి నాటకాలు యక్షగానాలుగా రూపుదిద్దుకుని ప్రబలంగా ప్రదర్శింపబడ్డాయి. క్రమేపీ యివి నాటక లక్షణాలను సంతరించుకుంటూ పరిణామం చెందాయి. నాటికి సంస్కృత భాషలో చక్కని రూపక రచన కొనసాగుతన్న, ఏ కవీ పండితుడూ గూడా 19వ శతాబ్దం వరకూ వాటిని ఆంధ్రీకరించపూనుకోలేదు. 19వ శతాబ్దం, 1850 నుండి మన కళారంగంపైన ముఖ్యంగా తెలుగు నాటకాలపైన పాశ్చాత్యుల ప్రభావం సోకింది.

1860లో ప్రప్రథమంగా సంస్కృతాంధ్ర పండితుడైన కోరాడ రామచంద్రశాస్త్రి 'మంజరీ మధుకరీయము' అనే నాటకాన్ని స్వతంత్ర రచనగా సంస్కృత పదభూయిష్టంగా తెలుగులో రచించాడు. ఇదే తొలి తెలుగు నాటకం. 1871లో మరో సంస్కృత పండితుడైన కొక్కొండ వెంకట రత్నం పంతులు వారణాసి ధర్మసూరి సంస్కృతంలో రచించిన 'నరకాసుర విజయ వ్యాయోగము' అనే నాటకాన్ని అదే పేరుతో ఆంధ్రీకరించాడు. 1874-1875లో వావిలాల వాసుదేవశాస్త్రి విలియం షేక్స్పియర్ రచన 'జూలియస్ సీజర్' అనే ఇంగ్లీషు నాటకాన్ని తొలి స్వతంత్ర సాంఘిక నాటకాన్ని తెలుగులో రచించాడు. శ్రీమాన్ గోమఠం సి.వి. శ్రీనివాసాచార్యులు 1892 ప్రాంతంలో రాజా హరిశ్చంద్ర నాటకాన్ని ఇంగ్లీషులోకి అనువదించి ప్రదర్శింపజేశాడు.

1880 ప్రాంతాల్లో మహారాష్ట్ర ప్రాంతం నుండి వామన

భట్ట జోషి అనే మరాఠా రంగస్థల ప్రముఖుని ఆధ్వర్యంలో 'ధార్వాడ నాటక సమాజం' (అసలు పేరు ది ఆల్టేకర్ హిందూ డ్రెమటిక్ కంపెనీ) తెలుగు ప్రాంతం వచ్చి హిందీ నాటకాల్ని ప్రదర్శిస్తూండడంతో ఇక్కడి యువతతో తెలుగు రంగస్థల స్ఫూర్తి రగిలింది. అలా ధార్వాడ ప్రదర్శనలను చూచిన మన ప్రేక్షకుల్లో రేగిన కుతూహలాన్ని యువకుల్లో పెల్లుబికిన కళోత్సాహాన్ని గమనించి కాబోలు కందుకూరి వీరేశలింగం పంతులు వెంటనే షేక్సిపియర్ రచన 'కామెడీ ఆఫ్ ఎర్రర్స్' అనే ఇంగ్లీషు నాటకాన్ని 'చమత్కార రత్నావళి' పేరుతోనూ, శ్రీ హర్ష విరచితమైన 'రత్నావళి' అనే సంస్కృత నాటకాన్ని అదే పేరుతోనూ ఆంధ్రీకరించాడు. అదొక చారిత్రక ఘటనగా నిలిచింది. తొలి తెలుగు నాటక ప్రదర్శన కందుకూరి వారే ఆంధ్రదేశంలో తొట్టతొలి తెలుగు నాటక ప్రదర్శకులైన ఘనత దక్కించుకున్నాడు. ఈయన వ్యవహార ధర్మబోధిని అనే ప్రహసన రచన 1880కి ముందు విజయనగరం మహారాజా బాలికోన్నత పాఠశాలలో కొందరు విద్యార్థులచే ప్రదర్శించబడింది.

ఈ సంచలనంతో నాటకోత్సహం ఆంధ్రదేశాన్ని వరదలా ముంచెత్తసాగింది. 1881-1882 ప్రాంతాల్లో సంపన్న కుటుంబం నుండి వచ్చిన నాదెండ్ల పురుషోత్తమ కవి 32 హిందీ నాటకాలనూ, 10 తెలుగు నాటకాలనూ రచించి ప్రదర్శింపజేశాడు. ఆంధ్రదేశంలో హిందీ రచనలు చేసి ప్రదర్శించిన తొలి తెలుగు కవిగా కూడా పేరొందాడు. 1894 నుండి బుట్టాయిపేట (బందరు) కంపెనీ తెలుగు నాటకాలు కూడా ప్రదర్శించింది. 1882లో రాజా అంకితం జగ్గారావు విద్యార్థి దశలోనే ధార్వాడ ప్రదర్శనల స్ఫూర్తితో విశాఖపట్టణంలో విశాఖ జగన్మిత్ర నాటక సమాజాన్ని నెలకొల్పాడు. ఈ సంస్థలో ఉన్నతోద్యోగులు, విద్యావంతులు సభ్యులుగా ఉండేవారు. ముఖ్యంగా తెన్నేటి జగన్నాథరావు, గోరటి కామేశ్వరరావు, కాదంబరి జగన్నాథరావు, పెట్టి లక్ష్మీనరసింహ కవి, నీలమణి పాణిగ్రాహి (నాయక పాత్రలు) మొదలగువారున్నారు. 1890 నుండి సంస్థ నిర్వహణను మొసలికంటి సూర్య నారాయణ చేపట్టారు. 1894-1895 నుండి రాజా రఘునాథ వర్మ సంస్థను నడిపాడు. 1898న రాజా విక్రమదేవ వర్మ రచన శ్రీనివాస కల్యాణం నాటకాన్ని ప్రదర్శించాడు. విశాఖలోనే 1900లో రాగతి వెంకటరావు మరో నాటక సంస్థ 'సుజనరంజనీ నాట్యమండలి'ని నెలకొల్పి హిందీ నాటకాల్ని ప్రదర్శించాడు.

1883లో రాజమండ్రిలో వసురాయకవిగా పేరొందిన వడ్డాది సుబ్బరాయుడు సంస్కృతంలో భట్ట నారాయణుడు రచించిన 'వేణీ సంహారం' నాటకాన్ని ఆంధ్రీకరించి ప్రదర్శించాడు. కవి గారి వేణి సంహారం లాగానే చిలకమర్తి గారి 'గయోపాఖ్యానం' నాటకాన్ని విస్తృతంగా ప్రదర్శించారు. గయోపాఖ్యానం యీ నాటికే ఎవర్‌గ్రీన్‌గా ప్రదర్శిస్తూనే ఉన్నారు. 1886 సెప్టెంబర్ 14న బళ్లారిలో ధర్మవరం రామకృష్ణమాచార్యులు సరస వినోదినీ సభ పేరుతో నాటక సమాజం స్థాపించాడు. ఈయన వృత్తిరీత్యా న్యాయవాది. ఈయన కొన్ని కన్నడ భాషా నాటకాలతోపాటు 28 తెలుగు నాటకాన్ని రచించాడు. ఈయన ఆంధ్రనాటక పితామహులుగా ప్రసిద్ధుడు. నాటి ప్రముఖ రంగస్థల నటసింహం బళ్లారి రాఘవ స్వయానా ఈయన మేనల్లుడు.

1892లో వెలువడ్డ గురజాడ సంచలన నాటకం, తొలి సాంఘిక నాటకం కన్యాశుల్కంగా, ఆనంద గజపతి గారు సమాలోచన చేయగా కవి గారి మోదోమధనం నుండి యీ కన్యాశుల్కం నాటకం ఒక సునామిలాగ వెలువడింది. మొదటిసారిగా ఈ నాటకం 1892 ఆగష్టులో విజయ నగరం జగన్నాథ విలాసినీ సభ వారి ద్వారా గురజాడ ప్రదర్శింపజేశాడు. కన్యాశుల్కం తొలి రూపం తొలి ప్రదర్శన జరిగిన అయిదేళ్లకు ముద్రింపబడి 01.01.1897న వెలువడింది. సమీక్షలొచ్చాయి. ప్రముఖుల విమర్శలు వచ్చాయి. విజ్ఞుల సలహాలూ, సూచనలూ వచ్చాయి. కవి గారి ఆలోచనలలో కూడా మార్పొచ్చింది. 1906లో ఈ నాటకం గురజాడ దర్శకత్వంలో రిప్పన్ స్కూల్లో ప్రదర్శించబడినట్లు ఆచార్య చాట్ల శ్రీరాములు తెలియపరిచాడు. ఈ నూతన కూర్పు 1909లో ముద్రించ బడింది. ఆంధ్రనాటక రంగంపైన తొలిగా వాడుక భాషా ప్రయోగ నాటకం అది. సాంఘిక నాటకం వారు

సమాజాన్ని అసహనంగా అన్యాయంగా నిర్వీర్యం చేస్తున్న క్షుద్ర సమస్యలపై సంధించిన తొలి బ్రహ్మాస్త్రము నాటకం. దుర్మార్గ సమాజాన్ని కుళ్లబొడిచే భీకర రూపంలో ఉన్నా హింసపై అహింసా పద్ధతిలో వ్యంగాస్త్రంతో యుద్ధం చేసి గెలిచిన రచన. ఇంకా ఎన్నో విధాల ఎందరికో స్ఫూర్తిని కలిగించి నూతన మార్గాలనూ, ఆదర్శాలనూ చూపించిన రచన. కన్యాశుల్కం నాటకంపై తెలుగు నాటక రంగ సాహిత్యంలో వచ్చినన్ని సమీక్షా వ్యాసాలు, పుస్తకాలు మరే నాటక రచనపైనా రాలేదని, ప్లగే ప్రముఖ విమర్శకుడు కె.వి. రమణారెడ్డి ఈ నాటకం గురించి అగస్థికామ్టే మానవవాదాన్నీ, ఇబ్సెన్ పారిసర్య అనువంశింక ప్రభావాల విశిష్టతనీ, షెల్లీ ప్రేమతత్వాన్నీ, బర్సన్ నాట్ మాటల్లోని హాస్యాన్ని, వ్యవహారిక భాషావాదాన్ని వీరేశలింగం సంస్కరణ వాదాన్ని ఆయన (గురజాడ) తన ఒక్కరిలోనే కలిపేసుకున్నాడు. కనుకనే ఇంత గొప్ప నాటకం రచించగలిగాడు అంటూ సముచితమైన విశ్లేషణ చేశాడు.

తెలుగు నాటక పరిణామక్రమంలో 'సురభి' నాటక సమాజాల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సి ఉంది. వీరు ప్రస్తుతః తెలుగు వారు కాదు. పొరుగు మరాఠా ప్రాంతం. తెలుగు ప్రాంతానికి వలస వచ్చిన కుటుంబాలుగా తెలుస్తోంది. మరాఠా కళాకారుల నాటక ప్రదర్శనలను తిలకించి, స్ఫూర్తి పొంది కడప ప్రాంతంలో శ్రీ శారదా మనోవినోదినీ సంగీత నాటక సభను స్థాపించి ప్రప్రథమంగా అనంతపురం జిల్లా ధర్మవరంవాసీ, హరికథా భాగవతాలైన రాప్తాటి సుబ్బదాసుచే నాటకాలు రాయించుకుని ప్రదర్శించారు. 'సురభి' గ్రామ భూస్వాములు కళాభిమానులైన రామిరెడ్డి, చెన్నారెడ్డి అనే వదాన్యులు వారికెంతో సహాయం చేసి ప్రోత్సహించారు. 1895లో వీరు కీచకవధ నాటకం చక్కగా ప్రదర్శించినట్లు తెలుస్తోంది. 'సురభి' గ్రామంలోనే వీరూ, వీరి పోషకులూ ఉండడంతో వీరి సమాజాల అసలు పేర్లేవైనా సురభి నాటక సంఘాలుగా వ్యవహరించబడ్డాయి.

సురభి నాటక సంఘాల నిర్వహణా, ప్రదర్శనల తీరూ చిత్రంగా, కుతూహలంగా నిబద్ధతతో ఉంటుంది. వారి కుటుంబాలే నాటక సంఘం. నటీ నటులంతా కుటుంబ సభ్యులే ఆహార్యం రంగస్థల పద్ధతీ - నిర్మాణం, దుస్తుల ఎంపిక తయారీ, పాత్రలకూ కావాల్సిన నగా, నట్రా, కిరీటాలు సర్వం వారే సమకూర్చుకుంటారు. సంగీత పద్ధతులూ పాటలు, కీర్తనలు, నేర్పేదీ, నేర్చేది, పాడేదీ, వాయిద్యాలు మ్రోయించేదీ అన్నీ వాళ్లే. ముఖ్యంగా వీరందరికీ చక్కని గాత్రం ఒనగూడడం వరంగా చెప్పు కోవాలి. స్త్రీ పాత్రలను స్త్రీలే ధరించడం కాకుండా వారిలో పసిబిడ్డ, బాల, స్త్రీ, యువ, వృద్ధులాది అందరూ కళాకారు డైనా, కళాకారిణియైనా అన్ని రకాలైన స్త్రీ, పురుష పాత్రల్ని అవసరాన్ని బట్టి ధరించడం వీరికి పుట్టుకతో పట్టుబడ్డ విద్య, అన్నా చెల్లెళ్ళు నాయికా నాయకులుగా వేస్తారు. తండ్రీ కూతుళ్ళూ అవసరాన్ని బట్టి నాయికా నాయకు లౌతారు.

ఆ దశలో 20 శతాబ్దం ప్రారంభమైంది. 1902లో బళ్లారిలో మరో అద్భుత నాటకకర్త పండితుడు, నాటక కళకు అంకితమైన నటుడు కోలాచలం శ్రీనివాసరావు సుమనోరమసభ పేరుతో నాటక సమాజాన్ని నెలకొల్పాడు. 1900లో పద్మనాభ వెంకోబాచార్య, కోలాచలం శ్రీనివాస రావు దాదాపు ముప్పై పౌరాణిక, జానపద, చారిత్రక నాటకాలు రాశారు. అందులో నాలుగు సాంఘిక నాటకాలు, మూడు ప్రహసనాలు కూడా ఉన్నాయి. శ్రీనివాసరావు రచనల్లో ముఖ్యంగా 'రామరాజు చరిత్రము', 'ప్రహ్లాద' నాటకాలు నటుడు రాఘవను చిరస్మరణీయున్ని చేశాయి. రాఘవ కూడా నటునిగా నాటకరంగ పురోభివృద్ధికి చేసిన సేవ గణనీయం. 1903లో విచిత్ర అష్టావధాని, విద్వత్కవి మల్లాది అచ్చుత రామశాస్త్రి బందరు గొడుగు పేటలో నాటకాలు రాసి ప్రదర్శనలిస్తుండేవారు. 1903-1904 ప్రాంతాల్లో పర్లాకిమిడి జమీందారు పర్లాకిమిడిలోనే పద్మనాభ థియేటర్‌ను స్థాపించి తెలుగు నాటకాలే కాకుండా ఒడిస్సీ నాటకాల్ని కూడా ప్రదర్శించేవాడు.

1905లో బళ్లారి రామకృష్ణమాచార్యుల తమ్ముడైన ధర్మవరం గోపాలాచార్యులు దాదాపు 15 నాటకాల్ని రాశారు. గోపాలాచార్యుల రచనల్లో సుభద్రార్జునీయం ప్రదర్శించారు. భక్తరామదాసు నాటకం బళ్లారి రాఘవకు

మంచి పేరు తెచ్చింది. ఈ రామదాసు నాటకం తెలుగు నాట యిప్పటికీ ప్రదర్శించబడుతూనే ఉంది. 1907లో చక్రావధానుల మాణిక్యశర్మ అనే సంస్కృతాంధ్ర భాషాపండితులు నరసాపురంలో సుమారు ఇరవైమూడు నాటకాల్ని రాశాడు. 1908లో యిచ్ఛాపురం యజ్ఞ నారాయణశాస్త్రి (విశాఖపట్టణం) రాసిన పది నాటకాలలో రసపుత్ర విజయం విస్తృతంగా ప్రదర్శించారు. ఆనాడు ఈ నాటకాన్ని ప్రదర్శించిన సమాజం ఆంధ్రనాట లేదు. 1915లో బందరులో కానుకోలు వెంకట్రామయ్య ఈ నాటకం పోటీలను నిర్వహించాడు. బందరు రాయల్ థియేటరు వారికి ప్రథమ బహుమతి ఈయబడింది. దుర్గాదాసు పాత్రలో రాణించిన మంజులూరి కృష్ణారావుకీ, రాజసింహుడు పాత్ర పోషించిన పింగళి లక్ష్మీకాంతంకీ వ్యక్తిగత బహుమతులందాయి. ఇలా ఎందరెందరో మహోన్నతులు నాటకం పట్ల ఆర్తితో, తపనతో, త్యాగాలతో చేసిన కృషి తెలుగు నాటకానికి క్రాంతి దర్శనం చేశారు.

**ముగింపు :**

ఇలా 1860లో ప్రారంభమైన తెలుగు నాటక సాహిత్యం అనేక పరిణామాలను చవిచూస్తూ, పరిస్థితులను ఆకళింపు చేసుకుంటూ, బాధ్యతాయుతంగా ప్రయాణిస్తోంది. సమాజానికి హితాన్ని ప్రబోధిస్తూ చైతన్యం కలిగిస్తోంది.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు నాటకం : డా॥. పాణంగి శ్రీరామ అప్పారావు, నాట్యమాల ప్రచురణలు, 1967.
2. తెలుగు నాటకం : డా॥. ఎన్. గంగప్ప, తెలుగు ప్రాచ్యభాషా విభాగం, నాగార్జున నగర్, గుంటూరు.
3. కోలాచలం శ్రీనివాసరావు నాటక సాహిత్య సమాలోచనము : డా॥. ఎస్. గంగప్ప, ముద్రణ శ్రీ వరలక్ష్మీ ప్రెస్, ఖైరతాబాద్, హైదరాబాద్.
4. నాటక వ్యాసాలు : డా॥. జె. మునిరత్నం, కల్పనా పబ్లికేషన్స్, తిరుపతి.
5. విజ్ఞాన సర్వస్వము, సంపుటం - 3 : తెలుగు సంస్కృతి, తెలుగు భాషా సమితి.
6. ఆంధ్ర నాటకరంగ చరిత్ర : మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, శ్రీ వేంకటేశ్వర ప్రింటర్సు, కత్తివాక్కం హైరోడ్, మద్రాస్.
7. ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర : కంభంపాటి సత్యనారాయణ, హైదరాబాద్ బుక్ ట్రస్ట్.

★★★

# తెలంగాణ కథా సాహిత్యం - కాలువ మల్లయ్య కథలు

- బి. ప్రవల్లిక, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆర్.బి.వి.ఆర్.ఆర్. ఉమెన్స్ కాలేజ్, నారాయణగూడ, హైదరాబాద్.

తెలుగులో అత్యధిక కథలు రాసిన రచయిత కాలువ మల్లయ్య సాహిత్యమే తనను బతికిస్తుంది. నడిపిస్తుందని హృదయపూర్వకంగా నమ్మి గత నాలుగున్నర దశాబ్దాలుగా సాహితీ సృజన చేస్తున్న అవిశ్రాంత రచయిత. కథ, నవల, కవిత, వ్యాసం, పరిశోధన ప్రక్రియ ఏదైనా మానవతా పరిమళం గుభాళించే రచనలు చేయడం ఈ రచయితకు వెన్నతో పెట్టిన విద్య. ప్రపంచ కథలకే ఆధ్యుడనదగిన గుణాధ్యుడు, కలం పట్టిన తెలంగాణ (కరీంనగర్ జిల్లా కోటిలింగాల) నుండి వచ్చిన ఈ రచయిత కలం నుండి అనేక ప్రసిద్ధ రచనలు వెలువడ్డాయి. కాలువ మల్లయ్య గారు ప్రాథమికంగా కథకులు. అదే కాలువ మల్లయ్య గారితో నడుస్తుంది. ఆయన కథల్లో సజీవ పాత్రలు మనతో నేరుగా సంభాషిస్తాయి. తెలుగుభాషలో ఆయన రాసినన్ని కథలు మరే కథకుడు రాయలేదంటే అతిశయోక్తి కాదు. ఆయన వెయ్యి కథలకు చేరువలో ఉన్నారు. కొవ్వలి వెయ్యి నవలలు రాశారు. కాలువ మల్లయ్య వెయ్యి కథలకు దగ్గరలో ఉన్నారు. ఆయన కథల్లో తెలంగాణ బతుకు చిత్ర స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన వాడే భాష, యాస, శైలి అన్నీ ఆయనను ఒక ప్రత్యేక కథకుడిగా నిలుపుతాయి. కథలే కాకుండా తొమ్మిది పదలు తెలంగాణ కథ (వ్యాస సంపుటి) నూట పదేళ్ళ తెలుగు కథ - విభిన్న ధోరణులు, తెలంగాణ కథ - విభిన్న ధోరణులు, తెలంగాణ కథ - తెలుగు కథ, అంటరానితనం అంబేడ్కర్, చెప్పుల తరాయి, మన జాతిపిత - సంస్కరణ వాది వీరేశలింగం వంటి పుస్తకాలను వెలువరించిన ప్రతిభావంతులు కాలువ మల్లయ్య.

కాలువ మల్లయ్య గారి కథల్లో అట్టడుగు వర్గాల కష్టాల, కన్నీళ్ళు వారి దుఃఖాలు అన్నీ కనిపిస్తాయి. అనుభవాల నుంచి జీవితాల నుంచి, సమాజ మూలాల నుంచి వచ్చే సాహిత్యమే మంచి, గొప్ప సాహిత్య మవుతుంది. సాహిత్య జీవిత వృక్షానికీ పూసే పువ్వు అన్న కొడవగంటి కుటుంబరావు మాటలు జ్ఞాపకం పెట్టుకోవాల్సిన అవసరముంది అంటారు కాలువ మల్లయ్య, ఇది అక్షర సత్యం. చూసిన ప్రపంచం అనుభవించిన జీవితం, తారసపడ్డ వ్యక్తులు, వ్యక్తుల కష్టాలు, బాధలు అన్నీ సాహిత్యంగా మారుతాయి. అలాంటి సాహిత్యమే నాలు కాలాల పాటు నిలిచి ఉంటుంది. అలా నిలిచి వుండే సాహిత్యాన్నే కాలువ మల్లయ్య గారు భుజాని కెత్తుంటారు. గుండెకు హత్తుకుంటారు.

గురజాడ దిద్దుబాటు కథకు ముందే తెలుగులో కొన్ని కథలు వచ్చాయని కథా నిలయం వారు ప్రచురించిన తొలి తెలుగు కథ (ఏడు అభిప్రాయాలు అనే కథా సంకలనం వల్ల అర్థమవుతుంది. ఈ సంకలనంలో బండారు అచ్చమాంబ రాసిన ధనత్రయోదశి (హిందు సమాజం) 1902 నవంబర్ సంపుటం, స్త్రీ విద్య అనే కథలు అచంట సాంఖ్యాయన శర్మ రాసిన లలిత (కల్పలత 1903 నవంబర్) విశాఖ (కల్పలత 1904) అపూ ర్వోపన్యాసం (కల్పలత 1903 నవంబర్) కథలతో పాటు దిద్దుబాటు (ఆంధ్రభారతి 1910 ఫిబ్రవరి) మాడ పాటి హనుమంతరావు హృదయశల్యం (ఆంధ్రభారతి జనవరి 1912) కథలున్నాయి. అంటే గురజాడ కథకు ముందు కనీసం ఐదు కథలు వచ్చాయని అర్థమవుతుంది. అయినా గురజాడ కథనే మొదటి కథ అనాల్సిన అవసరమే ముంది? బండారు అచ్చమాంబనో, ఆచంట సాంఖ్యా యన శర్మనో మొదటి కథకులుగా గుర్తిస్తే గురజాడకు జరిగే నష్టమేం లేదు అంటారు మొదటి వ్యాసంలో. ఇక్కడ గురజాడ ప్రతిభను మల్లయ్య గారు తక్కువ చేసి మాట్లాడినట్లుగా మనం భావించకూడదు. చరిత్రను కులంకుషంగా పరిశీలించి తేదీల వారిగా వచ్చిన కథలను ఈ వ్యాసంలో చూపిస్తూ బండారు అచ్చమాంబ రాసిన కథలే తెలుగులో మొదటి కథలని నిరూపించారు. కాలువ మల్లయ్య. అంటే మొదటి కథలు తెలంగాణ నుండే వచ్చాయని మనమిక్కడ గ్రహించాలి.

తెలుగు కథా సహిత్యంలో తెలంగాణ కథకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఇక్కడ కథ సమస్యల నుండే పుట్టింది. కోస్తా, రాయలసీమ ప్రాంతాలలోని కథలకంటే తెలంగాణ కథ భిన్నంగా అన్పిస్తుంది. అందుకు కారణం చారిత్రకంగా కొన్ని వందల సంవత్సరాలుగా ఈ ప్రాంతం లోని ప్రజలు నిత్యం సంఘర్షణలకు లోనవుతూ పరాయి పాలనలో మగ్గిపోవడమే, ఇక్కడి వాతావరణ పరిస్థితులు, సంస్కృతీ సంప్రదాయాలు, జీవన విధానం, ఆచార వ్యవహారాలు మిగతా ప్రాంతాల కంటే భిన్నంగా ఉం టాయి. 'పేదరికం, నిరక్షరాస్యత, భూసమస్య, వెట్టిచారికి, చాలీచాలని వ్యవసాయం, అణచివేత మొదలైన ప్రాంతీయ సమస్యలు తెలంగాణ కథకు మౌలిక లక్షణాలు' అందువల్లనే తెలంగాణా కథ సామాన్య మానవుని జీవితానికి వాస్తవికతా దర్పనంగా రూపొందింది.

వర్తమానంలో జీవించడానికి చరిత్రను తెలుసు కోవాలసిన అవసరం ఉంది. తద్వారా ఆనాటి సామాజిక పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత తరానికి చరిత్ర ఒక ప్రేరణను కలిగిస్తూ మార్గదర్శకంగా నిలుస్తుంది. ఈ రోజు తెలంగాణలో ఏ బస్సు ఎక్కినా, ఏ గ్రామం వెళ్ళినా ఏ మనిషిని కదిపినా ఒక విషాద స్వరంతో, వీరత్వంతో ఏదో ఒక కథ మన కళ్ళకు సాక్షాత్కరిస్తుంది. తెలంగాణ లోని ప్రతి ఇల్లు కథలకు పుట్టిల్లు, ప్రతి జీవితం ఒక కథాలయం, ఇది ఈనాటి తెలంగాణ కథ పరిస్థితి. 'తెలంగాణలో అపారమైన వస్తు సంపద ఉంది ఈనాడు. కాని దానికి తగినంత వాజ్మయసంపద ఎదగలేదు' ఇందుకు కారణం తెలంగాణ అనేక రంగాల్లో ఎన్నో ఏళ్ళుగా వెనుకబడిన ప్రాంతంగా ఉండటమే. ఇక్కడి ప్రజలు భూమి కొరకు, భుక్తి కొరకు, విముక్తి కొరకు పోరాటాలు చేశారు. 'భారతదేశానికే పోరాటాల వారసత్వాన్నందించిన నేల తెలంగాణ. నిరంకుశ నైజాం వ్యతిరేక పోరాటాలు, భూ పోరాటాలు తెలగాణాలో తీసుకొచ్చిన మార్పులు గణనీయమైనవి' ఉద్యమాలు తెలంగాణా రచయితలతో అనివార్యంగా కలం పట్టించి నాయి. తెలంగాణా కథకులెప్పుడు నేలవిడిచి సాము చేయలేదు. వారు అన్ని ఉద్యమాలను, సామాజిక మార్పులను, విధ్వంసమవుతున్న విలువలను, జీవిత సమస్యలను, పల్లె పట్టణాల జీవిత చిత్రణను కథా వస్తువుగా తీసుకుని రాయడం విశేషం.

సమజా చరిత్ర సాహిత్య రూపం తీసుకున్నప్పుడు అది ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. సమాజ చరిత్రతో పాటు మరింత బలంగా ఉంటాయి. సైన్సు, టెక్నాలజీ, పారిశ్రామికీకరణ ద్వారా 'అభివృద్ధి' చెందిన వారి పరిణామాల గురించి ఎంతో సాహిత్యం వచ్చింది. ఇది 'అభివృద్ధి' తాలూకు మరోవైపుకు చీకటి కోణాలను చూపే కథలు చాలా వచ్చాయి. తెలుగు నేలలో 150 ఏళ్ళుగా పరిశ్రమలు, రైల్వేలు, భారీ నీటి పారుదల ప్రాజెక్టులు విస్తరిస్తున్నాయి. లక్షలాది మంది నిరాశ్రయు లైనారు. నిరుద్యోగులైనారు. జీవితాలు కోల్పోయారు. నమ్ముకున్న నేలను కోల్పోయారు. శతాబ్దాలుగా నమ్ముకున్న పల్లెలు, గూడేలు వలస పోవడం వల్ల నిర్మానుష్యమైపోయాయి. సిమెంటు దుమ్ము వల్ల భూగర్భ జలాలు అడుగంటడంవల్ల, వాగుల రసాయనాలతో కలుషితమవడం వల్ల పంట భూములు, బీడు వారాయి.

కాలువ మల్లయ్య కథల్ని కొన్ని ప్రత్యేకంగా పేర్కొనడం అవసరం. ఆయన రాసిన 'వెలి' కథ చాకలి వాళ్ళ జీవితం చిత్రిస్తే. 'దొరసాని చీర' కథలో చాకలి వాళ్ళపై భూస్వాములు చేస్తున్న దౌర్జన్యం చిత్రించింది. బట్టలు ఉతకటానికి ఇచ్చిన చీరలోంచి ఒక మంచి చీర ఒక పూట కట్టుకోవడం చూసి, దొరసాని చీర కట్టుకొన్న నువ్వు కూడా నాకు అంటూ దొర చాకలి పడుచును దారుణంగా మానభంగం చేసిన విధానం ఇందులో కనబడుతుంది. ఫ్యూడలిస్టిక్ వ్యవస్థలో వున్న దౌర్జన్యం ఈ కథ ద్వారా కళ్ళకు కట్టించారు. 'అడవి కాచిన వెన్నెల' అనే కథలో గొల్లల జీవితాన్ని యదార్థంగా చిత్రించారు. గొర్రెలను ఆదాయ మార్గంగా ఎంచుకోవడంలో ఎన్ని కష్టాలు వున్నాయో వాటిని ప్రాణపదంగా చూసుకుంటూ కాపాడుకుంటానికి ఎన్ని ఇబ్బందులు పడాలో విశ్లేషించిన ఈ కథలో గొల్లల భాష వాస్తవికంగా నిక్షిప్తం చేశారు. 'స్వతంత్ర దినం', 'భూమికోసం', 'ఓ గొల్లకథ', 'వాన రావాలె' లాంటి అనేక కథల్లో తాను పుట్టి పెరిగిన గొల్లల

జీవితాన్ని కాలువ మల్లయ్య సజీవంగా చిత్రించారు. 'ఎదురుచూపు', 'నిరీక్షణ' లాంటి కథల్లో పద్మశాలీల, చేనేత కార్మికుల దీనమైన జీవితం, వలసలు పోవాల్సిన అనివార్యత భీవండికిగాని, గల్ఫ్ దేశాలకు గాని పోయిన క్రమం, పడిన బాధలు, అనుభవించిన వేదన, భీవండిలో జరిగిన మత కలహాల్లో మృత్యువాత పడ్డ యువకులు మొదలైన అనేక చారిత్రక అంశాలు ఈ కథల్లో కనబడతాయి. 'ఊరుమ్మడి బతుకు' కథలో గౌడులు కల్లమ్ముకుంటూ బతికే జీవితంలోని విషాదం, దొరలు వాళ్ళపై చేస్తున్న దౌర్జన్యం, వాళ్ళు పడుతున్న అవమానాలు వృత్తిలోని సాధక బాధకాలు చిత్రించారు. కుమ్మరి కులవృత్తిలో ఎదుర్కొన్న సమస్యలు గురించి 'ఈ భూమినాది' కథలో కుమ్మరి బ్రతుకుల యదార్ధ జీవిత యదార్ధ గాథ చిత్రించారు. తన భూమిలో కుండలు చేసుకుంటానికి మట్టిని తవ్వుకోవడానికి కూడా హక్కు లేని దుర్మార్గపు పద్ధతి చిత్రించడం జరిగింది అలాగే పరాధీన కథలో చేనేత కులం నుంచి ఒక అమ్మాయి మూడు తరాల్లోని కూతురుగా, భార్యగా, తల్లిగా ఒక్క పట్టుచీరను కొనుక్కోలేని దుస్థితిని వర్ణించడం జరిగింది. అయితే చేపలమ్ముకోవడంలో వాళ్ళను హీనంగా చూడడం లాంటి అనేక విషయాలు ఇందులో కనబడతాయి. అడ్డాల నాడు కథలోను, 'గోరుకాలు' కథలో మంగళి వారి జీవితం చిత్రణ వుంది. కొడుకును చదివిస్తే పైకి వస్తానడనుకొని చదివించిన తర్వాత తనకు కాకుండా పోయిన దీన దృశ్యాలు ఈ కథల ద్వారా తెలుసుకోవచ్చు. మంగళి వృత్తిలోని విషాదాన్ని, వాళ్ళను హీనంగా చూడడాన్ని ఈ కథలో చూడవచ్చు.

కాలువ మల్లయ్య గతాన్ని ప్రేమిస్తారు. అంబేద్కర్‌ను అభిమానించినప్పటికీ ఆయనది మౌలికంగా గాంధీ మార్గం. గాంధీజీ వలె కాలువ మల్లయ్య పల్లెలను ప్రేమిస్తారు. కులవృత్తులను ప్రేమిస్తారు. పట్టణాల నుండి, నగరాల నుండి తిరిగి గ్రామాలకు వెళ్ళాలని తన కథల్లో పిలుపునిస్తారు. గ్రామం ప్రశాంతంగా వుంటుందని, పర్యావరణం, చక్కని ప్రకృతి, మానవీయ సంబంధాలు వుంటాయని తన దళిత బహుజన కథల్లో చిత్రించారు. ఆడెపు లక్ష్మీపతి 'త్రిభుజపు నాల్గోకోణం' కథలో పద్మశాలి జీవితాల్లో కులవృత్తులు కోల్పోయి అనేక ఇతర వృత్తులు, వ్యాపారాలు చేపట్టి, నష్టాలు సంభవించి జీవితాలు, కుటుంబాలు ఎలా శిథిలమవుతూ వస్తున్నాయో చిత్రించారు. బీసి కులాల నుండి మధ్య తరగతిగా ఎదుగుతున్న జీవితాలలోని సంఘర్షణను, సంక్లిష్టతను శిల్ప వైవిధ్యంతో చిత్రిస్తున్నారు. 'అసందిగ్ధ కర్తవ్యం'లో కుల మతాల కారణంగా ప్రయోషన్ ఇవ్వాల్సి ఉండగా ఇవ్వకుండా అడ్డుకుంటూ అగ్రకులాల వాళ్లు, అధికారులు ఎలా వక్రమార్గాలు పడతారో, తద్వారా బాధితుల మానసిక సంఘర్షణ ఎలా ఉంటుందో చిత్రించారు. 'విధ్వంస దృశ్యం' కథలో నూతన పారిశ్రామిక ఆర్థిక విధానాలు, గ్లోబలైజేషన్ పరిణామాల్లో విచ్ఛిన్నమవుతున్న కుటుంబ విలువలు చిత్రించారు.

సాహిత్యానికి సమాజానికి మధ్య ఎప్పుడూ విడదీయ రాని సంబంధమే వుంది. సమాజం లేకుండా సాహిత్యం లేదు. ఏ కాలంలోని సమాజం గూర్చి తెలుసుకోవాలన్నా ఆ కాలంలో వెలువడిన సాహిత్యమే ఎక్కువ ఉపయోగపడుతుందన్నది నిజం. అందుకే సమాజ దర్పణం సాహిత్యమన్నాడు మాక్సిమ్ గోర్కీ సాహిత్య గ్రంథాల ఆధారంగానే ఆంధ్రుల వేయేళ్ళ చరిత్రను 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర'గా రాశాడు సురవరం ప్రతాపరెడ్డి గారు. మంత్రాలకు చింతకాయలు రాలనట్టు కేవలం సాహిత్యం వల్లే సామాజిక మార్పు సాధ్యం కాకున్నా సామాజిక మార్పు కోసం అన్ని శక్తులూ కేంద్రీకరించుకోవడానికి నైతికంగా మరింత ఐక్యంగా నిలబడటానికి సాహిత్యం ఉపకరిస్తుంది.

వాళ్ళు కోరిన విశ్వమేదైనా, వాళ్ళు కాపాడదలచుకున్నదే వర్గ ప్రయోజనమైనా మన ప్రాచీనులు విశ్వశ్రేయస్సు కోసమే కావ్యమన్నారు ఏదోవిధంగా విశ్వశ్రేయస్సు నాశించిన కావ్యాలే కాలగర్భంలో కలిసిపోకుండా నిలిచాయి. మొదటితరంలో తెలంగాణ నుంచి తక్కువ కథలే వచ్చినా వచ్చిన కథలన్నీ సమాజ శ్రేయస్సును, మార్పునభిలషిస్తూ వచ్చినవే. సురవరం ప్రతాపరెడ్డి, దాశరథి రంగాచార్య, కాళోజీ, తిరునగరి, సురమౌళి,

యశోదారెడ్డి, సి.వి.కృష్ణారావు, పొట్టపల్లి రామారావు లాంటి వాళ్ళెంతో మంది తెలంగాణ కథను అభ్యుదయ పథంలో నడిపించారు.

తెలంగాణ ప్రత్యేక పరిస్థితులకు, సంఘర్షణలకు, పోరాటాలకు, గ్రామాల్లో వస్తున్న మార్పులకు ప్రతిస్పందన గానూ చక్కని కథలొస్తున్నాయి. తాడిగిరి పోతరాజు, బి.యస్. రాములు, అల్లం రాజయ్య, వుప్పల నరసింహం, దేవరాజ మహారాజు, కాలువ మల్లయ్య, భూపాల్ లాంటి ఎంతోమంది రచయితలీ పనిని సమర్ధవంతంగా నిర్వ హిస్తున్నారు. ఇలా తెలంగాణ కథ సామాజిక నిబద్ధతకే పెద్దపీట వేస్తూ అన్ని కోణాలనూ స్పృశిస్తున్నది. అన్ని రకాల ప్రజా జీవితాలకూ స్వంతం చేసుకుంటుంది. అన్ని వస్తువులనూ కథా సత్తువుగా స్వీకరించింది. గ్రామీణ జీవిత చిత్రణ, పల్లెసీమల సౌందర్యాలు, పల్లె ప్రజల ఆత్మీయానురాగాలు, పోరాటాలు, ఆరాటాలు, మారుతున్న విలువలు, జరుగుతున్న సంఘర్షణ అన్నీ తెలంగాణ కథల్లో చోటచేసుకున్నాయి. సామాజిక బాధ్యతను గుర్తెరిగి రాసే రచయిత తన కథలు ఏ ప్రజల దగ్గరికయితే పోవాలని కోరుతాడో ఆ ప్రజల యొక్క భాషను స్వీకరింపక తప్పదు. మాండలిక భాషా రచనలకు అత్యధిక ప్రాచుర్యం గత పది, పదిహేనేళ్ళ నుంచి వచ్చినా మాండలిక భాషలో రచనలు రావడం మనకెప్పుడో మొదలైంది. మాండలికం గురించి ఇప్పటికే చర్చలు జరుగుతుండటం చూస్తుంటాం. తెలంగాణ రైతాంగ పోరాట కథను సుసంపన్నం చేశారు.

తెలంగాణ రైతాంగ పోరాట స్ఫూర్తితో ఉద్యమ కథలను విరివిగా రాస్తున్నాడు అల్లం రాజయ్య. ఈతని కథలను ఉద్యమ కథలకు ప్రతినిధి కథలుగా చెప్పవచ్చు. తెలంగాణ పోరాట కథ ఒరవడిని ముందుకు తీసుకెళు తూ ఉద్యమ కథను సుసంపన్నం చేసిన వాళ్ళు బి.యస్.రాములు, రామ్మోహన్ రాజు, వుప్పల నరసింహం, సాహు, గోపి, రఘోత్తమరెడ్డి, కాలువ మల్లయ్య, యాదగిరి లాంటి వాళ్ళెంతోమందన్నారు. తెలుగు కథను ఉద్యమ కథగా మళ్ళించడమే భూషణం, అల్లం రాజయ్యలు సాధించిన కథా విప్లవం. ఇలా తెలంగాణ కథ సామాజిక నిబద్ధతకు ఎప్పుడూ దూరం కాలేదు. కథా రచయితలు సాహిత్య ప్రయోజనాన్నెప్పుడూ మరిచిపోలేదు.

కాలువ మల్లయ్య తరువాత ఉధృతంగా కథలు రాసిన వారిలో కె.వి. నరేందర్ ఒకరు యువ రచయితల్లో ఆయన రాసినంత వస్తు వైవిధ్యం, శిల్ప వైవిధ్యం మరొకరిలో కనపడదు. అమ్మ గురించి విభిన్న కోణాల్లో 14 కథల్లో 'అమ్మ' కథల పుస్తకం వెలువరించారు. సైనికుల జీవితాల గురించి 5 కథలతో యుద్ధం కథల సంపుటి వెలువరించారు. బాల కార్మికుల గురించి 5 కథలతో బురదలో జాబిల్లి కథల సంపుటి వెలువరించారు. 15 కథలతో పల్లెల్లో శిథిలమౌతున్న వృత్తుల గురించి వారి జీవితాల గురించి కాలుతున్న పూలతోట కథల సంపుటిలో గ్రామీణ సమాజంలో వస్తున్న పలు పరిణామాలను అద్భుతంగా చిత్రించారు.

సామాజిక దృక్పథంతో బహుముఖాలుగా విస్తరిస్తున్న కె.వి. నరేందర్ కథలు : ఒకే విషయంపై ఒకే వస్తువు గురించి వివిధ పార్శ్వాల గురించి నాన్న కథల సంపుటిలో మ్యాచ్ ఫిక్సింగ్, కొడుకు నేర్పిన పాదం, మట్టి మనసు, డియర్ పా, నాన్న డైరీ, డాడీ డాడీ, తెగిపోయిన పాట, నాన్నని పంచుకుందాం, నాన్నగది, నాన్న తప్పిపోయాడు మొదలైన కథలలో గత పదేళ్ళలో నాన్న కుటుంబంలో ఎదుర్కొంటున్న సమస్యలను నాన్నా స్థానాన్ని చిత్రించిన తీరు, సామాజిక పరిణామక్రమాన్ని చరిత్రను చిత్రించిన తీరు అపూర్వం. తెలుగు సాహిత్యంలో ఈ పని మరెవరూ చేయకపోవడం రచయిత దృక్పథాన్ని చెప్పకనే చెపుతుంది.

అయితే కొందరికి ఉద్యమ కథలు తప్ప మిగతావి కథలేకావు. మరికొందరి దృష్టిలో ఉద్యమ కథల్లాంటివి కథలే కాదు. ఈ రెండు ధోరణులూ తప్పే సామాజిక నిబద్ధతతో రాయబడిన ఏ కథయినా మంచి కథే అవుతుంది. సమాజాన్ని ప్రతిబింబించేది కథయినప్పుడు ఆయా ప్రాంతాల్లో వస్తున్న ఉద్యమాలు పట్టించుకోకుండా ఉండటం సామాజిక బాధ్యత గుర్తెరిగిన రచయితలకెలా కథావస్తువు కానక్కర్లేదు. ఒకప్పటికి ఇప్పటికి తెలంగాణ లాంటి ప్రాంతాల్లోనూ మధ్య తరగతి గణనీయంగా

పెరిగింది. వాళ్ళ సమస్యల స్వరూపమూ మారింది. గ్రామాల్లో రకరకాల సంఘర్షణుంది. వివిధ ఉద్యమాల ప్రభావమూ ఉంది. ఇవన్నిటినీ పట్టించుకొని కథలు రాయాల్సిన అవసరముంది. రాస్తున్నారు కూడా. సామాజిక మార్పును అభిలషిస్తూ ఈ విషయాలన్ని పై వచ్చే కథలూ మంచి కథలే అవుతాయి.

అలాగే స్త్రీ వాదం, దళితవాదం ప్రస్తుతం తెలుగు సాహిత్యంలో బలమైన పునాదులతో ముందుకొస్తున్నాయి. స్త్రీవాదమంటే పురుష ద్వేషమనో, దళిత సాహిత్యం దళితులే రాయాలతో కాకుండా వాటి ఉద్దేశాన్ని, అవసరాన్ని గుర్తిస్తే ఆయా వాదాలకు మద్దతుగా మరెన్నో గొప్ప కథలు వచ్చే అవకాశముంది. సామాజిక నిబద్ధత కలిగిన రచనలంటే రా.వి. శాస్త్రి గారు చెప్పినట్లు 'అయ్యో అయ్యో' కథలు మాత్రం కావు. వీలైతే పరిష్కారాన్ని చూపడం కూడా అవసరం. అట్లని వాస్తవ విరుద్ధమైన, ఆవేశపూరితమైన పరిష్కారాలను చూపడమూ సరియైంది కాదు. ఇప్పుడు తెలంగాణ కథ భాషాపరంగానూ, విషయ పరంగానూ నిబద్ధతతోనే వస్తుంది. ఏ భాషా సాహిత్యానికి తీసిపోని మంచి కథలెన్నో తెలుగులో వస్తున్నాయి. సామాజిక నిబద్ధత ధ్యేయంగా వచ్చిన తెలుగు కథా సాహిత్యాన్నంతా ఒక గుది గుచ్చినట్లు పేర్చుకుంటూ పోతే ఈ కథలతో తెలుగు ప్రజల సామాజిక చరిత్ర రాయొచ్చు ననేది అక్షరసత్యం. ఇప్పుడు వస్తున్న తెలుగు కథ మరింత వస్తు వైవిధ్యాన్ని సంతరించుకొని ఇదివకరెప్పుడూ స్పృశించని విషయాలను స్పృశిస్తూ వస్తున్నదన్నమాట నిజమే. ఈ దశాబ్దంలో ఉధృతంగా కథలు రాసిన వారిలో కాలువ మల్లయ్య ప్రథములు. ఇప్పటి వరకు 1000 పైగా కథలు రాశారు. ఇందులో ఆంధ్రప్రభ దినపత్రిలో వచ్చిన అవ్వతోడు గిది తెలంగాణా, ప్రజాతంత్ర వారపత్రికలో వస్తున్న తెలంగాణా మట్టి కథలు, ఇంకా తన కథల్లో విద్యార్థుల చదువుల సమస్యల గురించి, స్త్రీల సమస్యల గురించి సగటు మధ్య తరగతి మనిషి గురించి, కార్మికుల గురించి, వ్యవసాయదారుల గురించి, తెలంగాణా గురించి, మేధావుల గురించి, దళితుల గురించి, మానవ సంబంధాల గురించి, విప్లవవాదం గురించి కథలు రాశారు.

## వలస బతుకుల వ్యథలు :

డబ్బు సంపాదించుకొని వచ్చిన తర్వాత మస్కట్ మల్లయ్యను అందరు గౌరవిస్తూ తమను కూడా అరబ్బు దేశాలకు పంపుమని కోరుతుంటే మస్కట్ మల్లయ్య తాను కోల్పోయిన యవ్వనాన్ని పడ్డ కష్టాల్ని ఎవరూ గమనించక పోవటం గురించి ఆవేదనని చిత్రిస్తుంది. కర్రోడు కథలో నలుపు వల్ల సమస్యలు ఎదుర్కొంటూ ఎదిగిన తర్వాత తాను తమ హెరీదాతో, అహంతో ఇతరులను తిరిగి కష్టపెట్టే తీరును చిత్రించింది. నా తెలంగాణా కథలో చెప్పులు కుట్టే మాదిగలోని చైతన్యాన్ని హీన వ్యక్తిత్వంతో బతికే ఇంజనీర్ని తెలంగాణా ఉద్యమ పరిణామాలను చిత్రించారు. ఆస్థి ఉందని నమ్మిస్తేనే కొడుకులు, కోడళ్ళు, బిడ్డలు చివరిదాకా మంచిగా చూసుకుంటారని నమ్మిన వృద్ధురాలు గిల్టునగలను అసలు నగలుగా నమ్మకం కలిగించి సుఖంగా వెళ్లిపోయిన తీరును అమ్మమీది సొమ్ములు కథలో చిత్రించారు. భద్రత యుద్ధభూమి కథల్లో తెలంగాణా మధ్య తరగతి జీవితానికి భద్రత లేదని యుద్ధభూమిగా పరిణమిస్తున్నదని చిత్రించాయి.

గత దశాబ్దంలో 200లకు పైగా కథలు రాసిన కాలువ మల్లయ్య కథలకు ఒక జీవనది. ఆయన కథల గురించి ఒక ప్రత్యేక అధ్యయనం అవసరం. 1990 నుండి కాలువ మల్లయ్య కథలు వివిధ సంకలనాల్లో 25 దాకా చేరాయి. ఇన్ని సంకలనాల్లో ఇన్ని కథలు చేరిన రచయిత కాలువ మల్లయ్యగారొక్కరే. పైన పేర్కొన్న సమీక్షకులు కాలువ మల్లయ్య పదేళ్ళ కథల కృషిని వాటి వైవిధ్యాన్ని పట్టు కోలేకపోయారు. ఇది వారి కొంచెపు బుద్ధిని తెలుపుతుందే తప్ప జ్ఞానాన్ని కాదు. తెలంగాణ కథా సాహిత్యంలో కాలువ మల్లయ్య - కె.వి. నరేందర్ సామాజిక వైవిధ్యం : కాలువ మల్లయ్య స్త్రీల సమస్యల గురించి గలుమ, నిరీక్షణ, దగా దగా మొదలైన కథలను, సగటు మధ్యతరగతి గురించి జీవచ్ఛవం, అల్లమురబ్బా, చావు మొదలైన కథలను, కార్మికుల జీవితాల గురించి ప్రస్థానం, మళ్లీ తల్లిఒడిలోకి, అన్న కథలను, వ్యవసాయం చేసే రైతుల గురించి సృష్టికర్త అనేదాని నేలతల్లి సృష్టికర్తలు చిరునామా, టెలిఫోన్ పల్లె వలసల గురించి అడవిగాచిన మల్లయ్య,

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

బోధివృక్షం, మస్కట్ మల్లయ్య కథలను, మేధావుల తీరు తెన్నుల గురించి గుప్పెడు నా తెలంగాణ, ఎంగిలిచేలో, అగ్ని అంశం, మానవ సంబంధాలు, ఆర్థికాంశాల గురించి నిరుడు కురిసిన హిమ సమూహములు, రూపాయి రూపాయి, అమ్మ మీది సొమ్ములు, విప్లవం గురించి ఆంబోడు, భద్రత, యుద్ధభూమి మొదలైన కథలను రాశాడు. వస్తు విస్తృతిలో కాలువ మల్లయ్య తెలుగు సాహిత్యంలో అనేక కథలు రాశారు, రాస్తున్నారు.

**ఆధార గ్రంథాలు :**

1. కాలువ మల్లయ్య, ధిక్కారం, 1989, అభ్యుదయ పత్రిక, ఫిబ్రవరి.
2. కాలువ మల్లయ్య, దొరసాని చీర, 1991, ఘర్మజలానికి ఖరీదు కట్టే షరాబు? కథా సంపుటి.
3. కాలువ మల్లయ్య, అడవి కాచిన వెన్నెల, 1999, కాలువ మల్లయ్య కవితా సంపుటి.
4. కాలువ మల్లయ్య, మలేలయ మనసు, కొలిమి-లిఖిత సాహితీ బులెటిన్ - సంచిక.

★★★

# డా॥ తరపట్ల యజ్ఞం - సమకాలీన సమస్యల చిత్రణ

- అన్నపూర్ణ బత్తుల, పరిశోధక విద్యార్థిని, తెలుగుశాఖ, మద్రాసువిశ్వవిద్యాలయం, చెన్నై.

**ప్రవేశిక :**

మారుతున్న కాలంలో, మారుతున్న పరిశోధనా దృక్పథాలను అనుసరించి సాహిత్యంలో వివిధ జాతుల, సంస్కృతి, సంప్రదాయాలు ఏకమైయ్యాయి. వాటన్నింటిని విభిన్నకోణాలలో అధ్యయనం చేసి నేడు జరుగుతున్న అరాచకాలను నిర్భయంగా, ఘాటుగా ఉండే పదాలను ఉపయోగించి కవిత్వీకరించారు డా॥ తరపట్ల సత్య నారాయణ.

**ముఖ్య ఉద్దేశ్యం :**

సమకాలీన సమస్యల మీద సరికొత్త సందేశాన్ని సమాజానికి సరళమైన పదజాలంతో, పదునైన పదజాలం వ్యంగ్య ధోరణిలో, నిజాన్ని నిర్భయంగా నిలదీస్తూ, నేటి రాజకీయ నాయకులను, నయవంచకులను, వారు ప్రవర్తిస్తున్న నడవడికలను చక్కగా రాసారు. ప్రస్తుత సమాజానికి కావల్సింది అభ్యుదయభావాలతో కూడిన నవకవిత్వం, యువకవిత్వం. తరతరాలుగా కుల రక్కసి, మతఛాందస భావాలతో కూడుకున్న రక్త సిక్త ఛాయలను ముక్కలు ముక్కలుగా చేసి సమ సమాజంలో, నవ సమాజ సౌధం నిర్మించారు డా॥ తరపట్ల సత్యనారాయణ. నేటి యువతకు మార్గదర్శకుడిగా నిలిచారు.

## సమకాలీన సమస్యల సంక్షిప్త వివరణ :

డా॥ తరపట్ల సత్యనారాయణ సమకాలీన సమస్యల మీద ప్రజలు పడుతున్న అనేక వ్యధలను కళ్ళకు కట్టినట్లు చిత్రించారు. ముఖ్యంగా దళితులు, రాజకీయ నాయకులు, స్త్రీలు పడుతున్న బాధలు సమకాలీన సమస్యలతో సంక్షిప్తంగా వివరించారు. అందులో భాగంగా కొన్ని కవితలు నన్ను బాగా ప్రభావితం చేసాయి, అందులో ముఖ్యంగా !

ఇక్కడ...
ఎలక్షన్లకు ముదు
కుక్కలకు రెక్కలొస్తాయ్
అందుకే క్షణాల్లో
ప్రతి యింటిముందుకు వచ్చి వాలి
వాగ్ధానాల అరుపులు అరుస్తుంటాయ్
ఇక్కడ...
ఎలక్షన్ల తర్వాత
గాడిదలకు కొమ్ములొస్తాయ్
అందుకే ప్రజాస్వామ్యాన్ని పొడుస్తూ
లౌకికత్వ చివురులు తినేస్తుంటాయ్

అంటూ ప్రస్తుత రాజకీయ నేపథ్యాన్ని, జరుగుతున్న అరాచకాలను ఎన్నికల ముందు రాజకీయ నాయకుల తీరు, వారు నమ్మబలికిన వాగ్ధానాలు, అవకాశం కోసం రాజకీయ తత్వాన్ని, ఆశలు చూపించే మోసపూరిత వాగ్దానాల గురించి ఉన్నది ఉన్నట్లుగా మనముందుం చారు. ప్రస్తుత రాజకీయ నాయకులు ఎలక్షన్లకు ముందు వివిధ ప్రగల్భాలను చేసస్తూ యువతను వెనక్కు లాగుతున్నారు. ప్రతిసారి వారు నమ్మ పలికిన మోసపూరిత వాగ్ధానాలకు ప్రజలే మోసపోతున్నారు ! ఓడిపోతున్నారు. ఇకనైనా కళ్ళు తెరవండి మోసపూరిత వాగ్ధానాలకు, ప్రలోభాలకు లొంగిపోకుండా మంచి రాజకీయ నాయకు లని నిలబెడుదాం!.

ఇక్కడ ఎలక్షన్ల తర్వాత గాడిదలకు కొమ్ములొస్తాయి. ఎన్నికల తర్వాత వారి రాజకీయ పోకడలు వేరేలా ఉంటాయి. నెగ్గిన ప్రతి వెధవలకు కొమ్ములొస్తాయి. మళ్లీ ఆ నాయకులు 5 సంవత్సరాల తర్వాతనే వారికి మనం గుర్తుకొస్తాం. అప్పుడు మళ్లీ మనముందుకు వచ్చి వాలుతారు ఓటు కోసం. ప్రజలారా ఇకనైనా కళ్ళు తెరవండి మంచి నాయకుడిని ఎంచుకునే అస్త్రం మన చేతిలోనే ఉంది. అదే ఓటు హక్కు దానిని మంచిగా పరిపాలన చేసే మంచి నాయకుల కోసం వాడదాం.

ఇక్కడ ఎన్నికలకు ముందు కుక్కలకు రెక్కలు!
అనంతరం గాడిదలకు కొమ్ములొచ్చినట్లు

చీమల సంపదను సింహాలు తినేస్తున్నాయి. ఆ హింస పడలేక చీమలు పారిపోతున్నాయి. ఇక్కడ మధ్యతరగతి ప్రజలు, రాజకీయ నాయకుల హింసలకు బలవుతూనే ఉన్నారు.యింకాఎన్నాళ్ళు యీ అరాచకాలు ప్రజలారా కళ్ళుతెరవండి. పిడికిలి బిగించండి. బడా బాబుల దౌర్జన్యాలను నిలబడి నిక్కచ్చిగా అడగండి. నోటుకోసం ఓటువేసే ప్రయత్నాలు మానుకోండి అసలైన నిజాయితీ పరుడైన నాయకున్ని ఎన్నుకునే అస్త్రం మన చేతుల్లోనే ఉందని రాజకీయ నాయకుల వాస్తవాలను మనకు కళ్ళకుకట్టినట్లు మనముందుంచారు.

అణచివేత సమ్మెటకు
అన్యాయపు చట్టాలకు
శాసనాల చుట్టాలకు
దురహంకార బాకులకు
మానాలు తెగి
ప్రాణాలు పోయిన
అల్పజీవులకు
అవిటి బ్రతుకులకు
కొండంత అండగా
హృదయాన్ని బండచేసి
వేస్తున్నా దండోరా

అంటూ దళితుల గురించి రాసిన ఈ కవిత హృదయాన్ని హత్తుకుంటుంది. దళిత అనే పదం మొదటగా డా॥ బి.ఆర్.అంబేద్కర్ బహిష్కృత భారత్ అనే పత్రికలో అణచివేయబడిన, వెలివేసిన అనాగరిక బలహీన వర్గాలను ప్రజలను ఉద్దేశించి వాడటం జరిగింది. ఈ దళిత అనే పదం అంటరాని జీవితాల యొక్క విరిగిన, హింసించబడిన, అసంపూర్ణ ప్రజల జీవన విధానాన్ని మనకు సూచిస్తుంది. ఇప్పటికే దురహంకార మృగాళ్ళు దళిత మహిళలపై చేసే అకృత్యాలు యింకా జరుగుతూనే ఉన్నాయి. అణచివేత సమ్మెటతో కూలిన తమ్ముళ్ళు, మృగవాంఛకు మానాలు తెగి ప్రాణాలు కోల్పోయిన చెల్లెళ్ళు, గత చరిత్ర మిగిల్చిన అసమానతల ఆనవాళ్ళు ఇకపై సాగనీయమని ప్రతిఘటన చిగురించే వరకు, మా హక్కులు సాధించే వరకు శ్లాఘిస్తూ దండోరాతో హెచ్చరిస్తున్నాను అని దళితుల మానాలప్రాణాలు గురించి వారికి జరిగిన అన్యాయాన్ని పూర్తిగా విశ్లేషిస్తూ వేసారు దండోరా!

మాకు ఓపిక ఉన్నంతవరకు, మా హక్కులు మాకు వచ్చే వరకూ ఈ పోరాటాలు ఆగవు మేము ప్రతిఘటిస్తూనే ఉంటాం అణిచివేతతో కృంగి, కృషిస్తున్న మా అన్న దమ్ముళ్లు, అక్కచెల్లెళ్ళ ఆక్రందనలు మీకు కనిపించడం లేదా అని ప్రభుత్వాన్ని నిలదీసి అడిగారు. పై కవితలో డా॥తరవట్ల సత్యనారాయణ అణచివేతకు అన్యాయముగా బలవుతున్న దళిత మహిళలకు న్యాయం జరిగేలా పోరాటాలు చేస్తూ వేస్తానీ దండోరా అని దురహంకార, రాజకీయ నాయకులను సూటిగా అడిగారు సత్యనారాయణ. ఇంకా ఎన్నాళ్ళు ఆడవారి మీద అకృత్యాలు, ఇకనైనా అపండి అంటూ తన ఆవేదనను దండోరా రూపంలో వ్యక్తపరిచారు.

ఓటరు దేవుళ్ళని
వొంగి వొంగి దణ్ణాలు పెట్టి
వాగ్ధానాల వర్షం కురిపించి
ఓట్లు దండుకునే
స్వార్థగార్ధాభ ముసుగు నేతల్లారా!
నిజంగా మీకు బ్రతికుండగానే
నాలుగు రోడ్ల కూడలిలో
విగ్రహాలు పెట్టాల్సిందే
సంబరాలు చేయాల్సిందే!

ప్రస్తుత రాజకీయ పరిస్థితి మీద సత్యనారాయణ నిర్భయంగా వెలిబుచ్చారు. అడుగడుగునా దొంగ వాగ్ధానాలు, మోసపూరితమైన మాటలు ఓటర్లను ఆకట్టు కుంటున్నాయి. ఎన్నికల ముందే ఓటరు దేవుళ్ళు కావాలి రాజకీయ నాయకులకు, ఎప్పుడు అటువైపు వెళ్ళనివారు ఎన్నికల ముందు మాత్రం ఇంటింటికి, గడపగడపకు తిరుగుతూ వారికి దొంగ నమస్కారాలు చేస్తూ ఓటుని అడుక్కుంటారు. ఇలాంటి కుళ్ళు, కుతంత్రపు నాయకుల్ని బహిరంగంగా నాలుగురోడ్ల కూడలిలో వారి కోసం

రాజకీయ నాయకులు బ్రతికుండగానే విగ్రహాలు పెట్టాల్సిందే. మీకోసం మేము అంటూ మీ వెంటనే మేము

ఉన్నామంటూ సెంటిమెంట్ అనే ఆయుధం పట్టుకుని, మద్యం, మత్తుపానీయాలు అనే ఆశలు చూపి, ఓటుకు నోటు అన్న స్వార్థపు రాజకీయ నాయకులకు ప్రతిచోటా ప్రజాబోన్లు తెరచి ఉంచాల్సిందే! అగ్రహ జ్వాలల్తో తీర్పు రావాల్సిందే ఇలా ఓటర్లు వారు మోసపోయే తీరుతెన్నులును గురించి సవివరంగా పొందు పరిచారు.

గాడిదలకు కొమ్ములొస్తే అందం
వెధవలకు పదవులొస్తే దుర్గంధం

ప్రస్తుత రాజకీయ పరిస్థితులను ఉన్నది ఉన్నట్లుగా ఎవరికి భయపడకుండా తను అనుకున్నది తాను ముక్కు సూటిగా ప్రశ్నించారు సత్యనారాయణ. గాడిదలకు కొమ్ము లొస్తేనే అందం. వెధవలకు పదవులిస్తే దుర్గంధం. అవినీతి పరుడైన వాడికి పట్టంగడితే ఇంకేముంది అంతా నాశనం. అలా కాకుండా నిజాయితీ పరుడైన వాడికి పదవులిస్తే రాజకీయ స్వలాభం జరుగుతుంది. దొంగనాయకులకు పదవులిస్తే అది ఎంత మాత్రం కరుక్టుకాదు అని ఓటర్లను వేడుకుని అవినీతిపరులైన వారిని గద్దెదించమని యువతను ముందుకు నడిపించడానికి ఈ విధంగా కలంతో ఎలుగెత్తి చెప్పారు.

ప్రస్తుత నేటి సమాజంలో ఓటర్లు కూడా తెలివిగా అమ్మచెప్పినా, నాన్న చెప్పినా, బాబు చెప్పినా వారి ముందు గాడిదలాగా తల ఊపుతూ చివరకు వారు చేసేదే చేస్తున్నారు. వారి చూట్టూ భజన చేస్తూ మాంత్రికుల్లాగా ఉంటున్నవారినే నమ్మి మోసపోతున్నారు ఓటర్లు.

ప్రజలు హక్కులు కాపాడుతారని
పార్లమెంట్‌కు పంపిస్తే
వాక్కు వినిపిస్తారని
అసెంబ్లీకి పంపిస్తే
మానోరే నొక్కేసి
పేకేజీలు బొక్కేసిన
రెండు కళ్ల సిద్ధాంత శిఖండుల్లారా!
ఓ పసుపు వన్నె కసాయి నీరుల్లారా!
నిజంగా మీకు
భాగ్యనగరంలో ఘోరీలు కట్టాల్సిందే
హైటెక్ సిటీమందు తలక్రిందులుగా శిలువవేసి
కొత్త చరిత రాయాల్సిందే

ఓటు వేసి గెలిపించిన ప్రజల హక్కులు కాపాడతారని మిమ్మల్ని పార్లమెంటుకు పంపిస్తే అక్కడ ఏమ్ చేస్తున్నారు. ఎలా దోచుకుందామా ఈ మరో 5 సంవత్స రాలు అని లెక్కలు వేసుకుంటున్నారు మీరు. మా గళం వినిపిస్తారనుకుని మిమ్మల్ని అసెంబ్లీకి పంపిస్తే ఎవరెవరికి ఎన్ని పాకేజీలు అంటూ లెక్కలేసుకుని రెండుకళ్ల సిద్ధాంతాన్ని రుద్దుతున్నారు. అందుకే ఓ బడాబాబుల్లారా మీకు భాగ్యనగరంలో సమాధులు కట్టాల్సిందే హైటెక్ సిటీముందు తలక్రిందులుగా వేలాడదీయాల్సిందే మా రక్తం తాగుతున్న మీకు కొత్తచరిత్ర రాయాల్సిందే అంటూ బడా రాజకీయ నేతల కుళ్ళు కుతంత్రపు వాగ్దానాల మీద విరుచుకుపడ్డారు సత్యనారాయణ అందుకే ఓ యువత ఇకనైనా సరియైన నాయకుడిని ఎన్నుకునే ఆయుధం మీ చేతిలోనే ఉంది అదే నీవు వేసే ఓటు దానిని మంచిని నిలబెట్టే రాజకీయ నాయకులకు మాత్రమే పదవులివ్వండి మోసపూరితమైన వాగ్దానాలు చేసిన వారికి కట్టపెట్టకండి. ఓ యువత ఇదే నా సందేశం అంటూ యువతను మేల్కొల్పారు.

**ముగింపు :**

సమకాలీన సమస్యల చిత్రణ మీద సత్యనారాయణ నేటి సమాజంలో ప్రతిఒక్కరు ఎదిరిస్తున్న సమస్యలను చక్కగా చిత్రించారు. దళితుల సమస్యలు, స్త్రీలు పడుతున్న వ్యధలు, రాజకీయ నాయకుల కుతంత్రాలు మొదలగు వాటిని చక్కగా వివరించారు. ఈ అరాచకాలు యింకా ఎన్నాళ్ళు ఇకనైనా మారండి అని యువతను మేల్కొలిపారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకోసం నాయకులు ఇకనైనా ప్రజల కోసం కొంతలో కొంతైనా యువతకు చేయూత నివ్వాలని, దళితులకు జరిగే అన్యాయాలను అరికట్టాలని వేడుకున్నారు.

**ఆధార గ్రంథాలు :**

1. డా॥ తరపట్ల సత్యనారాయణ - సాహితీ వ్యాసాలు
2. డా॥ తరపట్ల సత్యనారాయణ - ఉభయగోదావరి జిల్లాల్లో జానపద ప్రదర్శన కళారూపాలు
3. డా॥ తరపట్ల సత్యనారాయణ - యజ్ఞం వచనకవిత్వం
4. డా॥ తరపట్ల సత్యనారాయణ - వ్యాస పరిమళం
5. డా॥ తరపట్ల సత్యనారాయణ - సమైక్యభారతి
6. మహాకవి శ్రీశ్రీ - ఖడ్గసృష్టి
7. డా॥ సి.నారాయణరెడ్డి - విశ్వంభర వచనకావ్యం.

★★★

# మొల్ల రామాయణంలో విశిష్ట పాత్రలు – సామాజిక అంశాలు

– **మరపట్ల రాజు,** పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, మద్రాసు క్రైస్తవ కళాశాల, తాంబరం, చెన్నై.

మన భారతదేశం వేదాలకు, సంస్కృతులకు పుట్టినిల్లు. ఈ భూమిలో ఎన్నో పవిత్ర గ్రంథాలు వెలిశాయి. భారతం, భాగవతం, రామాయణం వంటి విశిష్టమైన పవిత్ర గ్రంథాలెన్నో మన భరతభూమి నుండే పుట్టాయని చెప్పవచ్చు. పైన తెల్పిన గ్రంథాలకు, మన దేశ సంస్కృతికి ఇతర దేశాల్లో ఒక ప్రత్యేక స్థానం ఉంది. భారత, రామాయణాలను ఎక్కువగా ప్రజలు అభిమానిస్తారు అందుకనే మన గ్రామాల్లో ఖచ్చితంగా రామాలయాలు చూస్తేనే ఉంటాం. తెలుగు ప్రజానికానికి రాముడంటే విపరీతమైన భక్తి కలదు. అనడానికి ఇదే ఉదాహరణ. దేవనాగరిక భాషగా చెప్పబడుతున్న సంస్కృతం నుండి అనేక భాషల్లోకి అనేక గ్రంథాలను అనువాదం చేయడం జరుగుతుంది. ఈ గ్రంథాలను చదవటం వల్ల మనిషి మనస్సులో మెదిలే పదం సత్ప్రవర్తన. వీటిలో ఉన్న మంచి, చెడులను తెలుసుకొని సమాజానికి తగినట్లుగా జీవించాలనేదే ఈ గ్రంథాలలోని సారాంశం అంతేకాదు నాటి సామాజిక స్థితిగతులను, సంస్కృతిని తెలియజేస్తాయి కూడా. ఏది ఏమైనప్పటికీ మన ఆచార వ్యవహారాల్లో మన సంస్కృతి నేటికి పటిష్టంగానే ఉందని చెప్పవచ్చు.

ప్రతి మనిషి యొక్క మనస్సులో భక్తిని నింపడానికి ఈ మత గ్రంథాలు బాగా ఉపయోగపడతాయి. అందరూ దేవుడు చేసిన మనుషులే. కానీ మతం, కులం పేరులతో తమ విశ్వాసాలను వదిలిపెట్టరు. ప్రపంచం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తుంటే, భక్తి అంతకంతకూ పెరగటం గొప్ప విశేషంగా చెప్పవచ్చు. తరతరాలుగా సంపదగా వస్తున్న అనేక గ్రంథాలు కాలగర్భంలో కలిసిపోతూనే ఉన్నాయి. వాటిని రక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. కాలానికి గతినట్లుగా సంస్కరణలు వస్తూనే ఉన్నాయి. ఈ సందర్భంలో ఆధునిక కోణంలో మొల్ల రామాయణంలో - విశిష్ట పాత్రలు సామాజిక అంశాలను నూతన కోణంలో ఆవిష్కరించడమే ఈ పరిశోధ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. తెలుగు వారి హృదయాలలో ఏకపత్రివ్రతుడిగా నిలిచిన వైనం శ్రీరాముడు నీతి ధర్మాలు, కరుణకు గుడికట్టిన సీతమ్మ శోకం కూడా ఎప్పుడు మన హృదయాల్లో మెదులుతూనే ఉంటుంది. తెలుగు సాహిత్యంలో రామాయణ కావ్య రచనలు ఎక్కువగా కనిపిస్తూనే ఉన్నాయి. సంస్కృత సాహిత్యంలో వాల్మీకి తనదైన స్థానాన్ని సంపాదించు కున్నాడు. నిజానికి వాల్మీకి పండితుడు కాదు. అలా అని గురువుల వద్ద విద్యనభ్యసించినవాడు కాదు. కౄరుడిగా, బందిపోటు దొంగగా, దయాదాక్షిణ్యాలు లేనివాడు. అటువంటి వ్యక్తి రామయణమే తన ఊపిరిగా తలిచి వాల్మీకి అయ్యాడు. బోయవాని బాణానికి బలియైన పక్షిని చూసి మరోపక్షి విలవిలాడిన ఆ కంటి శోకమే శోక్లంగా మారింది. అదే వాల్మీకినీ కవిగా మార్చింది. రామయణ రచనకు పూలబాట వేసింది. ఈ వాల్మీకి రామాయణాన్ని ఆధారంగా చేసుకొని తెలుగు సాహిత్యంలో కవులెందరో తమ భావాలను వ్యక్తపరిచే విధంగా ఎన్నో రామాయణ కావ్యాలను రచించారు. నాటికి నేటికి ఈ విధంగా వచ్చిన రామాయణ కావ్యాలలో మొల్ల రామాయణమే తనదైన స్థానాన్ని సంపాదించుకుంది.

మొల్ల తన కాలాన్ని ఎక్కడా తెలిపలేదు. "సురసన్నుత జ్ఞాను, సువివేకి వాల్మీకి" అనే పద్యంలో రసికులైనట్టి శ్రీనాధు, రంగనాధుఁ దిక్క కవిరాజును సుతించి అని ఉంది. దీనిని బట్టి ఈమె శ్రీనాధుని తరువాత కాలానికి చెందినదిగా చరిత్రకారుల అభిప్రాయం. దీనిని వీరేశ లింగం పంతులుగారి రచనలో కూడా చూడవచ్చు. సిద్దేశ్వర చరిత్ర కర్త అయిన ఏకామ్రనాధుడు మొల్ల వ్రాస్తూ "తిక్కన సోమయాజి వరప్రసాదమ్ముచేత కుమ్మరి మొల్ల రామాయణం బసు వచన కావ్యంబు రచియించి" అని రాశారు. మొల్ల తండ్రి కేసనశెట్టి, గొప్ప శివభక్తుడు. ఈయన తన కుమార్తె అయిన మొల్లను చిన్న వయస్సు

లోనే శివుని పాదసేవకై అర్పించడం జరిగింది. బహ్యాచారిగా, శివుని భక్తురాలిగా మొల్ల జీవించినట్లు భావించవచ్చు. శివభక్తి పరురాలైనా వైష్ణవ మత ప్రభావంతో శివకేశ భావం ఉండటం వల్ల రామాయణ కావ్య రచన చేసి ఉండవచ్చు. ముందుమాటగా తాను వ్రాసుకున్న అవతారికలో కొన్ని పద్యాల ద్వారా ఆమె వివరాలు కొన్ని తెలుస్తున్నాయి. మొల్లం నివాసం నెల్లూరు జిల్లాలోని గోపవరమని కొందరు, అదే జిల్లాలోని ఆత్మకూరు అని మరికొందరి వాదన వుంది. మరికొందరు బద్వేల్ సమీపాన ఉన్న ఆత్మకూరు అని వాదన వుంది. వీరి ఇంటి పేరు ఆతుకూరు.

రామునిపై విపరీతమైన భక్తిని పెంచుకొని మొల్ల రామయణ కావ్యాన్ని రచించారు. అంతేకాదు తనకంటే పూర్వీకుడు, ముందువాడు, నరాంకితానికి ఇష్టపడని వాడాయిన పోతన మహాకవిని ఆదర్శంగా తీసుకొన్నట్లున్నది. ఈమె కూడా పోతన మాదిరిగా నరాంకితము చేయక రామునికే అంకితం చేసిన సహాసికురాలు.

"బాలరసాల సాల నవపల్లవ కోయలకావ్య కన్యకను
అయోగ్యులకు అంకితమచ్చే కంటె సత్కవులు హితికు
లైననేమి? అని పోతన గారు చెప్పినట్లుగానే
పల్లవితప్రతాప గుణ సాగరుడై వెలసిల్లి, ధాత్రిపై
బల్లిదుడైన రామనరపాలకునిన్ స్తుతిఁజేయు
జిహ్వకున్
జిల్లర రాజలోకమును జేకొనిమెచ్చగా నిచ్చపుట్టునే
అల్లము బెల్లముందినుచు నవ్పటి కవ్పటి
కానసేయునే?
అని తన రచనా విధానాన్ని తెల్పింది.

"పలికెడిది భాగవతమట
పలికించెడు వాడు రామభద్రుండటనే" అనే పోతన
గారు చెప్పినట్లుగానే

"చెప్పుమనె రామచంద్రుడు
చెప్పించిన పులుకుమీదఁజెప్పదనే, నె
ల్లప్పుడు నిహపరసాధన
మిప్పుణ్య చరిత్ర; తప్పులెంచకుడు కవుల్"

అంటూ రామచంద్రుడే ఈ రామాయణం వ్రాయమన్నట్లుగా చెప్పుకుంది. అంతేకాదు తన కవిత్వంలోని తప్పులెంచవద్దని కవులను సవినయంగా కోరింది. మొల్ల తన రామాయణంలోని శ్రవణకుమార చరిత్ర, మంథరా వృంత్తాతము, అహల్యశాప వృత్తాంతము, కబంధ వధ, సుగ్రీవ రావణ ద్వంద్వ యుద్ధం, ఆదిత్య హృదయం, త్రిజటా వృత్తాంతాలను వదిలి, మూలంలో లేనివాటిని, యితర రామాయణాలలో ఉన్న కొన్ని ఘట్టాలను తన రామాయణంలో చేర్చి, రమణీయమైన కావ్యాన్ని రచించింది. మొల్ల 871 పద్య, గద్యాలతో రామయణాన్ని పూర్తి చేసింది.

## మొల్ల రామాయణంలో పాత్రల చిత్రణ :

### కైక పాత్ర :

స్త్రీ యొక్క పాత్రను అబలలుగా చిత్రించడం ఈమెకి నచ్చని విషయం కాబోలు. తన రచనలో కైక పాత్రలో మంథర ప్రేరణ, కోపంగా గృహప్రవేశం చెయ్యడం వంటి వాటిని వదిలివేసింది. పైగా మొల్ల తన గ్రంథంలో కార్య భారమంతా కైకపైనే పెట్టింది. "ఆ రాత్రి రాజశేఖరుని చిత్తంబు వచ్చునట్లుగా మెలగి, యాతడు తన్ను మెచ్చు టైరంగికైక యిట్లనియో అన్న వచనంలో కైక తన అందచందాలతో దశరధుని తృప్తిపరిచింది. తన కోరికను తెల్లవారగానే బయటపెట్టింది.

"వసుమతీశః నాకు వరమిచ్చి తప్పుట
గతవు గాదు "మీకుఁ" దలఁపులోన
మరించినా రదేయొ మన్నించి తొల్లింటి
యీవు లీయవలయు వీక్షణంబు"

ఇలా వరాలు ఆ క్షణమే ఇవ్వాలని పట్టుపట్టింది. పైన తెల్పిన పద్యంలలోని రెండవ పాదంలో "మీకు" అన్న పదం దశరధునికి ఒక్కడికే కాదు మొత్తం రఘు వంశానికి సంబంధించినదిగా తెల్పింది. ఆ చిన్న పదంలో పెద్ద భావాన్ని ధ్వనింపజేసే ప్రయత్నం చేసింది. దీనికి దశరధుడు కూడా సమాధానం చెప్పలేకపోయాడు. "స్వామి! రామచంద్రుని పట్టంబు గట్ట సుముహూర్తం బానన్న - మయ్యె'' అని చెవ్పటానికి వచ్చిన సుమంత్రునితో మొల్లం ఇట్లు పలికించింది.

''అనిలోమున్న నృపాటు చిత్తమున కే నాహ్లాదముంగూర్చి నా
తనయుం బట్టముగట్టి రాఘవుని బద్నాల్గేండ్లు కాంతారమం
దనువర్తిల్లఁగఁబంపగొన్న వరముల్ ద్రోయంగ రాదెంతయు
న్వనసేమన్ ముదివృత్తి నుండమనుఁడీ వైళంబ యారామునెన్''

పైన తెల్పిన పద్యంలో కైకనే రాణిగా తన అధికారం చెలాయించింది. కైక రణరంగంలో దశరధునికి సహాయం చేసింది. కైక కోరిన వరాలివ్వటం దశరధుని ధర్మం. రాజు గారి ఆజ్ఞను నేర వేదాల్సిన బాధ్యత మంత్రి సుమంత్రునిపై ఉంది. పైగా రఘు వంశీయులు సత్యవాక్యపాలకులు. మాటతప్పని వారు పైగా రాముడు తన తండ్రి యొక్క ఆజ్ఞనేరవేర్చే బాధ్యత ఎంతైనా ఉంది. ఇక్కడ రాఘవున్ని ప్రధానంగా చేసింది. భరతుని పట్టాభిషిక్తుని చేయటానికి, రామున్ని వనవాసానికి పంపటానికి ఇక్ష్వాకు వంశాయుల బాధ్యతను ఏకంచేసి రఘువంశీయులను నివ్వెరపడేటట్లు చేసింది. రామాయణంలోని ప్రముఖమైన ఘట్టంగా కైకశీలాన్ని ఎంతో మెలకువతో ప్రభావవంతంగా చిత్రించింది.

**సీత పాత్ర :**

స్త్రీ హృదయాలలో రూపుదిద్దుకున్న పాత్ర సీత. ఈ పాత్రను మొల్ల సీత సౌందర్యాన్ని, సతీత్వాన్ని, ధీరత్వాన్ని ప్రతిభావంతంగా పాఠకుల ముందు తెచ్చింది. స్వయం వరాన ముగ్ధ సుందరిగా, అరణ్యవాసాన కష్టాలు అనుభవించిన పవిత్రతగా అశోకవనంలో రాక్షస స్త్రీల మధ్య ఒంటరితనాన్ని అనుభవించిన దైన్యమూర్తిగా సీత పాత్రను చూపించింది. రాముడు యుద్ధంలో రావణుణ్ణి వధిస్తాడు. సీత సంతోషంతో భర్తయయిన రాముడు దగ్గరికి వెళుతుంది. కానీ రాముడు సీతను నిందిస్తాడు. పైగా నీయిచ్చ జనుమునేనొల్లన్ అని అంటాడు. ఆ మాటలు సీత గుండెల్లో సూదుల్లా గుచ్చుకొని ఎంత బాధించాయో వర్ణించలేము. ఇంతకుముందు ఆంజనేయుడు వచ్చి రామముద్రికను చూసినప్పుడు నమ్మలేదు. రాముని గూర్చి అడిగి యోగక్షేమాలు తెలుసుకుంది. మనో నిగ్రహంగా సీత ఉండడాన్ని ఈ ఘట్టంలో చూపించింది. సీను రాముని వద్దకు చేర్చటానికి హనుమంతుడు కోరితే దానికి సీత ఒప్పుకోలేదు. దీనికి కారణం తన భర్తే తనని అపహరించిన రావణుణ్ణి చంపి తీసుకువెళ్ళాలని ఆ రాక్షస స్త్రీ మధ్యే గుండె నిబ్బరం చేసుకొని సమయం కోసం వేచి వుంది. ఈ విధంగా మొల్లం సీత పాత్రను తెలుగు ప్రజల గుండెల్లో ముద్రించింది.

**లక్ష్మణుని కోపం :**

వాల్మీకి రామాయణంలో శ్రీరాముడు బంగారు లేడిని వేటాడి పర్ణశాలకు ఆనందంగా వస్తాడు. ఎక్కడ చూసినా సీత కనిపించదు చెట్లు, పుట్టలు మొత్తం వెతికినా కనబడకపోవడంతో రామునికి దుఃఖం వచ్చింది. మరోవైపు కోపం హద్దులు దాటి లోకాలను నాశనం చేయదలచి నపుడు లక్ష్మణుడు అన్నని శాంతింపచేసినట్లు ఉంది. తెలుగు సాహిత్యంలో ఏ రామాయణాన్ని వెతికినా అలానే ఉంటుంది. మొల్ల తన రామాయణంలో ఈ ఘట్టాన్ని ఇలా చూపింది.

''వ్రచ్చెద నాకలోకమున వారల గుండెలు నాగ లోకముల్
గ్రచ్చి యహీంద్రవర్గమును గూల్చెదఁ గవకవసే గొండ కైవడిన్
ద్రెచ్చద మర్త్యలోకము నుదారత నేగతి నైనఁగ్రమ్మఱిం
దచ్చెద సీత నీక్షణమ దేవరచిత్తము మెచ్చునట్లుగన్''

లక్ష్మణుడు తన కోపాన్ని ఆపుకోలేక తన ధైర్యాన్ని ప్రదర్శించి సీతమ్మను తీసుకొస్తానని ప్రతిజ్ఞ చేసినట్లు, లక్ష్మణుడు కోపాన్ని శ్రీరాముడు శాంతింపజేసినట్లు మార్చింది. శాంతిమూర్తి అయిన శ్రీరాముని ముక్కోపిగా చూపించడం కంటే లక్ష్మణుడు కోపగించడమే సరైనదని మొల్ల అభిప్రాయం.

**గుహుని పాత్ర :**

మొల్ల గృహుని పాత్రకు వచ్చేతెచ్చి విశిష్ఠమైన పాత్రగా మలిచింది. శ్రీరాముడు మిథిలానగరమునకు వెళ్ళే దారిలో గంగానది దాటవలసి వచ్చింది. ఆ సమయంలో

గుహుడు శ్రీరాముని పాదాలు కడిగినట్లు తన రామాయణంలో చూపించింది. వాల్మీకి రామాయణంలో ఈ సన్నివేశం కనిపించదు. మొల్ల తన రచనలో చమత్కారంగా గుహునికి అన్వయించింది.

"సుడిగొని రామపాదములు సోకిన ధూళివహించి రాయియే
ర్పడ నొక కాంతమయ్యెనట; పన్నుగనితని పాదరేణు వి
య్యెడ వడి నోడ సోక నిదియేమగునోయని సంశయాత్ముడై
కడిగెగుహుండు రామపదకంజ యుగంబు భయమ్ము పెంపునన్"

అమాయకుడైన గుహుని చక్కగా తన కావ్యంలో చూపించింది. గుహుడు రామభక్తుడు. శ్రీరాముని దర్శించాలని ఆశ కల్గినవాడు. సమయం రానే వచ్చింది గుహుని పడవలో విశ్వామిత్రుడిని, శ్రీరాముని పడవ దాటించాలి. అంతలో గుహునికి అహల్య విమోచనం అనే అద్భుత కథను విన్నాడు. గుహునికి జీవనాధారం పడవ నడపటం. శ్రీరాముడు తన పడవలో కాలు పెడితే పడవ కూడా స్త్రీగా మారుతుందేమో అని భయపడ్డాడు. కారణం లేకుండా కాళ్ళు కడుగుతానంటే బాగుండదని తలంచాడు. పైగా ఒకవైపు భక్తి, మరోవైపు భయం, సందేహం కూడా. ఇలా మొల్ల తన రచనలో గుహుని మానసిక స్థితి కూడా పాఠకుల ముందకు అద్భుతంగా ప్రదర్శించింది.

## మొల్ల కవిత్వంలో సామాజిక అంశాలు :

తెలుగుతనం ఉట్టిపడేలా కవిత్వం రాసిన రచయిత్రి మొల్ల. తెలుగు నుడికారాలతో తన కవిత్వం వుండేలా ఆమె రచన చేసింది. మృదువైన భాష, చక్కని పదాల ప్రయోగం మొల్ల తన రచనల్లో కనిపిస్తుంది. కైక పాత్ర ద్వారా దశరథుడు ఇచ్చిన వరాలు వెంటనే అమలు చెయ్యాలని పట్టుబట్టింది. రఘువంశంలోని రాజులను ప్రశ్నింపజేసింది. స్త్రీలు కూడా సాధికారిత కావలసి వుందని మొల్ల తన రామాయణంలో తెలియజేసింది. తర్వాత సీత పాత్ర ఆమె సౌందర్యవతిగా, ధీరవనితగా, పతివ్రతా మూర్తిగా చిత్రించి ప్రజల హృదయాల్లో చెరగని ముద్రను వేసింది. శ్రీరాముణ్ణి ముక్కోపిగా చూపించడం ఇష్టంలేక లక్ష్మణుడు కోపగించినట్లు చిత్రించింది. మొల్ల రామాయణాన్ని బట్టి ఆమె వ్యక్తిత్వాన్ని తెలుసుకోవచ్చు. ఆ రోజుల్లో అగ్రవర్ణాలకు చెందిన పండితులే ఎక్కువగా ఉండేవారు. వీరు స్త్రీలకు స్వేచ్ఛనిచ్చేవారు కాదు. స్త్రీలకు విద్య అందుబాటులో లేని రోజుల్లో మొల్ల పాండిత్యాన్ని చక్కగా సంపాదించింది కాని! ఈమె కవిత్వాన్ని గౌరవించక హేళన చేసిన సన్నివేశాలు ఎన్నో వున్నాయని చెప్పవచ్చు. తెలుగు సాహిత్యంలో తనదైన స్థానాన్ని సంపాదించుకొని పాఠకులను ఆకట్టుకొన్ని రచయిత్రి మొల్ల. తెలుగు సాహిత్యం ఉన్నంత కాలం మొల్ల రామాయణం సజీవంగానే నిలిచి ఉంటుందని చెప్పవచ్చు.

## ఆధార గ్రంథాలు :

1. మొల్ల రామాయణం - మొల్ల.
2. డా॥. జి. నాగయ్య - తెలుగు సాహిత్య సమీక్ష, రెండవ సంపుటి.
3. డా॥. తరపట్ల సత్యనారాయణ - వ్యాస పరిమణం.

★★★

BHAVAVEENA
Vol. 21, Issue. 08, August 2024

భావవీణ

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

# కొలకలూరి ఇనాక్ 'వలస' నవల - మానవతా దృక్పథం

- **తుమ్మలపల్లి సోమశేఖర్,** పరిశోధక విద్యార్థి, మద్రాస్ క్రైస్తవ కళాశాల, తాంబరం ఈస్ట్, చెన్నై.

**ఉద్దేశం :**

కరోనా సమయంలో వలస కార్మికులు ఎదుర్కొన్న సమస్యలు, ఇబ్బందులతోపాటు మానవత్వ హృదయం కలిగిన అన్నదాతల దాతృత్వాన్ని, వారి ఉదారమైన స్వభావాన్ని కొలకలూరి ఇనాక్ గారు కరోనా సమయంలో రాసినటువంటి 'వలస' అనే నవలలో కొన్ని పాత్రల ద్వారా మనిషి జయిస్తే కరోనా లయిస్తే మానవత్వం విజయం సాధిస్తుంది అన్న విషయాన్ని స్పష్టంగా తెలియజేశారు. అలాంటి మానవత్వానికి ప్రతిరూపమైన పాత్రల ఔన్నత్యాన్ని తెలియజేయడమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం.

**ముఖ్యాంశాలు :**

కొలకలూరి ఇనాక్, వలస కూలీల సమూహం, కరోనా నేపథ్యం, హైదరాబాద్, బీహార్, రాం, రమ పాత్రలు ఈ నవలలో అనేక విషయాలు ముఖ్యంగా కనిపిస్తాయి.

**రచయిత పరిచయం :**

మానవత్వమే లక్ష్యంగా సాహిత్య సేద్యం మొదలు పెట్టి మనిషి కుల, మత, వర్ణ, వర్గ, లింగ భేదంతో కాకుండా మనిషిని మనీషిలా చూసినప్పుడే సమాజం మానవత్వంతో మూడు పువ్వులు ఆరు కాయలుగా మారి మంచి సమాజంగా మారుతుందన్న సత్సంకల్పంతో ఆశావాదిగా ఆరున్నర దశాబ్దాలుగా రచనలు చేస్తూ ఎందరినో మానవత్వ హృదయాలుగా తీర్చిదిద్దిన మహోన్నతమైన వ్యక్తి కొలకలూరి ఇనాక్ గారు. వీరి ప్రతిభ అసాధారణమైనది. ప్రతి రచనలోనూ వైవిధ్యంతో కూడిన వాస్తవిక జీవితం కనిపిస్తుంది. దళితుడిగా పుట్టి వీరు దళితుల ఆత్మగౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని మేళవించి దళితులలో ఐక్యతను తెచ్చే ప్రయత్నం కనిపిస్తుంది వారి ప్రతి రచనలోను. వీరు వందకు పైచిలుకు పుస్తకాలను రాసిన అరుదైన సాహిత్యవేత్త. వీరు తెలుగు సాహిత్య లోకంలో అస్తమించని రవి తేజస్సుతో విరాజిల్లె కవి అని చెప్పడంలో అతిశయోక్తి ఏమాత్రము లేదు.

వీరు కవిగా, రచయితగా, కథకుడిగా, విమర్శకుడిగా, నవలాకారుడిగా, అనువాదకుడిగా, పరిపాలన దక్షకుడిగా, కర్మయోగిగా, ప్రతిరంగంలోనూ వీరికలం సాహిత్య గంగా జలంగా పరవల్లు తొక్కింది. ప్రతి పనిలో వీరి ప్రతిభ నైపుణ్యం విజయవంతమైంది అనడంలో సందేహమే లేదు. వీరి రచనలకు గల్లి నుండి ఢిల్లీ దాక అనేక పురస్కారాలు, బహుమతులు వచ్చాయి. అందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, కేంద్ర ప్రభుత్వం అందించే కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, జ్ఞానపీఠ ట్రస్ట్ వారు అందజేసే అత్యున్నతమైన అరుదైన మూర్తిదేవి పురస్కారంతో పాటు తెలుగుభారతి, మల్లెమాల, దువ్వూరి రమణమ్మ, ఎన్టీఆర్ లలిత కళా పురస్కారాలతో పాటు కేంద్రప్రభుత్వం వారు 2014వ సంవత్సరంలో 'పద్మశ్రీ' పురస్కారంతో వీరిని ఘనంగా సత్కరించడం జరిగింది.

తెలుగు సాహిత్యంలో ప్రతి ప్రక్రియలోనూ వీరిచేయి అందెవేసిన చేయి అనడంలో అతిశయోక్తిలేదు. ప్రతి ప్రక్రియాలోను వీరి ప్రతిభ పాటవాలు కనిపిస్తాయి. ఏ ప్రక్రియలోనైనా వీరుచేసే రచనలు సామాజిక స్పృహ, సామాజిక చైతన్యం, సామాజిక బాధ్యతను కలిగిస్తాయి.

వీరి ప్రతిరచన మనిషిని అధమ స్థితినుంచి ఉన్నత స్థితికి ఎదిగేలా చేసేటందుకు వారి ప్రతి అక్షరం ఆ దిశగా కృషిచేస్తుంది. ఆ రకమైన రచనలు చేసేటందుకు వారు చేసే కృషి అంతా ఇంతా అని చెప్పే దానికి అవ్వదు. నిరంతరం తనలో తాను, తనలో సమాజాన్ని దర్శించి తను దర్శించిన సమాజాన్ని మాత్రమే అక్షరబద్ధం చేస్తారు ఇనాక్ గారు.

తెలుగు సాహిత్యంలో నవల అనేది ఉత్తమమైన ప్రక్రియ. ఈ నవల ప్రక్రియ ద్వారా తెలుగు సాహిత్య

లోకంలో అనేక నవలలు వచ్చాయి. అనేకమంది నవలా కారులుగా మారి తెలుగు పాఠకుల అభిమానాన్ని, మన్నన లను అందుకున్నారు. అదేవిధంగా ఇనాక్ గారు వారి నవలా ప్రస్థానాన్ని మొదలుపెట్టి ఇప్పటివరకు 15 నవలలు రాశారు. అవి సమత, అనాధ, సౌభాగ్యవతి, సౌందర్యవతి, ఎక్కడుంది ప్రశాంతి, ఇరులలో విరులు, రెండు కళ్ళు మూడు కాళ్ళు, మాజీ మనిషి, అనంత జీవనం, సర్కార్గడ్డి, పులులబోను - నేను, రంధీ, కన్నతల్లి, వలస, పైమెట్లు వంటి నవలలు రాశారు. ప్రతి నవలలోనూ సామాజిక స్పృహ, సామాజిక చైతన్యం, సామాజిక బాధ్యత ఉండేలా ప్రతి నవలలను తీర్చిదిద్దడంలో వీరు విజయం సాధించారు. వీరు రాసిన నవలలు ఇతర భాషలలోకి అనువాదం అయ్యాయి.

వీరు రాసిన 15 నవలలో 'వలస' నవలను పరిశీలించి చూసినట్లుయితే, ఈ వలస నవలలో రచయిత అణు వణువునా మానవత్వ గంధ పరిమళాన్ని అద్దారు. ఈ నవల నేపథ్యాన్ని ఇనాక్ గారి మాటల్లో చూసినట్లయితే 'మనిషి జయిస్తే, కరోనాలొస్తే మానవత్వ విజయం, కాకపోతే ఇది కనిపించని శత్రువుతో, ఆయుధధారితో నిస్సహాయుల, నిరాయుధుల నిరాహార యుద్ధం ప్రథమ కబళం వలస కూలీలు' అన్న కరోనా సమయంలో వలస కార్మికుల సాధకబాధకాల గురించి, వారు పడిన యాతన గురించి, ఆ సమయంలో వారి మానసిక శారీరక స్థితి గురించి ఇనాక్ గారు హృదయం ద్రవించేలా, మనసు బరు వెక్కేలా, వాస్తవిక పరిస్థితులను కళ్ళకు కట్టేలా చిత్రించి మనిషిని ఆలోచింపచేసేలా ఈ నవలను రాయడం వారికే సాధ్యం అనిపించేలా ఈ నవలను మలచడం వారిమానవత్వ హృదయానికే సాధ్యం అయింది.

## కరోనా పరిస్థితులు :

భారత ప్రభుత్వం కరోనా కారణంగా దేశాన్ని మొత్తం లాక్ డౌన్‌తో లాక్ చేసింది. ఒకవైపు కరోనా మరణాలు, మరోవైపు ఆకలి చావులతో మనదేశం, ప్రపంచం అతలాకుతలమయింది. కోటికిపైగా మరణించారు, అనడంలో ఆశ్చర్యం లేదు. ఆ స్థాయిలో కరోనా వైరస్ ప్రాణాలను తీసుకుంది. భయం అంటే ఏమిటో ప్రత్యక్షంగా చూపించింది. 'మనిషికి ప్రాణంపై ఆశని శ్వాసపై ధ్యాసని పెట్టేలా చేసింది'. ఎన్నో ప్రాణాలను బలి తీసుకున్న ఈ కరోనా వైరస్ వలస కూలీలను బలి తీసుకుంది. వలస కూలీలు వాళ్లసొంత ఊర్లకు వెళ్లే టందుకు ఎన్ని ఇబ్బందులు, ఎన్ని కష్టాలు పడ్డారో మనం ప్రత్యక్షంగా టీవిల్లోనూ, సోషియల్ మీడియాలోనూ చూసాము. ఆ సమయంలో వారికోసం ఎంతోమంది మానవత్వ హృదయంతో, దాతృత్వంతో, సేవ నిరతితో, సహాయం సహకారం అందించిన మహానీయులను చూసాము. ఆ కరోనా సమయం అందరికీ కష్టకాలమై కన్నీళ్ళని తెప్పించింది.

ఒకవైపు ఎక్కడో పనిచేస్తున్న వాళ్లని ఒక గూటికి చేర్చిన కరోనా వైరస్ మరోవైపు ఒకేరక్తంతో పుట్టిన వాళ్లని దూరం ఉండేలా చేసి మనిషిని అన్ని రకాలుగా కృంగదీసింది. కరోనా రోగంతో చనిపోయిన శరీరం దగ్గరికి వెళ్లనివ్వని విధంగా ఆఖరి చూపుకి నోచుకోని రీతిలో మరణాన్ని అందించిన మహమ్మారి వైరస్ కరోనా. కరోనా వచ్చింది లాక్ డౌన్ వచ్చింది. వలస కూలీలు వాళ్లసొంత ఊర్లకు ప్రయాణం మొదలయ్యింది. అలా మొదలైన వలస కూలీల ప్రయాణాన్ని నేపథ్యంగా తీసుకొని వాళ్లకు ఎదురైనా పరిస్థితులను గురించి అనుభవించిన సమస్యలు గురించి రచయిత కళ్ళకు కట్టినట్లు ఈ నవలలో ఎంతో నైపుణ్యంగా చూపించడం జరిగింది.

## నవల పరిచయం :

వలస కూలీల సమూహం హైదరాబాదు నుండి ఆదిలాబాద్ మీదుగా బీహర్ ప్రయాణంతో ఈ నవలను ప్రారంభం చేస్తారు ఇనాక్ గారు. సంసారం సమూహానికి నాయకత్వం వహించిన రతన్ ఇతనితో పాటు భార్య కూతురు ఉన్నారు. వీళ్లతో పాటు 10 కుటుంబాలు ఉ న్నాయి. అందరూ కలిసి నడవడం ప్రారంభించారు. ఒక సంకలో పిల్లనో, పిల్లోడినో ఎత్తుకొని, మరో సంకలో నెత్తిపై వాళ్ళ లగేజీ మోస్తూ నడవడం, కష్టమైనా నడవడం మాత్రం ఆపకుండా ముందుకు సాగారు సాహస వీరుల్లా వలస కూలీలు. వాళ్ళ ధైర్యానికి అన్నపూర్ణ అడుగడుగునా అన్న ప్రసాదాన్ని అందిస్తూ, వాళ్లను ఆశీర్వదిస్తూ వాళ్ళ

గమ్యస్థానాన్ని చేర్చింది. వాళ్ళ ప్రయాణంలో వాళ్లకు ఎంతో మంది ఆకలిని, దప్పికని తీర్చి సహాయాన్ని సహకారాన్ని అందించి విశాలమైన హృదయం కలిగిన వాళ్ళుగా మానవత్వాన్ని చాటారు.

## మానవత్వ దృక్పథం :

మానవత్వం, విశాల హృదయం కలిగిన పాత్రలు సంఘటనలు ఈ నవలలో వలస కూలీలకు అడు గడుగునా ఎదురవుతాయి. అందులోని కొన్ని పాత్రలను పరిశీలించినట్లయితే రోడ్డుప్రక్కన ఒక గోనెసంచుల పాకలో కూర్చొని బిక్షమెత్తుకుంటున్న రెండు కాళ్ళులేని ఒక భిక్షగత్తె దయచేసి ఒక బిస్కెట్టు తిని ఒక కప్పు టీ తాగిపోవలసిందిగా ప్రార్థిస్తున్నాను. ఇట్లు మీ అమ్మ వంటి అనాధ (పు.38) అనేబోర్డుతో ప్రతి వలస కూలీకి టీ, బిస్కెట్టు అందిస్తూ, కూలీలు స్వగ్రామాలకు చేరేవరకు నడిచే శక్తిభగవంతుడు వారికివ్వాలని ప్రార్థించిన బిక్షగత్తెకు కూలీలకు ఎలాంటి బంధమూ బంధుత్వమూ లేదు. వాళ్ళకి సాయం చేయాలన్న తపన, తాపత్రయం తప్ప. కూలీలకు ఆ బిచ్చగత్తెకు మధ్య వారధి మానవత్వపు హృదయం మాత్రమే.

వారి ప్రయాణంలో మరో చోట డాబా యజమాని ఒక్కో వలస కూలీకి ఉదయం రెండు బన్నులు, ఒక ఉల్లిపాయ, కప్పు టీ, గ్లాసుడు నీళ్ళు, మధ్యాహ్నం ఊతప్పం, రాత్రి పరోటా దానం చేసే అదృష్టం రెండు, మున్నాళ్ళయినా తనకుండాలనుకుంటాడు. కూలీలు కాలినడకన ప్రయాణం చేసేరోజులు రాకూడదనీ, హైదరాబాదులోనే ఉండాలని కోరుకుంటాడు. ఆ డాబా యజమాని వలస కూలీలపై చూపించిన ప్రేమ ఆప్యాయత అతని మానవత దృక్పథాన్ని సూచిస్తుంది.

మరో డాబా యాజమాని సగం రేట్లకే టిఫిన్లు పెడుతుంటే మీకు నష్టం కదా? అన్న ప్రశ్నకి దేవుడు నాకు ఇయ్యలేదు కానీ ఇచ్చి వుంటే వలస కూలీలకు రోజంతా ఏదోపెడుతూనే వుండాలనే ఆశ వుంది. అందరి ఆశలు నెరవేరతాయా? ఇంతేప్రాప్తం (పుట. 56) అని అనుకుని తనకున్న దాంట్లో ఎంతో కొంత సాటివారికి సాయం చేయాలనుకున్న తీరు 'సొంత లాభం కొంత మానుకొని, పొరుగు వాడికితోడుపడవోయ్' అన్న గురజాడ వారి మాటల్ని, 'ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న' అన్న మదర్ థెరిస్సా మాటల్ని గుర్తుకు తెస్తాయి. వారి ప్రయాణంలో మరొక హృదయాన్ని ద్రవించే విధంగా, హృదయాన్ని పులకరించే విధంగా ఒక అరుదైన సంఘటన చోటుచేసుకుంటుంది. అది వారి సమూహంలో నిండుగర్భిణి ప్రసవం చెందుతుంది. ఆ సమయంలో వారి ప్రయాణ మార్గంలో వారికి ఎటువంటి సౌకర్య మార్గాలు లేనప్పటికి వారు ఒక చెట్టుకింద ఆమెను ఉంచి వారి దగ్గరున్న చీరని ఆమెకు అపుగా కట్టి ఆమెను ప్రసవం చేసేటందుకు ఒక ఆవిడ ఆమెకు ఎటువంటి సంబంధమూ లేనప్పటికి ఒక మానవత్వ హృదయంతో ఆ ప్రసవిస్తున్న స్త్రీని తన పేగుని నోటితోనే గట్టిగా పూర్వకాలపు పద్ధతి ఉపయోగించి తననోటిలో నుంచి ఉమ్మిని తీసుకొని, గట్టిగా కొరికి తల్లిని, బిడ్డను వేరుచేసి ఆ గర్భిణీ స్త్రీని ఆరోగ్యవంతంగా చేసేటందుకు ప్రయత్నిస్తుంది. ఈ సంఘటన కళ్లకు కట్టినట్టు రచయిత వివరిస్తారు. నిజానికి ఆమెకు, ఆ గర్భిణీ స్త్రీకి ఎలాంటి రక్తసంబంధమో మరో ఏ బంధమో లేనప్పటికి ఒక సాటి స్త్రీగా మరో స్త్రీకి సహాయం చేసిన ఆ తీరు హృదయాన్ని స్పందింపజేస్తుంది.

కూలీలు అడవి మార్గాన వెళ్తుంటే దారిదోపిడి దొంగలు వాళ్ళని బంధించి రెండువేలు కంటే ఎక్కువ డబ్బులున్న వాళ్ళు ఇవ్వాలని, లేకపోతే చంపుతామని బెదిరిస్తారు. అలా బెదిరించి ఆపడం వెనుక వాళ్ల ఉద్దేశం మిమ్మల్ని ఇక్కడ ఆపింది మీసొత్తు దొంగలించడానికి కాదు. మీకు తిన్నంత భోజనం పెట్టడానికి కాళ్ళు చేతులు కడుక్కు రండి (పుట.92) అని ఆర్డరు వేసి అన్నం పెట్టిన దొంగలూ మనషులే. ఆకలి బాధ ఎలా ఉంటుందో తెలిసినవాళ్ళు కనుకనే కూలీల ఆకలి తీర్చి మానవత్వాన్ని చాటుకున్నారు. పరిస్థితులే మనిషిని దొంగను చేస్తాయి. అంతేకాని మనిషి సహజంగా దొంగకాదు, అతనికి కూడా మంచి మనసు, మానవత్వ హృదయం, తోటివారికి సాయపడాలనే గుణం ఉంటుందని ఈ వలస నవలలో ఇనాక్ చెప్పడం వెనుక వారి ఆంతర్యంలో పుట్టుకతో అందరూ మంచివాళ్లే

వాళ్లు ఎదుర్కొన్న పరిస్థితులే వాళ్లని మంచివాళ్ళు గాను, చెడ్డవాళ్ల గాను తయారు చేస్తుందన్న వారి మనోవిశ్లేషణ అక్షర సత్యం. గరీబునైనా నవాబునైనా ఒకటిగా చూడా లన్నదే వీరిభావన.

## దానధర్మాలపై మరోకోణం :

రచయిత ఈ నవలలో రాం రమ సంభాషణ ద్వారా దానధర్మాలు నేడు ఏ స్థాయిలో వర్ధిల్లుతున్నాయో చూద్దాం. 'రామ్ మాట్లాడుతూ ఈ దానధర్మాల కార్య క్రమం అంతా పుణ్యం కోసమేకాదని గుర్తించటానికి ఎవరికీ ఎక్కువ సమయం పట్టలేదు. ప్రచారంలోనే ప్రపంచం వర్ధిల్లుతూ ఉంది. ఫలితం ఏదోలాభం అది. ఆర్థికమో, రాజకీయమో, సాంఘికమో, మతమో ఏదో! మనసులో ఒకటి పైకి ఒకటి' నువ్వు ఒకందుకు పోశావు నేను ఒకందుకు తాగుతాను' అన్నట్లు ఉంది. ఆత్మ తృప్తికోసం అన్నదానం మేలు అనేక ప్రయోజనాల కోసం అన్నదానం అదో విజయం అంతా నాటకంగా ఉంది' అన్న రామ్ ఆవేదనకు బదులుగా రమా ఇలా అంటుంది. 'ఏదో ఒకటి మనకింత తినడానికి పెట్టాడు పుణ్యాత్ముడు ఎంతో కొంత దయ లేకపోతే ఈ పని తలపెట్టి ఉండడు కదా ధర్మాత్ముడు స్వలాభం లేని పని 'చీమ కూడా చేయదు' రెండు పూటలా అన్నం పెట్టాడు అదే పదివేలు' అంది రమ. ఒక వైపు దానధర్మాల పేరుతో జరిగే దందాని ఎండగట్టారు. అలాగే మరోవైపు నిజమైన దాతృత్వ హృదయం కలిగిన మానవత్వాన్ని తెలియజేశారు. పేరు కోసం, అవార్డుల కోసం, రివార్డుల కోసం, లేదా ఏదో లబ్ధికోసం చేసే దానధర్మాలు సరైనదా! సరికానిదా! అనేవిషయాన్ని పక్కన పెడితే వాళ్లుచేసే దానధర్మాలు పేదవాడి ఆకలిని, పేదవాడి దాహాన్ని, పేదవాడి అవసరాన్ని తీరుస్తోంది కొందరు ఆత్మ తృప్తికోసం చేసే దానధర్మకర్తలు ఉన్నారు. మరికొందరు పేరు ప్రతిష్ఠల కోసం చేసే దానధర్మాత్ములు ఉన్నారు.

'సమాజంలో వ్యక్తుల మనస్తత్వాలు ఇంద్రధనుస్సుల ఇంద్రజాలంగా ఉంటాయి, కనుక సానుకూల దృక్పథంతో ముందుకు వెళ్తూ శాంతియుతంగా సమాజాన్ని నిలపడమే లక్ష్యంగా ఈ నవలలో రచయిత సమాజం పట్ల వారికున్న అవగాహనని, అనుభవాన్ని, బాధ్యతాయుతంగా చైతన్య స్ఫూర్తితో ఈ నవలను తీర్చిదిద్దడం వారి ప్రతిభకు తార్కాణంగా చెప్పుకోవచ్చు.

## ఉపసంహారం :

ఈ నవలలో ప్రతి పాత్ర పాఠకునికి ఓ కొత్త అను భూతిని, అనుభవాన్ని ఇస్తుంది. నవల చదవడం మొదలు పెట్టినప్పటినుంచి చివరిదాకా వదలబుద్ధి వేయని విధంగా ఉంటుంది. సరళమైన భాషతో తేలికైన మాట లతో పాఠకున్ని మెప్పించే శైలితో రచయిత రచనను రస భరితంగా రాయడం జరిగింది. ఏ పాత్రకు ఆ పాత్ర అన్నట్లు రచయిత ప్రతి పాత్రకు ప్రాణం పోశారు.

ఇనాక్ గారి కలం నుంచి జాలువారిన అరుదైన రచన వలస నవల. ఈ నవల కరోనా నేపథ్యంలో రాయడం వలస కూలీల ఆవేదనను, ఆరాటమును, వాళ్ల స్వగ్రామా లకు వెళ్లేటందుకు చేసిన పోరాటమును రచయిత పాఠకులకు కళ్ళముందు కనిపించేలా ఈ వలస నవలలో చిత్రించారు. 'మానవుడు మాధవుడవ్వాలంటే మానవత్వమే వారధి' అలాంటి మానవత్వాన్ని ప్రతిమనిషి కలిగి ఉండాలని ఉన్న కొన్ని రోజులు అయినా కొంతమందికి ఉపయోగకారిగా మెలగాలని' పరోపకారమే పరమాత్మునికి పరమ కైంకర్యం' అని రచయిత తన విశాలహృదయాన్ని మానవతా దృక్పథాన్ని ఈ వలస నవల ద్వారా చాటుకున్నారు.

## ఆధార గ్రంథాలు :

1. నాన్న కొలకలూరి ఇనాక్ జీవితం - చరిత్ర - కొలకలూరి మధుజ్యోతి
2. వలస నవల - ఆచార్య కొలకలూరి ఇనాక్
3. కొలకలూరి ఇనాక్ గారిపై వచ్చిన కొన్ని వ్యాసాలు

★★★

# దోర్నాదుల సుబ్బమ్మ కథలు - స్త్రీ అస్థిత్వం

- **ముద్దె అనిత,** పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ పద్మావతి విశ్వవిద్యాలయం, తిరుపతి.

- **డా॥. డి. యువశ్రీ,** పరిశోధక పర్యవేక్షకులు, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ పద్మావతి విశ్వవిద్యాలయం, తిరుపతి.

ఆధునిక సాహిత్యంలో అత్యంత ప్రభావవంతమైన ప్రముఖమైన ప్రక్రియ కథ. తెలుగు సాహిత్యంలో కథ ప్రవేశించి దాదాపు 108 సంవత్సరాలయ్యింది. ఎక్కడో ఆకాశంలో మనం చూడని దేవతల్ని, దేవుళ్ళను కథా వస్తువుగా చేసుకున్న కథ 1948 నుండి సామాజిక సమస్యలను ఇతివృత్తంగా తీసుకోవడం జరిగింది. కథలంటే ఇష్టపడని వారుండరు. సమాజంలో జరిగే ఏ సంఘటనైనా, విషయమైనా కథల ద్వారా తెలియజేస్తే పాఠకుడిలో మార్పు వస్తుంది.

సృష్టికి ఆధారం స్త్రీ. ఎక్కడైతే స్త్రీలు పూజింపబడతారో, అక్కడ దేవతలు ఆనందించబడతారు. ఆకాశంలో పక్షి తన రెండు రెక్కలతో స్వేచ్ఛగా ఎలా ఎగరగల్గుతుందో, అలాగే సమాజంలో సగభాగం వున్న స్త్రీలు, పురుషులతో పాటు సమాన హక్కులు పొందగల్గినప్పుడే సమాజం అభివృద్ధి పథంలో సాగుతుంది. స్త్రీల అణచివేతను, స్త్రీలను పట్ల జరుగుతున్న హింసలను, స్త్రీ సమానత్వాన్ని కాంక్షిస్తూ ఎంతోమంది స్త్రీవాద రచయిత్రులు తమ పోరాటాల్ని రచనల ద్వారా చేశారు. అటువంటి రచయిత్రులలో దోర్నాదుల సుబ్బమ్మ ఒకరు. తన కథల్లోకి స్త్రీ అస్థిత్వాన్ని తెలియజేయడమే ఈ పత్ర ప్రధానోద్దేశం.

నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జన్మించిన దోర్నాదుల సుబ్బమ్మ 1958 నుండి సాహిత్య రచనలు చేస్తున్నారు. వీరు స్వయంగా మహిళల హక్కుల కోసం, వారికి సహాయ సహకారాలందించే స్వచ్ఛంద సంస్థను నడిపిన సంస్కరణాభిలాషి, సామాజిక కార్యకర్త. కత్తికి రెండు వైపుల పదును వున్నట్లు ఒకవైపు సామాజిక కార్యకర్తగా మరొకవైపు రచయిత్రిగా సామాజిక సమస్యలకు పరిష్కార మార్గాలు చూపెట్టారు. వీరి కథలన్నీ స్త్రీ దృక్పథం నుండి వెలువడ్డాయి. ఒక పరంపరగా కుటుంబ వ్యవస్థలోని అణచివేతను ఖండిస్తూ, సమానత్వాన్ని కాంక్షిస్తూ రాసినవి. వీరు రాసిన కథల్లో మచ్చుకు మూడు కథల్ని పాఠకుల ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేశాను. అవి :

నానమ్మ నౌకరి, ఓ పువ్వు పూసింది, బ్రతుకు బరువు అనే కథలు.

## నానమ్మ నౌకరి :

'నానమ్మ నౌకరి' కథలో ప్రధాన పాత్రలు నానమ్మ, లావణ్య. అరవై సంవత్సరాల వయస్సు ఉన్న నానమ్మ ఒంటరిగా కూర్చొని పరధ్యానంగా ఆలోచిస్తూ, టీపాయ్ మీద ఉన్న రెండు వందల కాగితాలను చూసింది. ఇవే నా జీవితంలో నేను సాధించిన సొత్తు అని ఆలోచిస్తూ బాధపడుతుంటుంది. అప్పుడే వచ్చిన లావణ్య "ఏంటి నానమ్మ బాధపడుతున్నావు" అని అన్నప్పుడు, ఆమె బాధని తెలియనీయకుండా ఉండాలని జాగ్రత్త పడుతుంది. అయినా ఆమె కన్నీళ్ళు బాధను దాచలేకపోతాయి. అప్పుడు పక్కింటి లక్ష్మీ వచ్చి "మీ నానమ్మకి మీ తాతయ్య దండగ తిండి పెడ్తున్నానని, తన వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని" అన్నాడని చెప్తుంది. అందుకే మీ నాన్నమ్మ ఈ వయస్సులో ఎప్పుడో చదివిన పదో తరగతి ప్రైవేటు స్కూల్లో ఉద్యోగంలో చేరింది అని, ఈ వయస్సులో కూడా ఆమె కష్టపడ్తూ, బాధపడ్తూందని చెప్తుంది. ఆ మాటలు విన్న లావణ్య గుండె పగిలినంతగా బాధపడుతుంది. తాను ఎంతో గొప్పగా అనుకునే తాతయ్య ఇంత కఠినంగా మాట్లాడాడా? అని బాధ పడుతుంది. నానమ్మ కొడుకునూ, కూతురుని రమ్మని లావణ్య టెలిగ్రాం పంపుతుంది. వారు వచ్చేసరికి ఏమి మాట్లాడకుండా వెళుతుండగా ఆ సమయంలో కొడుకూ, కూతురు ఆశ్చర్యంగా, బాధగా 'ఎక్కడికి అమ్మా! ఈ వయస్సులో ఉద్యోగం ఎంటమ్మా?" అని అడుగుతారు.

అప్పుడు ఆమె ఇలా అంటుంది ఒకసారి నీ దగ్గరకు వచ్చినప్పుడు నీ భార్య మీ అమ్మకు పెట్టే తిండి, ఏ పనివాళ్ళకో పెడితే ఈ పనులన్నీ చేస్తారు అంటే, ఒకే డియర్! నీ ఇష్టం వచ్చినట్లు చెయ్యి అని నువ్వు అన్నావు. నీ భార్యను సంతోషపెట్టడానికే ఆలోచించావు కానీ, నీ తల్లిని తక్కువ చేసి ఆమెను బాధపెడుతున్నానని తెలుసు కోలేకపోయావు. అందుకే మీ నాన్న మీద, నీ మీద ఆధారపడకూడదనే ఈ ఉద్యోగం అని బయలు దేరుతుండగా, ఒక్కసారిగా గుండెల్లో నొప్పి వచ్చినట్లయ్యి పడిపోతుంది. ఇన్ని సంవత్సరాలు సంసారాన్ని చక్కబెట్టి, పిల్లల్ని ప్రయోజకుల్ని చేయడం కోసం అహర్నిశలు కష్టపడిన ఆ తల్లి వారందరూ చూస్తుండగానే శాశ్వతంగా మరణిస్తుంది. ఇంతకాలం ఎవరికోసం జీవించిందో, ఎందుకు జీవిస్తుందో అర్థంగాక ఆ గుండె అల్లాడి పోయింది. ఓ చల్లని మనస్సు నిరంకుశత్వం కల్గిన మనిషి కాఠిన్యత్వంతో అవిశ్రాంతంగా అల్లాడి, అలమటించి బలైందని రచయిత్రి హృద్యంగా నాన్నమ్మ పాత్ర ద్వారా తెలియజేశారు. ఈ కథలో నాన్నమ్మకు ఆర్థికంగా సంపాదన లేకపోవటం చేతనే, ఆమె తన భర్తకు, కొడుకుకి లోకువ అయ్యిందని, కాబట్టి స్త్రీలు చనిపోయేంత వరకు ఎవరిపైనా ఆధారపడరాదని, స్త్రీకి ఆర్థిక స్వేచ్ఛ ఉండా లని రచయిత్రి ఈ కథ ద్వారా తెలియజేశారు.

**ఓ పువ్వు పూసింది :**

'ఓ పువ్వు పూసింది' కథలో సుమలత, పార్వతమ్మ, పద్మావతిలు ప్రధాన పాత్రలు. సుమలత తల్లిదండ్రులు అందరి తల్లిదండ్రుల్లాగానే బాధ్యతగా ఆమె పెళ్లి చేస్తారు. అయితే సుమలత భర్త వైవాహిక జీవితానికి అనర్హుడు. అతని తల్లిదండ్రులు నిజం దాచిపెట్టి సుమలత జీవితాన్ని ప్రశ్నార్థకం చేస్తారు. ఈ విషయం సుమలతకు మొదటి రాత్రే అర్థమవుతుంది. ఈ సంగతి తెలిసిన పార్వతమ్మ, సుమలత మేనత్త పద్మావతులకు గుండె ఆగినంత పనౌతుంది. జరిగిన దానికి అందరూ బాధపడతారు. కత్తుల రాళ్ళు, ముళ్ళ లాంటి ఈ జీవితం నుండి తనకి స్వేచ్ఛ కల్పించమని సుమలత తన తల్లిని అడుగుతుంది. పరువు ప్రతిష్టతల కోసం, మనస్సు మంచిది చేసుకొని అతనితో జీవించమని తల్లి సుమలతకి చెబుతుంది. నా విషయంతోనే మీ పరువు, ప్రతిష్టలు ముడిపడి వున్నా యంటే వాటికి నేనేమి భంగం కల్గించను అని సుమలత అంటుంది. కాని ఒక విషయం, మీరు విధిగా వివాహం చేశారు. అది చట్టబద్ధంగా, న్యాయంగా లేనప్పుడు దాన్ని సరిదిద్దుకునే హక్కు, ధర్మం ఆడపిల్లకి వుంటుంది. అది గుర్తించుకో అమ్మ అని చెప్పి వెళ్లిపోతుంది. సమాజం దృష్టిలో అతనికి వండిపెడ్తూ భార్యగా ఆరేళ్ళు వుంటుంది. అయితే సుమలతలో నిర్లిప్తత, జీవితం పట్ల అసహనం నరనరాన జీర్ణించుకొనిపోయి వుంటాయి. మొక్కలు, పువ్వులు చెట్లతో తన బాధనంతా చెప్పుకుంటూ వుంటుంది. అలా ఉండగా ఒకరోజు ఆమె భర్త తీవ్ర అనారోగ్యం వల్ల మరణిస్తాడు. అందరూ జాలితో ముంచెత్తుతారు. సుమలతకు మాత్రం జీవితంలో ఇప్పుడే స్వేచ్ఛగా వచ్చినట్లు ఉంటుంది. జీవితం కొత్తగా ఉం టుంది. సుమలతకు ఎదురింటి మదన్‌మోహన్‌తో పరిచయం, ప్రేమగా ఏర్పడి భవిష్యత్తు జీవితం అతనితో గడపాలని నిశ్చయించుకుంటుంది. ఆ విషయమే తల్లి దండ్రులకు చెప్పగా వాళ్ళు అంగీకరించరు. ఒకనాటి అర్థరాత్రి మదన్‌మోహన్‌తో సుమలత పారిపోతుంది. భవిష్యత్తు మీద ఆశతో అప్పుడే ఆనందంగా ఓ పువ్వు పూసింది.

ఈ కథలో రచయిత్రి సుమలత పాత్ర ద్వారా జీవితాన్ని చక్కదిద్దుకునే హక్కు, అధికారం ఆడపిల్లకి ఉందని, పరిష్కార మార్గాన్ని అన్వేషించుకోగలదని న్యాయంగా, స్వేచ్ఛగా జీవించే హక్కు ఉందని తెలియ జేశారు.

**బ్రతుకు బరువు :**

దోర్నాదుల రచించిన మరో కథ "బ్రతుకు బరువు". సుహాసిని ఓ గృహిణి. ఆమెకు ఎనిమిదేళ్ల కొడుకు రఘు, భర్త మదన్ ఉన్నారు. పెళ్లయి బిడ్డ పుట్టినా వారి మీద ఎటువంటి ప్రేమ చూపే వాడుకాదు మదన్. చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. స్త్రీ లోలుడు రోజుకో స్త్రీతో గడిపేవాడు. అప్పుడప్పుడు ఇంటికి తీసుకొచ్చుకొనేవాడు. రాను రాను అతని ప్రవర్తన మితిమీరిపోయేది. ఇదంతా

సుహాసిని కళ్ళ ముందర జరగుతున్నా, భర్త ఎప్పటికైనా మారకపోతాడా అనే నమ్మకంతో ఎదురు చూస్తుండేది. అలాగే ఎనిమిదేండ్ల కాలం గడిచిపోయింది, ఏదైనా అడిగితే కొట్టడం, తిట్టడం మామూలు అయిపోయాయి. ఇదంతా బిడ్డ రఘు చూస్తూ ఉండేవాడు. తన తల్లిని ఎందుకు కొడుతున్నాడో ఆ పసిహృదయానికి తెలిసేది కాదు.

"అమ్మా! నాన్న నిన్ను ఎందుకు బెల్టుతో కొడు తున్నాడు? అని, నేను స్కూలు నుండి వచ్చేటప్పటికి నువ్వు ఎందుకు ఏడుస్తుంటావని?" రఘు తన తల్లి సుహాసినిని అడుగుతాడు. ఏమి సమాధానం చెప్పలేక బిడ్డను ఏమార్చేది. రఘు ఓ రోజు రాత్రి "ఈ నాన్న వద్దు అని నాకు మంచి నాన్న కావాలని" తల్లిని గట్టిగా పట్టుకొని ఏడ్చాడు. సుహాసిని తన భర్త మదన్‌తో మాట్లాడి ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని నిశ్చయించుకుంటుంది.

"ఏమండీ నేనేం పాపం చేశాను. నా కెందుకీ శిక్ష....? కట్టుకున్న దాన్ని ఇంట్లో ఉండగా పరాయి ఆడవాళ్ళను తీసుకొచ్చి అనుభవించడం మంచిది కాదు. ఒక భర్తగా నాకెలాంటి ఆనందాన్ని ఇవ్వకపోయినా ఫర్వాలేదు. కనీసం రఘుకు మంచినాన్నగా కనపడండి. వాడి పసి హృదయంలో రాక్షసుడిగా నిలిచిపోవద్దు అని ప్రాధేయ పడుతుంది. ఇంతగా మాట్లాడినా అతనిలో ఏ మార్పు ఉండదు. ఇంతకాలం అమ్మమ్మ, అమ్మల మాట మీదుగా భర్త ఎలాంటి వాడైనా గుట్టుగా బ్రతకాలను కుంది. కాని నేడు తన బిడ్డ భవిష్యత్తు తన జీవితం అర్థం లేకుండా పోతాయని ఓ మంచి నిర్ణయం తీసు కుంది. ఇన్నేళ్ళు భరించాను. ఇక వద్దు. చదువుకున్న చదువు తన జీవితానికి ఓ మార్గం చూపిస్తుంది అనుకుంది. తన బిడ్డే తన ప్రపంచంగా భావిస్తుంది. ఇకపై తన బిడ్డకు తల్లిని, తండ్రిని తానే అని నిశ్చయించుకుని ఆ ఇంటి నుండి ఆ భర్త నుండి శాశ్వతంగా బయటకు వచ్చేస్తుంది.

రాతి మీద చెట్టు ఎంతగా బ్రతకాలని ప్రయత్నించినా బ్రతకదు. అలాగే మదన్ లాగా చెడు వ్యసనాలకు లోనైన వ్యక్తి ఇక మారడు అని నిర్ణయించుకొని సుహాసిని ధైర్యంగా ముందడుగు వేసింది.

ఇలాంటి వ్యవసపరుల, తిరుగుబోతు భర్తల వల్ల బాధలు పడ్తూ, బిడ్డల జీవితాలను చీకటి మయం చేసుకోకూడదని ధైర్యంగా సమాజంలో నిలబడాలని స్త్రీలకు మంచి సందేశాన్ని అందించారు రచయిత్రి.

**ముగింపు :**

దోర్నాదుల సుబ్బమ్మ గారు రచించిన అన్ని కథలు చదువుతుంటే స్త్రీలు వారు పడుతున్న బాధలకు, వాళ్ళకు ఎదురౌతున్న సమస్యలకు వాటికి పరిష్కార మార్గాలు చూపేవిగా ఉంటాయి. వారు స్త్రీ పక్షపాతి అని వీరి కథలన్నీ నిర్భయంగా చెబుతాయి. కథల్లోని ప్రతిపాత్ర పరిచయమైనట్లుగానే ఉంటుంది. మనిషిని ఉన్నత పథాలవైపు నడిపించే కథలు వీరివి.

**ఆధార గ్రంథాలు :**

1. దీపస్తంభం కథల సంపుటి - దోర్నాదుల సుబ్బమ్మ.
2. సుప్రజ కథా సంకలనం - ముగ్గురు రచయిత్రుల కథా సంకటనం.
3. నెల్లూరు జిల్లా సాహితీ సర్వస్వం.

★★★

# ఈ పాటకు యాభై ఏండ్లు

- ఏ. శౌరిబాబు

ప్రజాకవి గూడ అంజన్న రాసిన "ఊరు మనదిరా వాడ మనదిరా" అనే పాట రాసి 50 ఏళ్లు దాటింది. అయినా కూడా ఈ పాటకు ప్రజలలో ఆదరణ ఇంకా తగ్గలేదు. ఆదరణతో పాటు సందర్భం వచ్చినప్పుడల్ల ఈ పాటను పాడుకుంటున్నారు. ఒక పాట ఇంతకాలం ప్రజల్లో సజీవంగా ఉండడానికి కారణం ఆ పాట ప్రజల జీవితానికి దగ్గరగా ఉన్నది. ఈ పాట ప్రజల వాడుక భాషలో రాయబడింది. మనకు ఊరు అనగా అనేక మంది గుర్తు వస్తారు. అనేక వృత్తులు గుర్తుకు వస్తాయి. వృత్తి పనిముట్లు గుర్తుకు వస్తాయి. వాటి ప్రయోజనం, గొప్పదనం మనకు తెలుసు. వృత్తికి, పనిముట్లకు, వృత్తికారునికి మధ్య ఉండే సంబంధాన్ని రచయిత చాలా శిల్ప ప్రావిణ్యం ప్రదర్శించారు.

గూడ అంజన్నది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, లక్సేటిపల్లి మండలం, లింగాపురం గ్రామం. ఈయన 1955లో లక్ష్మమ్మ, లక్ష్మయ్య దంపతులకు జన్మించారు. వీరికి ఆరుగురు సంతానం. గూడ అంజన్న ఐదవవాడు. గూడ అంజయ్య బిఫార్మసీ పూర్తి చేసి ఫార్మసిస్ట్‌గా ఉద్యోగిగా కొనసాగారు.ఆనాటి సామాజిక, రాజకీయ పరిస్థితులకు ప్రభావితం అయిన పాటను ఆయుధంగా ఎంచుకున్నారు. ఈయన పాటల్లో ఉత్తర తెలంగాణ యాస కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఈయన బతికినంత కాలం తెలంగాణ కోసం, తెలంగాణ ప్రజల కోసం బతికారు. వారి సమస్యల మీద పాటలు రాశారు.

"ఊరు మనదిరా ఈ వాడ మనదిరా"
పల్లె మనదిరా ప్రతి పనికి మనమురా
దొర ఏందిరో వాని పీకుడేందిరో"....

ఈ పాట విన్న తరువాత నిలువెల్లా చలించని మనిషుండడు. విన్న వారిని తన ఊరి గురించి ఆలోచించే విధంగా చేస్తుంది. ఇది ప్రజలకు కదిలించడమే కాదు దొరలను కూడా కంపింపజేసింది. దొర అనగానే మనకు ఒక భయం, పెత్తనం గుర్తుకు వస్తది. ఆ పెత్తనం తరతరాలుగా ఊరిని వేదిస్తున్నది. పీడిస్తున్నది. ఆ వేదన నుంచి, పీడన నుంచి విముక్తి రాగం ప్రజలకు అందించింది. ఈ పాట వినకలిగిన వారి బాగా అర్థమవుతుది. రచయిత ఊరు మనదిరా అంటూ వెంటనే వాడ మనదిరా అంటున్నారు. మన దేశంలోని ఊర్లు వాడలుగా విభజించబడ్డాయి. ఊరు అనగా మొత్తం గుర్తు వస్తే, వాడ అనగానే కులం విభజన గుర్తు వస్తది. కాని రచయిత మొత్తం ఊరును ఒక పిడిత సముహంగా గుర్తించి వారికి జరిగే అన్యాయాన్ని తెలియజేస్తున్నారు. సమస్త వృత్తులు చేసే ప్రజల మీద దొర పెత్తనం ఏంది అని ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ ఉత్పత్తి చేసే ప్రజాశక్తి మీద దొర జులుం ఏంది అని ప్రశ్నిస్తున్నారు.

"అరుక బట్టె మనం! అసెలుక దున్నె మనం
ఈ కంచె కాడ మనం! ఆ మంచె కాడ మనం
ఈ పాడి కాడ మనం! ఆ పశుల కాడ మనం - హెూయ్
దొడ్డి కాడమనమే! గడ్డాము కాడ మనమే
దొపిడేందిరో? దొర పోకడేందిరో? నడుమ
దోపిడేందిరో! దొర పోకడేందిరో?" ॥ఊరు॥

ఈ పాదంలో కూలి రైతు గురించి రచయిత చెపుతున్నారు. అరుక మనదే, దున్నే సెలుక మనదే అంటున్నారు. కంచె మనదే, మంచె మనదే, పాడి పంట మనదే, పశువులు కాసేది మనమే, ఆ పశువుల మనవే అంటున్నారు. దొడ్డికాడ మనమే, గడ్డాము దగ్గర మనమే అంటూ మన మధ్యన దొర ఏంది? దొర పెత్తనం ఏంది అని మనవ ముందు ప్రశ్నలు వేస్తున్నారు. ఇక్కడ రచయిత పాటలో ప్రతి వాక్యంలో మనం, మనం అనే పదాన్ని పదే పదే ఉపయోగించారు. మనకు ఊరు అనగానే ఒక నిర్మాణం గుర్తుకు వస్తది. ఆ నిర్మాణంలో కులపరంగా, వృత్తిపరంగా మనకు కనిపిస్తుంది. ఈ సముహమంతా

దొర కింద కూలి జనంగా బతుకుతారు. వీరికి కూడుం డదు. నీడుండదు. శ్రమ చేసే ప్రజలకి ఫలితం లేదని అంటున్నారు. ఈ పాట ద్వారా ప్రజలకు వాస్తవ విషయాలను తన కలం ద్వారా వ్యక్తపరుస్తున్నారు. ఈ పాటలో రచయిత ఒక ప్రాంతానికి, ఒక ఊరికి అంకితం చేసి రాయలేదు. యావత్ ప్రపంచానికి చెందిన విధంగా రాశారు. మనదేశంలో ఏ ఊరి ప్రజలైన ఈ పాటను అనువదించుకొని పాడుకోవచ్చు. రచయిత ఈ పాట ప్రాపంచిక దృక్పథంలో రాశారు.

రచయిత పాట కాలాన్ని ఒకసారి పరిశీలిస్తే, 1972లో సిరిసిల్ల, జగిత్యాల రైతాంగ పోరాటం కాలం. అప్పుడు ఉత్తర తెలంగాణ పల్లెలు ఉద్యమాల బాట పట్టాయి. ప్రజలకు ఉద్యమాలు తప్ప వేరే ద్యాసే లేదని చెప్పవచ్చు. అలాంటి పరిస్థితుల నుంచి ఈ పాట పుట్టింది. అంటే దున్నేవాడిదే భూమి నినాదంతో పుట్టిందని చెప్పవచ్చు. దున్నేవానిదే భూమి అంటే వ్యవసాయానికి సంబంధించిన ప్రతి పనిముట్టు మనదే దున్నేవానిదే అని చెప్పవచ్చు. రచయిత పల్లెల్లో ఉండే ప్రతి పనిముట్లు మీద శ్రమ జీవులదే హక్కు అని తెలుపుతున్నారు. రచయిత ఈ పాటను చాలా సామాజిక చైతన్యంతో ఈ పాట రాశారు.

ఊరి మీద అనేక పాటలు వచ్చాయి. అవి ఒక ఊరికి, ఒక ప్రాంతానికి పరిమితమైనవిగా ఉన్నాయి. కాని ఈ పాట మాత్రం యావత్ భారతదేశానికి చెందిన పాట చెప్పవచ్చు. "ఈ పాట సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో నిజంగా భూకంపాన్ని సృష్టించింది" అంటారు విప్లవ రచయిత వరవరరావు. (గూడ అంజయ్య - ఊరుమనదిరా పాటలు; 1999:6) అలాగే ప్రతి శ్రమజీవి ఈ పాట గురించి ఆలోచించవల్సిన విషయం. నాగరిక సమాజం వేసుకోవాల్సిన ప్రశ్న. గ్రామాల్లో దొరతనాలు వారు సాగించే పెత్తందారీ తనాలు కళ్లుండి చూసే ప్రతీవారికి కనిపిస్తాయి. "ఎవరి చెమట చుక్కలతో భూమిని తడిపి పంట పండిస్తున్నారో ఎవరు పండించిన పంటకు నోచుకోకుండా పోతున్నారో ఏ అమాయక శ్రమజీవుల మీద దొరతనాలు చెలాయిస్తున్నారో అక్కడి అట్టడుగు వర్గాలు ప్రశ్నించారు. నడుమ దొర ఏమిటని దొరతనమేమిటని ఆనాటి ప్రజలు నిలదీశారు".జులూరి గౌరిశంకర్ (గూడ అంజయ్య- ఊరుమనదిరా పాటలు; 1999:7)

తెలంగాణలో కొన్ని సంవత్సరాల నుంచి ఉవ్వెత్తున లేస్తున్న ఉద్యమాల వలన, దొరను దొరతనాన్ని ప్రశ్నిస్తున్న ఇలాంటి పాటల వలన మార్పులు గణనీయం. ఫ్యూడల్ సంసృతికి ముద్దుబిడ్డ అయిన దొరపదం తిట్టు పదం అనే అంత వ్యతిరేక భావం కలిగించింది ఈ పాట. తెలుగునేలలోనే కొన్ని గ్రామాల్లో ఈ పాట శ్రమజీవుల్లో ఎంతో నైతిక స్థైర్యాన్ని కలిగించింది. తమవి కాకుండా పోతున్న తమవైన ఊరు వాడ అన్ని శ్రమజీవులవేనని ఈ పాట చెప్పింది. నొక్కి పదే పదే చెప్పింది. ఈ పాట ఊరూరు ఇప్పటికి తిరుగుతూనే ఉంది. ప్రతివాడ మనదేనంటూ చెబుతూనే ఉన్నది. గత అర్థ శతాబ్దం నుంచి పాట తన పని తాను చేస్తూనే ఉన్నది. ఈ పాటకు ఉన్న బలం శ్రమజీవుల ఆనవాళ్లు, అస్తిత్వాలు ఈ పాటలో ఉన్నాయి. అందుకే నేటికీ ఈ పాట ప్రజల నోళ్లల్లో నాలుతూనే ఉన్నది. ఎన్ని సంవత్సరాలైయినా ప్రజల నోళ్లలో నానుతూనే ఉంటది. ఇలాంటి పాటలకు ఎప్పటికీ మరణం అనేది ఉండదని చెప్పవచ్చు. ప్రతిపనికి తామే సృష్టికర్తలమైన ప్రజలకు ఈ వ్యవస్థలో ఏమి ఒరగడం లేదు. అలాంటి సృష్టికర్తలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఈ పాట ప్రభావాన్ని అనుభవిస్తున్న శ్రమ జీవులకే ఈ పాట రాసిన రచయిత గూడా అంజయ్య చాలా మందికి తెలియకపోవచ్చు. కానీ పాట మాత్రం కోట్లాది మందికి తెలుసు. ఆ పాట ప్రజల్లో కలిగించిన చలనం తెలుసు. ఊరు సర్వసంపదలకు నిలయం. ఆ సంపద మీద ప్రజలకు హక్కు నామమాత్రమే ఆ నామమాత్రాన్ని పటాపంచలు చేసింది ఈ పాట. ఇక ఊరు ప్రజలదేనని గొంతు ఎత్తి పాడింది. పాడుతూనే ఉంటది.

## ఉపయోగించిన పుస్తకం :

1. గూడ అంజయ్య - ఊరుమనదిరా పాటలు; ప్రచురణ : హేమ సాహితి ప్రచురణలు, హైదరాబాద్, 1999.

★★★

# ఆధునిక వచన కవిత్వం – శైలి, శిల్పం

– **రాఘవేంద్ర రావు,** తెలుగు ఉపన్యాసకులు, ఎం వి ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహబూబ్ నగర్.

## ఉపోద్ఘాతం:

ఆధునిక సాహితీ ప్రక్రియలో బహుళ ప్రాచుర్యం పొందిన ప్రక్రియ కవిత్వం. కవులు, రచయితలు మేధస్సులో పుట్టుకొచ్చిన కొత్త కొత్త ఆలోచనలను కవితల రూపంలో చాలా చక్కగా పొందపరచగలిగారు. తెలుగులో ఆధునిక కవిత్వ ఆవిర్భావం భావకవిత్వం, భావప్రకటన స్వేచ్ఛ, మరియు సంఘ సంస్కరణ ఉద్యమాలతో ప్రారంభమైంది. గురజాడ అప్పారావు, రాయప్రోలు సుబ్బారావు వంటి ప్రముఖుల రచనలు పాత సంప్ర దాయాలను మార్చి కొత్త బాటలు వేశాయి. భావకవిత్వం:- ఆత్మాశ్రయత, ప్రకృతి ఆరాధన, ప్రేమ మరియు వ్యక్తిగత అనుభవాలకు పీఠపీట వేసింది. తర్వాత వచ్చిన అభ్యు దయ కవిత్వంలో కార్మికుల కష్టాలు, సామాజిక అసమానతలు మరియు విప్లవ భావాలను ఎత్తిచూపారు. అనంతరం దిగంబర, విప్లవ, వచన కవిత్వం కవులు ఛందో రహితంగా సామాజిక వేదనను, ఎదిరింపును నేరుగా వ్యక్తీకరించారు.

ఆధునిక కవిత్వం పాత పద్ధతులను మార్చి, కొత్త భావాలను, కొంగ్రొత్త ధోరణులను, నూతన కవితా రూపాలను పరిచయం చేసింది. వాటిలో ప్రధానమైనదే వచన కవిత్వం. 'Free verse' అనే ఆంగ్ల పదానికి సమానార్థకంగా వచన కవిత్వం అనే పదం ప్రయోగం లో ఉంది. కఠిన నియమాలు లేని కవిత్వ రూపమే వచనకవిత్వం. ఇది సామాజిక సమస్యలను ప్రజలకు తెలిపే సాహిత్య రూపం. ఇది ఛందోబద్ధ నియమాలను దాటి, స్వేచ్ఛగా మానవ జీవితాన్ని ఎంతో చక్కగా ప్రతి బింబిస్తుంది. ఆధునిక వచన కవులు తమ రచనలలో సమకాలీన జీవన చిత్రణతో పాటు శైలి, శిల్పములను ఎంతో చక్కగా అమర్చగలిగారు.

## ఆధునిక వచన కవిత్వం ప్రాముఖ్యత:

20వ శతాబ్దానికి ముందు తెలుగులో రచనా విధానం పూర్తిగా గ్రాంథిక భాషలో ఉండేది. పండితులు తప్ప పామరులకు పెద్దగా అర్థమయ్యేది కాదు. తర్వాతి కాలంలో తెలుగు కవిత్వం అనేక మార్పులు సంతరించు కొంది. ఆ క్రమంలో తెలుగు సాహిత్యం సాంప్రదాయ ఛందోబద్ధ నియమాలను అతిక్రమిస్తూ భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం మరియు విప్లవ కవిత్వం వంటి కొత్త ఆలోచనా ధోరణులతో కొత్త స్వభావాలను అల వరచుకుంటూ ముందుకు సాగుతోంది. బహిరాకృతిలో మార్పులతో పాటు ఆంతరంగిక ప్రకృతిని కూడా నిర్మించు కుంటూ వచన కవిత్వం ఆవిర్భవించింది. ఇది సమాజం లోని మార్పులు, భావ స్వేచ్ఛ మరియు మానవతా దృక్పథాన్ని ప్రతిబింబిస్తూ రూపుదిద్దుకుంది. ఆధునిక కవిత్వం ప్రాచీన సంప్రదాయాలకు భిన్నంగా స్వేచ్ఛ, వస్తు వైవిధ్యం, సామాజిక స్పృహ కలిగి ఉంటుంది. ఇది ఛందోబద్ధతను వీడి వచన కవితా రూపంలో సాగుతుంది ఆధునిక తెలుగు వచన కవిత్వంలో ప్రధాన లక్షణాలు వస్తు వైవిధ్యం, వచన కవితా రూపం, సామాజిక స్పృహ. ఇవి వచన కవిత్వ రచన లో ప్రస్ఫుటంగా కనబడతాయి.

## ప్రధాన లక్షణాలు:

ఆంగ్లేయుల విద్యావిధానం ప్రభావంతో భారతీయ సాహిత్యంలో అనేక పరిణామాలు సంభవించాయి. అది తెలుగు సాహిత్యంలో కూడా కనబడుతున్నది. గురజాడ రచనలలో ఇది స్పష్టంగా కనిపిస్తుంది. తరువాత వచ్చిన కవులు, రచయితలు దానిని అందుకొనడం అనివార్యంగా, అవిచ్ఛిన్నంగా కొనసాగింది. తత్ఫలితమే తెలుగులో వచ్చిన భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం తదితర రూపాలు. మరికొంత ముందడుగుగా విప్లవ, దిగంబర కవిత్వాలు వచ్చాయి. కావ్య వస్తువులోనూ, కవితారీతిలోనూ, కవి సమయాలలోనూ మార్పులు రావడం జరిగింది. తదనంతర పరిణామమే వచనకవిత్వం. అది పై మార్పు లకు కొనసాగింపుగానే వచ్చింది. వాటి లక్షణాలను గమనిద్దాం.

**సంప్రదాయ తిరస్కరణ:**

పాత పద్ధతులను మరియు కఠినమైన ఛందస్సును పక్కన పెట్టారు.

**ప్రజల భాష:**

గ్రాంథిక భాష స్థానంలో వ్యవహారిక భాష వాడకం ప్రారంభమైంది.

**పాశ్చాత్య సాహిత్య ప్రభావం:**

ఆంగ్ల సాహిత్య పరిచయం నూతన భావాలకు దారితీసింది. ఆధునిక కవిత్వం ప్రాచీన సంప్రదాయాలకు భిన్నంగా స్వేచ్ఛ, వస్తు వైవిధ్యం, సామాజిక స్పృహ కలిగి ఉంటుంది. ఇది ఛందోబద్ధతను వీడి వచన కవితా రూపంలో సాగుతుంది ఆధునిక తెలుగు వచన కవిత్వంలో ప్రధాన లక్షణాలు వస్తు వైవిధ్యం, వచన కవితా రూపం, సామాజిక స్పృహ. ఇవి వచన కవిత్వ రచనలో ప్రస్ఫుటంగా కనబడతాయి.

**వస్తు వైవిధ్యం:**

పురాణ గాథలలో కనబడే కావ్యం నాయకులను కాదని సామాన్య మానవుడిని కావ్యం నాయకుడిగా స్థాపించింది. తద్వారా మానవ జీవనసమస్యల వైపు దృష్టి మళ్లింది.

**వచన కవితా రూపం:**

ఛందస్సు, ప్రాస నియమాల బంధాలను, పాతబడిన కవిసమయాలను విడనాడింది. స్వేచ్ఛగా సాధారణ ప్రజలకు అర్థమయ్యే సరళమైన భాషతో వచన రూపంలో సాగింది.

**సామాజిక స్పృహ :**

మానవాతీత శక్తుల ప్రస్తావనలు, రాజులు, రాజ భోగాలు, ఉన్నత వర్గాల జీవనచిత్రణలకు కాలం చెల్లింది. పేదరికం, సాంఘిక అసమానతలు, కులం, వర్గ పోరాటాలు వంటి సమకాలీన అంశాలు వస్తువుగా మారాయి

**మానవతా వాదం:**

మనిషిని కేంద్రంగా చేసుకుని, మానవ జీవన సంఘర్షణలను, మానవీయ విలువలు, హక్కుల కోసం మరియు స్వేచ్ఛ కోసం గళం విప్పింది.

**భాషా సరళత:**

గ్రాంథిక భాష స్థానంలో అందరికీ అర్థమయ్యే వ్యావహారిక భాష వాడకం పెరిగింది.

## ఆధునిక వచన కవిత్వం - శైలి, శిల్పం:

**శైలి (Style):**

సాహిత్యంలో వస్తువును ఉన్నది ఉన్నట్లుగా కాక కళాత్మకంగా చెప్పడమే శైలి. ఆధునిక వచన కవిత్వంలో శైలి అనగా వ్యవహారిక భాషలో విషయాన్ని సరళంగా,సులభంగా మనసుకు హత్తుకునేలా చెప్పడం. శైలిని బట్టి కవిత్వ పై ఆసక్తి పెరుగుతుంది.

**శైలి రూపాలు:**

కవిత్వానికి సరళత్వం, కచ్చితత్వం, వ్యవహారిక రూపాన్ని ఇచ్చే శైలి రూపాలు క్రింద విధంగా ఉంటాయి.

**భాషా సరళత:**

గ్రాంథిక భాష, చందస్సు, ప్రాస నియమాలను పక్కన పెట్టి సామాన్యులకు సైతం అర్థమయ్యే వచన రూపంలో వ్యవహారిక భాషను ఉపయోగించడం జరిగింది. గురజాడ రచనల నుంచి ఆధునిక వచన కవుల వరకు మనం గమనించవచ్చు. అవసరమైన సందర్భాల్లో అవసరమైనంత మేరకు పారిభాషిక పదాలను వినియోగించుకోవచ్చు. కవి ఇందులో తన అనుభవం,అవగాహనననుసరించి కొత్త పదబంధాలను సృష్టించుకుంటాడు. అందువలననే కొంత మంది కవులలో వారికంటూ ప్రత్యేకత కలిగిన డిక్షన్ కనబడుతుంది.

**వస్తు విస్తృతి:**

ప్రాచీన సమాజంలో నిష్ఠలు, నియమ, నిబంధనలకు ప్రాధాన్యత ఉండేది. సామాజిక సమస్యలైన పేదరికం,స్త్రీ వాద సమస్యలు, దళిత సమస్యలకు ప్రాధాన్యత నివ్వడం కనబడదు. రాజకీయ అంశాలపైనే కాక అంతర్జాతీయ సమకాలీన సమస్యల్ని కూడా వచనకవులు స్పృశించారు. ఆధునిక సాహిత్యం సామాజిక అంతరాలను, సమస్యలను వస్తువుగా స్వీకరించింది. రచయిత అనుభవాల నుండి పుట్టిన లేదా కవి తాదాత్మ్యం చెందిన కవితా వస్తువులలో గాఢతను గమనించవచ్చు.

**భావస్పష్టత:**

కవి చెప్పదలుచుకున్న అంశాలను స్పష్టంగా, సరళంగా, అర్థం అయ్యే రీతిలో సూటిగా చెప్పటమే కాకుండా కొన్ని సార్లు పదునైన భావాలను ధ్వన్యాత్మకంగా చెప్పారు. పాఠకుడికి ఏ విధంగా చెబితే అవగతం అవుతుందో ఊహించి తమ రచనలలో భావప్రకటనను చేశారు. అలంకారాలు, చందస్సుల కంటే భావ తీవ్రతకు, వ్యవహారిక భాషకు ప్రాధాన్యతను ఇవ్వడాన్ని గుర్తించ వచ్చు.

సమకాలీన అంశాలకు ప్రాధాన్యత:- ప్రపంచీకరణ ప్రభావంతో భూగోళమే కుగ్రామంగా మారింది. అందు వలన ప్రపంచంలో ఏ మూలాన ఏ సంఘటన జరిగినా అది కావ్య వస్తువుకు కొరత లేకుండా పోయింది. కవి హృదయం వాటికీ ప్రతిగా స్పందించడంతో ఆధునిక జీవితానికి, ప్రస్తుత సమకాలీన సమస్యలకు, అనుభవా లకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం కనబడుతుంది.

**శిల్పం (Structure):**

శిల్పం అనగా అమరిక లేక నిర్మాణం. భావాన్ని కవిత్వంలా మలిచే నైపుణ్యంమే శిల్పం. వచన కవిత్వంలో చందస్సు ప్రాస నియమాలు లేకపోయినా చక్కని పదాలతో అద్భుతమైన భావాలను వ్యక్తపరచటం. భాష, భావచిత్రాలు, ప్రతీకలు, లయ ఇవే శిల్ప సౌందర్యాన్ని నిలబెడతాయి. వచన కవిత్వం ఛందోరహితమైనది కాబట్టి శిల్పానికి ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. రాయి శిల్పకారుడి చేతిలో బడి అందమైన రూపాన్ని ఎలా సంతరించుకుంటుందో వస్తువు మంచి రచయిత ప్రయోగంతో ఉత్తమ రచనగా భాసిస్తుంది.అందుకని కొన్ని లక్షణాలను పరిగణనలోకి తీసుకొనవచ్చు.

**భాష :**

కఠినమైన నియమాలు లేని కవిత్వ రూపమే వచన కవిత్వం. ఛందో నియమాలకంటే భావం అభివ్యక్తికి భాషనే సాధనంగా స్వీకరిస్తుంది. అందుకని వచన కవులు భాషలో నుడికారాలు, పదబంధాలు వాడుతుంటారు. కొన్ని సార్లు పాతబడిన కవిసమయాలను విడనాడి బలమైన భావ ప్రకటనకు కొత్త కవి సమయాలను సృష్టించడం జరుగు తుంది. అదే క్రమంలో కొత్త పదబంధాలను సృష్టించడం ఇందులో భాగమే. వీటిని మనం శ్రీశ్రీ సాహిత్యం లో కూడా గమనించవచ్చు.

**ప్రతీకలు:**

సమాజంలో ఉన్న రుగ్మతలు మరియు సమస్యలను భాష, భావప్రతిమలు, ప్రతీకల రూపంలో తెలియ పరచాలి. అందువలన అవి పాఠకుని మనసులో నాటు కుంటాయి. వస్తువుకు తగిన మాటలను వాడుతూ సొగసైన వర్ణనలు చేసి భావచిత్రాన్ని మనసులో నాటాలి. తెలిసిన విషయమే అయినా దానిని అబ్బుర పరిచే విధంగా చెప్పడానికి ప్రతీకలు, భావచిత్రాలు సహాయ పడతాయి.

**వస్తువు:**

ప్రారంభం నుండి ముగింపు వరకు భావం విడి పోకుండా కవిత్వమును ఒకే తాటి మీద నడపడం. సమకాలీన సమస్యల్ని పాఠకుడికి, శ్రోతకు మనసునుండి జారిపోకుండా అక్షరబద్ధం చేయడం వలన వస్తువుతో మమేకం కావడం. తద్వారా ఇతివృత్తం పొడవునా పాఠకుడు ప్రయాణం చేస్తాడు.

ఇవే కాక చిన్న ఖండికలోనైనా ఖచ్చితమైన భావాన్ని వ్యక్తపరచడం. అల్పాక్షరాలలో అనల్పార్థాన్ని ఇచ్చేవిగా ఉండం. లయ, అంతర్లీన సంగీతం, వాక్య నిర్మాణంలో సమతుల్యం ఉంటుంది. వస్తువు పక్కదారి పట్టకుండా కవిత్వం ఏకధారగా కొనసాగుతుంటుంది. వచన కవిత్వంలో చందస్సు లేదు. కాబట్టి శిల్పమే దానికి ప్రాణం. కాబట్టి ఆధునిక వచన కవిత్వం శిల్పం చాలా ముఖ్యం.

**ముగింపు:**

తెలుగులో ఆధునిక కవిత్వ ఆవిర్భావం భావకవిత్వం, భావప్రకటన స్వేచ్ఛ, మరియు సంఘ సంస్కరణ ఉ ద్యమాలతో ప్రారంభమైంది. గురజాడ అప్పారావు, రాయప్రోలు సుబ్బారావు వంటి ప్రముఖుల రచనలు పాత సంప్రదాయాలను మార్చి కొత్త బాటలు వేశాయి.

కాబట్టి గ్రాంథిక భాష లేక పద్య రూపంలో కాకుండా అందరూ అర్థం చేసుకోగలిగే వ్యవహారిక భాషలో ఆధునిక కవిత్వం ప్రారంభమైనది. దీనికి చక్కని రూపాన్ని ఇచ్చే శైలి,శిల్పం రచన వ్యాసంగానికి ఎంతో ముఖ్యమైనవి. సామాన్యమైన ప్రజలు మాట్లాడుకునే వాడుక భాష లాగా నే కవిత్వం ఉంటుంది.

**ఆధార గ్రంథాలు:**

1. ఆధునికాంధ్ర కవిత్వములు సంప్రదాయలు: ప్రయోగములు.. డాక్టర్ సి నారాయణ రెడ్డి
2. ఆధునిక తెలుగు కవిత్వంలో మానవతావాద ధోరణలు ..జి. అరుణ్ కుమారి
3. తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు..కె కె రంగనాథచార్యులు.

★★★

BHAVAVEENA
Vol. 21, Issue. 08, August 2024

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

# సి.నా.రె. కవితా పరిణామం - శిల్పవైవిధ్యం

- వి.ఎల్. నరసింహారావు, పరిశోధక విద్యార్థి.

ఆచార్య సి.నారాయణరెడ్డి గారు అపురూపమైన ప్రతిభ, అమోఘమైన ప్రజ్ఞాపాటవాలు, అనితర సాధ్యమైన అభ్యాసం, అనల్పమైన సంవిధాన చాతుర్యం, అజరామర మైన వచన కవితా సృష్టి, అభిరంజనమైన అభినవ దృక్పథం, అసాధారణమైన విమర్శనాదృష్టి, ఆస్వాద యోగ్యమైన వస్తువు, అమలినమైన భావనాశక్తి గల ఆధునికాంధ్ర కవి. 1952లో పూలపాటలతో ప్రారంభమైన ఈయన సాహితీ ప్రస్థానం లలిత గేయాలతో మొదలై గేయకథా కావ్యాలతో పరిపూర్ణమైంది. అంతటితో ఆగక 1959 నుండి వచన కవితలతో మొదలై 1980 నాటికి ఒక సమగ్ర వచన కవితా కావ్యంగా రూపుదిద్దుకుంది. నవ్వని పువ్వుతో వీరి కావ్యరచన ప్రారంభమై ఋతుచక్రం, అక్షరాల గవాక్షాలు, జాతిరత్నం, మధ్యతరగతి మంద హాసం, మంటలూ మానవుడూ వంటి ఎన్నో వచన కవితా సంపుటాల్ని వెలువరించారు.

విశ్వంభర, మట్టీ మనిషీ ఆకాశం వంటి దీర్ఘకావ్యాలు వ్రాశారు. సమకాలీన పరిస్థితులపై స్పందించడమే కాకుండా వాటికి పరిష్కార మార్గాలు కూడా సూచిస్తారు. కేవలం సమాజంలోని అభివృద్ధినే కాకుండా విశ్వమానవుని శ్రేయస్సే అంతిమలక్ష్యంగా ఎన్నెన్నో ఖండికలను వెలస్తూ తనదైన శైలిలో వచన కవితా యాత్ర కొనసాగిస్తున్నారు.

ప్రతి కవితకు తనదైన సమగ్రమైన ఒక నిర్మాణ చట్రాన్ని రూపొందించుకొని సృజనాత్మకతను చూపించి, ఏకనాదత లేకుండా, ఎత్తుగడ, వస్తు వివరణ, వ్యక్తీకరణ పద్ధతులు మొదలైన అంశాలలో వైవిధ్యాన్ని పాటించిన కవి సి.నా.రె. పద్య కవిత పోల్చుకుంటే వచన కవికి ఇది అదనపు బాధ్యత. వచన కవితా ఖండిక నిర్మాణానికి సంబంధించిన అంశాలపట్ల సి.నా.రెకు స్పష్టమైన అవగాహన ఉంది అందుకే వచన కవితా నిర్మాణంలో ఎన్నో నూతన ప్రయోగాలు చేశారు.

సి.నా.రె. వచన రచనలను పరిశీలిస్తే శీర్షిక ఆరంభం, ముగింపు మొదలైన వాటిని ముందే ఊహించుకొని కవిత రాయడం ఈయన పద్ధతి కాదనిపిస్తుంది. తాను ఎన్ను కున్న వస్తువుకు సంబంధించి మెరుపులాంటి ఒక ఆలోచనతో లేదా భావంతో కవితను రాయడం మొదలు పెట్టి ఆ తర్వాత తక్షణం మనసులో మెదిలిన ప్రకృతిలో కనిపించిన దాన్ని తన మనస్సులో ముద్రించి ఆ దృశ్యా లతో కవితను అల్లుకుంటూ పోవడం సి.నా.రెకు అలవాటుగా కనిపిస్తుంది. కవిత ఆరంభం తరువాత ఈయన అభివ్యక్తి రీతులు పరిశీలించదగినవి. వర్ణనలో ఎప్పుడూ ఒక విశేషణంతో, ఒక ఉపమానంతో, ఒక భావచిత్రంతో, ఒక పోలికతో తృప్తిపడక ఒక వస్తువుకు, ఒక స్థితికి అనేక రకమైన పొరలను, భిన్న పార్శ్వాలను ఏక కాలంలో దృశ్యమానం చేయటం కోసం అనేక విశేషణాలను, అనేక ఉపమానాలను, అనేక భావ చిత్రాలను వెదజల్లుతుంటారు. సి.నా.రె. వచన కవితల్లో శిల్పవైశిష్ట్యం అర్థం చేసుకోవాలంటే తప్పనిసరిగా ఆయన రచనలు చదవాలి. ఎంతటి అమూర్త అంశాలనైనా, ఎంతటి సంక్లిష్టస్థితిలోనైనా ప్రతీకాత్మక భావచిత్రాలతో రూపు కట్టించడానికి ప్రయత్నిస్తుంటాడు. తన నిత్య జీవితంలో తన అనుభవం వల్ల సంపాదించిన జ్ఞానాన్ని ఉపయోగించుకొని ప్రకృతిలోనూ, సమాజంలోను ప్రతి దృశ్యాన్నీ పరిశీలనగా చూసి తన మనస్సులో భద్రపరుచు కొంటాడు. ఆయా విశేషాలను సమాజ పరిస్థితులను బట్టి తన కవిత్వంలో అమరుతూ వాటిని సమర్థ ఉప మానాలుగా సమకూర్చి పాఠకుడికి ఆశ్చర్యపూర్వక ఆనందాన్ని కలగజేస్తాడు. ఇతివృత్తాన్ని ఉదాత్తీ కరించటంలో అలంకారికతలోని అతిశయాన్ని సమర్థంగా పరివర్తింపజేయడంలో సి.నా.రె. నేర్పరి.

శైలి వ్యక్తీకరణ నిర్వహణ పద్ధతులు, కవితా ఖండిక నిర్మాణ శిల్పం ఇత్యాది అంశాలలో మూసధోరణులను అధిగమిస్తూ ఏకనాదతను పరిహరించుకుంటూ పయ నిస్తున్న నిరంతర కవిత్వశీలి సి.నా.రె. వస్తునవ్యత, కల్పన

భాషానవ్యత అభివ్యక్తి నవ్యతల సమ్మేళనం వలన సి.నా.రె. కవిత్వం విభిన్నతను విశిష్టతను సంతరించుకుంది. అని చెప్పడంలో అతిశయోక్తి లేదు భాషకు స్థైర్యం ఇచ్చే అంశాల్లో లయబద్ధత ఒకటి, ఇటువంటి విశేషాంశాల ఆధారంగా సర్వకాలీన సర్వజనీన సత్యాలను స్ఫురింపచేయడాన్ని సి.నా.రె. కవితల్లో చూస్తాము.

అనుభూతులను కలిగించి తద్వారా మన సంస్కారంలో మార్పుతెస్తుంది. ఆ మార్పు అభ్యుదయ కరమైనదైతే ఆ సాహిత్యం అభ్యుదయ సాహిత్యమౌతుంది. స్థూలంగా ఇలా అనుభూతులను కలిగించే రచనా విధానాన్నే శిల్పమంటారు' (రాచమల్లు రామచంద్రారెడ్డి).

సాహిత్యంలో రూపం, వస్తువులలో ఏది ముఖ్యమన్నప్పుడు వస్తువని సమాధానం చెప్తారు. అలాగే సుందరత, వాస్తవికత, తాత్త్వికతలతో ఏది ప్రధానమంటే సుందరత అనే చెప్తారు. సాహిత్యం పాఠకుల మనస్సులోకి చొచ్చుకుపోవాలంటే సౌందర్యం అన్నిటికంటే ముందుండాలి. ఈ సౌందర్యరాశిని శిల్పమని పిలిచినా, అలంకారమని పిలిచినా అభ్యంతరముండదంటారు, రాంభట్ల కృష్ణమూర్తి. 'శిల్పం యొక్క ఆశయం విముఖుల్ని కూడా విషయోన్ముఖుల్ని చెయ్యటం' అంటారు కుటుంబరావు. 'శిల్పం' గురించి మాట్లాడటమంటే దాదాపు అన్ని అంశాలను గూర్చి మాట్లాడినట్లేనని పేర్కొన్నాడు మార్క్‌షోరర్ (Forms of modern fiction: Technique as discovery) ఇక్కడ అన్ని అంశాలూ అంటే పాత్రచిత్రణ, సన్నివేశకల్పన మొదలైనవని అర్థం.

వచన కవిత అయినా, పాట అయినా కవిత్వంతో విత్తితే మానవ హృదయ క్షేత్రాల్లోంచి అది చైతన్యమై మొలుచుకొస్తుందని నమ్మిన సిద్ధాంతం వీరిది. అభివ్యక్తిలో నవ్యత, భావంలో ఆర్ద్రత, గదిలోపలి సముద్రాన్ని ఇంకా గంభీరంగా నిలబెట్టాయి. ప్రతి కవితలోనూ మానవ పక్షపాతం కన్పిస్తుంది. మానవ అంతరంగాన్ని ఆవిష్కరించడం, చుట్టూ ఉన్న సమాజంలో అస్తిత్వం కోసం జరిగే పోరాటాన్ని వాస్తవిక దృక్పథంతో చిత్రీకరించడం.

ఉత్తమ కవిత్వాన్ని ఆవిష్కరించాలంటే - ముందు కవి సంఘటనలలో పడి ఛిద్రం కావాలి. జీవన కాలుష్యంలో పడి నలిగిపోయే సున్నిత భావాలను చక్కగా ఒడిసిపట్టు కోవాలి. దానికి తాత్త్వికతను అద్దాలి. సహజత్వాన్ని రంగరించాలి. చక్కని శైలితో ఒయ్యారం నేర్పాలి. ఇలాంటి విద్యలెన్నో తెలుసు సి.నా.రెకి. అందుకే ఈ సంపుటిలోని కవితలన్నీ విషయవైవిధ్యంతో, శిల్ప వైవిధ్యంతో సొగసు సంతరించుకొన్నాయి. సమస్యల్ని కళ్ళకు కట్టినట్టు చూపడం సాధారణ విషయం. కానీ సమస్య తాలూకు ప్రతిఫలనం ఊహించిన క్రాంతదర్శి సి.నా.రె.

కవిత్వమంటే అంతకుముందే స్థిరంగా ఉన్న ఒక అంశాన్ని కొత్తగా ఆవిష్కరించడం. అలాగే ప్రకృతికీ మానవునికీ మధ్య ఉండవలసిన బంధంలోని పరిధిని గుర్తించడం. అది కొందరికే సాధ్యం. అలా గమనించిన విషయాల్ని మానవ జీవన వికాసానికి దోహదం చేసే విధంగా వ్యక్తం చేయడం సి.నా.రె. ప్రత్యేకత. జీవితానుభవాన్ని, కవితానుభూతిగా మార్చి పాఠకుణ్ణి వాస్తవాల వెంబడి లాక్కుపోయే శక్తి సి.నా.రె. కవిత్వానికుంది.

కవితలన్నీ సాధారణంగా రెండు పాదాల భాగాలుగా సాగిపోవడం. (ఎక్కడైనా మూడు నాలుగు లేదా ఒకటి రెండు ఎక్కువగా ఉంటై). అక్షర పునరావృత్తి అలవోకగా వచ్చి భావస్ఫురణలో భాగం కావడం. లయపూరితమైన విరుపులు భావాలలో అంతస్రవంతిగా ఉండడం. గాఢ బంధం కలిగిన భావచిత్రాలు తరచుగా ఉండడం. ఒక్కొక్కప్పుడు పరంపరగా ఉండడం. భాషలో ఏవిధమైన క్లిష్టతా ఉండకపోవడం. (ఈ మాట ప్రత్యేకించి చెప్పడానికి కారణమేమిటంటే, లోతైన భావాలు, భావచిత్రాలతో నింపే చాలామంది కవుల్లో భాషాన్వయ క్లిష్టత పిలిస్తే పలుకుతుంది).

ఏ విదేశీ భావాల్ని గాని అనుకరించవలసిన అవసరమూ లేదు, ఎవరి ఆధిపత్యానికీ తల ఒగ్గవలసిన అగత్యమూ లేదు. అదే చెప్తున్నాడు ఈ కవి.

కవిత్వం కావాలంటే
నక్షత్రాల విపణుల్లోకి వెళ్ళనక్కరలేదు

డాలర్ల గడ్డను తవ్వనక్కరలేదు
ఖండాంతర గ్రంథ పంక్తుల
వీర్యకణాలను కొని తెచ్చి
అత్యాధునికంగా నారు పోసుకుని
ఇక్కడి కలంలోంచి ప్రసవించ నక్కరలేదు'

పై ఉపమానంలో కవి నిరసన ఎంత తీవ్రంగా ఉన్నదో గమనించవచ్చు.

కవిత్వం కవి స్వీయ చైతన్య ప్రతిబింబంగా ఉండాలి. తన ప్రాణమే తన కవిత్వంలో ప్రతిఫలించాలి. ఈ భావాన్నే కవిత ముగింపులో చెప్తాడు కవి.

అక్షరం ఉదయించాలి
ఒంటి మీది చెమటబిందువులా
కవిత్వం ప్రసరించాలి
ప్రాణవాయువుల్లో స్నానం చేసి కురులార్చుకునే
ప్రభాత కిరణంలా

అక్షరాల కవిత్వం; అక్షరం ఉదయించడం - కవిత్వం ప్రసరించడం; అక్షరానికి కవి మనశ్శ్రమను సూచించే చెమటబిందువు అతికినట్లున్న పోలిక; అక్షరం, కవిత్వమై ప్రసరించినప్పుడు 'ప్రాణ' వాయువుల్లో, అంటే కవి ప్రాణశక్తిలో నుండి రావడం; చెమటబిందువులా ఉదయించిన అక్షరం స్నానం చేసి కురులార్చుకుని ప్రభాత కిరణం కావడరాఅన్నీ కలిసి ఒక పొందికైన భావచిత్రం.

నిత్యజీవితంలో ఎదురయ్యే సన్నివేశాలకూ, ప్రకృతి దృశ్యాలకూ స్వాప్నికుడు భావుకుడు అయిన కవి కవితాత్మకంగా స్పందించిన పదచిత్రాలు - భావచిత్రాల. అన్వయ సౌలభ్యంతో కూడిన ప్రతీకాత్మకత సినారె కవిత్వంలోని గుణం.

శిలలకు సిజేరియన్ ఆపరేషన్ చేస్తే
శిల్ప శిశువులు ఉదయిస్తాయి.
మీట గలిగితే సుప్తజీవన రహస్యాలు శ్రుతిమయ
కృతులై మేలుకొంటాయి.

సామాన్య పదాలతోనే భావ సౌందర్యాన్ని మూర్తి కట్టించటం ఆయన ప్రత్యేకత.

కవిత్వ విమర్శలో అతి ప్రచురంగా ప్రయోగింపబడే 'ఇమేజ్' అనే పదాన్ని నిర్దిష్టంగా నిర్వచించటం సులభ సాధ్యం కాదు. ఈ శబ్దానికి ప్రతిమమూర్తి, ప్రతికృతి, ప్రతిబింబం, చాయ, ప్రతిచ్ఛాయ మొదలైన అర్థాలున్నాయి. సాధారణార్థంలో ఏదయినా ఒక సంఘటనకు గాని వస్తువుకు గాని, వ్యక్తికి గాని చేసే ప్రతి సృష్టిని 'ఇమేజ్' అనవచ్చు. పంచేంద్రియాను భవాల వలన ఏర్పడే మానసిక చిత్రాన్ని 'ఇమేజ్'గా పేర్కొన్నారు విమర్శకులు. తెలుగులో భావచిత్రం, కావ్యబింబం అనే పర్యాయ పదాలు ప్రయోగంలో ఉన్నాయి.

కవిత్వంలోని అనుభూతి గాఢత, చిత్రలేఖనంలోని అభివ్యక్తి విశిష్టత కలిసి ఏర్పడిన సమగ్ర కవితాకళ భావచిత్రం. వర్ణసంయోజన సాదృశ్యంలో ఉపమ కనిపించవచ్చు. చిత్రీకరణ సామర్థ్యంలో రూపకం రూపుకట్టవచ్చు. లేఖలు ప్రతీకాత్మకంగా ప్రతిస్పందించవచ్చు. సమగ్రచిత్రం స్వభావోక్తికి సమాదర్శం కావచ్చు. అప్రస్తుత విషయాన్ని వ్యంజించవచ్చు, సర్వకవితా సామగ్రిని సమాదరించే సమగ్ర సజీవ కవితాశతపత్రం భావచిత్రం.

'రసం యొక్క వ్యక్తీకరణ, అలంకారం యొక్క శోభ, వ్యంజన స్వభావమైన వక్రత, సంగీతం యొక్క ధ్వని సాధన, శిల్పం యొక్క సౌష్టవం. చిత్ర లేఖనంలోని రాగాత్మకత, శైలి యొక్క వైయుక్తికతలకు సమాహార రూపమే భావచిత్రం' అన్నారు.

మనస్సు, బుద్ధి ఏకాగ్రమయినప్పుడే కళ్ళు చూసిన దృశ్యం భావ చిత్రంగా రూపొందుతుంది. ఇంద్రియానుభవం హృదయంలో అనుభూతిగా మారి, బుద్ధి ద్వారా నిశ్చయాత్మకమవుతుంది. మనో బుద్ధులు చేసే ఈ గ్రహణ పరిశీలనలే దృశ్యేతర ఇంద్రియానుభవాల విషయంలో కూడా చూడటంగా చెప్పబడుతుంది. కనుక ఏ ఇంద్రియాను భూతికయినా దృశ్యతత్త్వం తప్పనిసరి. ఇంద్రియానుభూతులలోని దృశ్యాతత్త్వమే కవి అభివ్యక్తి విశిష్టత ననుసరించి వివిధ భంగిమలలో భావచిత్రంగా సాక్షాత్కరిస్తుంది.

ఒక భావాన్ని అభివ్యక్తం చేసేటప్పుడు అసలు వస్తువుకు ప్రతినిధిగా వస్తుపదార్థ స్వరూపాన్ని, స్వభావాన్ని

